WWW.nindam.co.in Andhrapradesh తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, జనవరి 30, 2024 | సంపుటి - 20 | సంచిక 142 | వెల - 6 | పేజీలు - 12

## ప్రాణాలు తీసిన మిత్రుల సరదా

### కృష్ణానదిలో పడి ముగ్గురు యువకుల మృతి

**గుంటూరు,జనవరి 29 (నినాదం న్యూస్):** సరదాగా గడిపేందుకు కృష్ణా నదిలోకి వెళ్లిన ముగ్గురు బాలురు నీటిలో మునిగి మృతిచెందిన విషాద ఘటన గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇసుక అక్రమ తవ్వకాలతో ఏర్పడిన గుంతల కారణంగా ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏడాది క్రితం ఇదే ప్రాంతంలో ఈత కోసం నీటిలోకి దిగిన విజయవాడ నగరానికి చెందిన అయిదుగురు చనిపోయారు. విజయవాడ నగరం పటమట కెనరా బ్యాంకు రోడ్డుకు చెందిన గగన్(17) ఇంటర్ చదువుతున్నాడు.

02

## గ్యాంగ్‌స్టర్ దారుణహత్య

కాళ్లూచేతులు కట్టేసి నిప్పటించిన దుండుగలు

# ఏపీలో వేడెక్కుతున్న రాజకీయం

టిక్కెట్లు దొరకని నేతల నుంచి పెరుగుతున్న అసమ్మతి



## పరస్పర విమర్శలతో నేతల దాడులు

### ముప్పేట దాడులతో పార్టీ నేతల సన్నద్ధం

"ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అనేక సమస్యలు, సవాళ్ళను ఎదుర్కొంటోంది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు టిక్కెట్లు దొరకని నేతల నుండి పెరుగుతున్న అసమ్మతితో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సహా వివిధ వర్గాల వారి నుండి నిరసనలు, ఆందోళనలను ఎదుర్కొంటోంది."

**అమరావతి,జనవరి 29 (నినాదం న్యూస్):** 2019 అసెంబ్లీ ఎన్నికల్లో, మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు గాను జగన్ పార్టీ 151 గెలుచుకుంది. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లోనూ 22 సీట్లను కైవసం చేసుకుంది. ఇటువంటి సవాళ్ళతో కూడిన సంక్లిష్ట సమయంలో, ఈసారి మొత్తంగా 175 అసెంబ్లీ స్థానాలను గెలుచుకునేలా పార్టీ కార్యకర్తల్లో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపేందుకు జగన్మోహన్ రెడ్డి 'వై నాట్ 175' అంటూ ఒక నినాదాన్ని తెర మీదకు తెస్తున్నారు. స్వంత పార్టీలోనూ, బయట పెరుగుతున్న అసమ్మతి ప్రభావం ఎన్నికల ఫలితాలపై ఎలా వుంటుందో అంచనా వేయడం అంత సులభం కాకపోవచ్చు కానీ అందుకుగల అవకాశాలను తోసిపుచ్చలేం.ఇక ఎన్నికల్లో గెలుపు కోసం అన్ని పార్టీలు రంగంలోకి దిగాయి. ఒకవైపు అధికార పార్టీ వైసీపీ, మరోవైపు ప్రధాన ప్రతిపక్షం టీడీపీ, ఇంకో వైపు.. కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలలు భారీ ఎత్తున సభలు నిర్వహిస్తూ రాజకీయ వేడి పుట్టిస్తున్నాయి. వైసీపీ అధినేత జగన్, అటు టీడీపీ అదినేత చంద్రబాబు కూడా.. పెద్ద ఎత్తున ఈ సభల్లో విమర్శలు.. ప్రతి విమర్శలు చేసుకున్నారు. షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు కూడా వేడిని అందుకున్నాయి. వచ్చే ఎన్నికలకు ఇది నాంది అన్నట్టుగా మూడు పక్షాలు కూడా.. విమర్శలు సంధించుకున్నారు.

02

## ఆందోళనలతో ప్రభుత్వ వ్యతిరేకత

ప్రజల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి

ఎన్నికల్లో ప్రభావం చూపనున్న కార్మిక సంఘాలు

04

ఎపిలో ఇటీవలి వరుస ఆందోళనలు అధికార వైసిపిపై తీవ్ర వ్యతిరేకతను చాటాయి. ఈ ప్రభుత్వం తమను పట్టించుకోదన్న వైఖరిలో పలు రంగాలు ఉన్నాయి. మరింత మెరుగైన వేతనాలు, ప్రయోజనాలు కావాలని వివిధ విభాగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.



పరమాత్మ అవతారంగా

## మోడీ ఫీల్

తనకుతానుగా విష్ణుమూర్తి 11వ అవతారంగా భావన

మోడీ నిరంకుశ తీరుపై మండిపడ్డ మల్లికార్జున ఖర్గే

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తనను తాను విష్ణుమూర్తి 11వ అవతారంగా అనుకుంటున్నారని, మతాన్ని రాజకీయాలతో ముడిపెడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిశిత విమర్శలు చేశారు. ప్రజలు ఉదయం లేవగానే దేవీదేవతలు, గురువుల ముఖాలు చూడడానికి బదులు తన ముఖమే చూడాలని ప్రధాని కోరుకుంటున్నారని అన్నారు.

02

**డెహ్రాడూన్,జనవరి 29(నినాదం న్యూస్):** డెహ్రాడూన్‌లోని బన్నూ స్కూల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఖర్గే మాట్లాడుతూ, విష్ణుమూర్తి దశావతారులు గురించి అందరికీ తెలుసునని, ప్రధాని ఇప్పుడు విష్ణువు 11వ అవతారంగా అనిపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. మతపరమైన సెంటిమెంట్లను ఉపయోగించుకుని ఈఏడాది లోక్‌సభ



ఒత్తిడితో కూడిన

## చదువు మంచిదికాదు

ఇతరులతో పోల్చి విద్యార్థుల్లో న్యూనత పెంచవద్దు

పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ప్రధాని మోడీ సూచన

03

రాజ్యసభ ఎన్నికలకు

## షెడ్యూల్ విడుదల

తెలుగు రాష్ట్రాల్లో ఆరు స్థానాలకు ఎంపిక

ఫిబ్రవరి 8న రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్

ఫిబ్రవరి 27న పోలింగ్ ..అదే రోజున ఓట్ల లెక్కింపు

03

రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. 15 రాష్ట్రాలకు చెందిన 56 మంది సభ్యుల ఎంపికకు ఈసీ షెడ్యూల్ రిలీజ్ చేసింది. ఫిబ్రవరి 8న రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుండగా.. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుంది. అదే రోజున ఓట్ల లెక్కింపు ఉంటుంది. నామినేషన్ దాఖలుకు ఫిబ్రవరి 15 చివరి తేదీ, ఉపసంహరణకు చివరి తేదీ ఫిబ్రవరి 20. తెలంగాణలో మూడు, ఏపీలో మూడు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రాజ్యసభ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం నాడు షెడ్యూల్ విడుదల చేసింది.



## ముఖ్యమంత్రి అయ్యాక మారిన జగన్

రాష్ట్ర ప్రజల హక్కుల కోసం పోరాడుతా

- బిజెపికి అండగా ఉన్నా ప్రాజెక్టులు ఎందుకు రాలేదు
- వైఎస్ మార్క్ అభివృద్ధికి దూరంగా జగన్ పాలన
- సాక్షిలో నాకూ సమాన వాటా ఉంది
- కడప కార్యకర్తల సమావేశంలో షర్మిల ఘాటు విమర్శలు

03



## కడప పర్యనటలో సునీతతో షర్మిల భేటీ

02

పలు అంశాలపై ఇరువురు చర్చలు



## సుప్రీంకోర్టులో చంద్రబాబుకు ఊరట

బెయిల్ రద్దు పిటిషన్‌ను కొట్టేసిన ధర్మాసనం

సుప్రీంకోర్టులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి ఊరట లభించింది. ఐఆర్ఆర్ కేసులో సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది.

03

## అధ్వాన్నంగా ఎపిలో రోడ్లు

గుడివాడలో టిడిపి-జనసేన ఇంటింటి ప్రచారం

జనసేన

## కేటిఆర్‌వి అహంకారపూరిత వ్యాఖ్యలు

- సిఎం రేవంత్‌పై వ్యాఖ్యలు దారుణం
- మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి, మల్లు రవి
- అహంకారానికి పరాకాష్ట అన్న సిపిఐ నారాయణ

**అమరావతి,జనవరి 29(నినాదం న్యూస్):** సీఎంరేవంత్ రెడ్డి.. కేసీఆర్ కాలు గోటికి కూడా సరిపోడంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్వలు పెరిగాయి. కెటిఆర్ అహంకారానికి పరాకాష్టగా పలువురు నేతలు మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు, మంత్రులు, సిపిఐ నేత నారాయణ కూడా మండిపడ్డారు. ఇంకా అధికార అహంకారం వీడలేదని విమర్శలు చేశారు. కెటిఆర్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కెటిఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదన్నారు. ప్రజలు గుణపాఠం చెప్పినా పద్దతి మారలేదన్నారు. కాలి గోటికి సరిపోనివాడే మిమ్మల్ని ఫామ్ హౌస్ కు పంపించాడని ఘాటు విమర్శలు చేశారు.

02




దర్శకుడు కొరటాల శివకు

## చుక్కెదురు

శ్రీమంతుడు కథను కాపీ కొట్టినందుకు కేసు

నాంపల్లి కోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం



**న్యూఢిల్లీ:** మహేశ్ బాబు హీరోగా నటించిన శ్రీమంతుడు సినిమాకు సంబంధించి కాపీ రైట్ యాక్ట్ కింద డైరెక్టర్ కొరటాల శివకు.. సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. నాంపల్లి సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం కచ్చితంగా క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సిందే అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి వ్యవహారాలపై విచారణను ఎదుర్కోవాలి అయితే..

02

## ప్రాణాలు తీసిన మిత్రుల సరదా

**మొదటిపేజీ తరువాయి**

ఎనిమిదో తరగతి చదువుతున్న తన స్నేహితులైన ప్రశాంత్(13), కార్తీక్(13), షేక్ షారుఖ్‌లతో కలిసి సరదాగా గడిపేందుకు యనమలకుదురు సమీపంలోని కృష్ణా నదికి వెళ్లారు. అక్కడ ఒడ్డున కొద్దిసేపు ఫొటోలు దిగారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రశాంత్, కార్తీక్, గగన్ నీటిలోకి దిగారు. సరిగా అక్కడే గుంత ఉండడంతో ఒక్కసారిగా అందులోకి కూరుకుపోయారు. ఈత రాకపోవడంతో సహాయం చేయాలని కేకలు వేయగా, ఒడ్డున ఉన్న షారూఖ్ వారిని కాపాడేందుకు ప్రయత్నించాడు. సాధ్యం కాకపోవడంతో సమీపంలో ఉన్న జాలర్లకు విషయం చెప్పాడు. వారు అక్కడికి చేరుకుని ముగ్గురినీ కర్రలతో లాగేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. చివరికి వల వేసి వెలికి తీసినా.. అప్పటికే వారు మరణించారు. మృతుల బంధువులు, తల్లిదండ్రులే మృతదేహాలను చేతుల మీదుగా మోసుకుంటూ ఒడ్డుకు చేర్చారు. విగతజీవులుగా మారిన బిడ్డలను చూసి వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారంతా రాత్రి 8 గంటల వరకు నదిలోనే గడపాల్సి వచ్చింది.

## గ్యాంగ్‌స్టర్ దారుణహత్య

**చండీఘుడ్:**

హర్యానాలోని యమునానగర్‌లో గ్యాంగ్ షీటర్ రాజన్ దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు రాజన్ చేతులు, కాళ్లు కట్టేసి నిప్పంటించారు. పశ్చిమ యమునా కాలువ ఒడ్డున ఈ ఘటన జరిగింది. ఈ హత్యకు బాధ్యత వహిస్తూ దేవేంద్ర బంబిహా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. ఘటనపై సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పాట్ కు చేరుకున్నారు. మృతుడు రాజన్ ఎన్నో నేరాలకు పాల్పడుతూ పోలీసులకు వాంటెడ్ క్రిమినల్ గా పేరు గాంచాడు. అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కాల్వ ఒడ్డున కాలిపోయిన వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందింది. మృతదేహాన్ని పరిశీలించి రాజన్ గా గుర్తించారు.యితే.. ఈ హత్యకు బాధ్యత వహిస్తూ ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ వైరల్ అవుతోంది. రాజన్ హత్యకు దేవేంద్ర బంబిహా బాధ్యత వహిస్తున్నట్లు ఉంది. ఈ పోస్టు గురించి పోలీసు అధికారిని ప్రశ్నించగా తమకు ఏమీ తెలియదని చెప్పారు. మృతుల సన్నిహితులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా మృతుడు ఒక సంవత్సరం నుంచి ఇంటికి వెళ్లలేదని ఎవరితోనూ పరిచయం గానీ సంబంధ బాంధవ్యాలు గానీ లేవని పోలీసులు చెప్పారు.

## ఏపీలో వేడెక్కుతున్న రాజకీయం

**మొదటిపేజీ తరువాయి**

విశాఖలో వైసీపీ అధినేత జగన్.. ఎన్నికల శంఖం పూరించారు. 'సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో ఎన్నికలకు తాము సిద్ధయ్యామని స్పష్టం చేశారు. ఇక, రా.. కదలిరా! సభలతో టీడీపీ అధినేత చంద్రబాబు పార్లమెంటు స్థాయి నియోజకవర్గాల్లో కొన్నాళ్లుగా సభలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కూడా వచ్చే ఎన్నికలకు రెడీ అయిపోయామని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీని పుంజుకునేలా చేసేందుకు వైఎస్ షర్మిల చేపట్టిన యాత్రలు కూడా జోరుగానే సాగుతున్నాయి. ఆయా సభలు, యాత్రల్లో ఒకరిపై ఒకరు విమర్శలతో రెచ్చిపోతున్నారు. ఒకరు రాష్ట్రానికి పట్టిన శని వదులుతుందని అంటే.. మరొకరు.. రాష్ట్రానికి ఉన్న శకుని వదిలిపోతాడని మాటల తూటాలు పేల్చుకున్నారు. అటు వైపు మాటల తూటాలు పేలితే.. ఇటు వైపు అంతకుమించిన బాంబులే పేలాయి. ఇలా.. ఇరు పక్షాల మధ్య పోటా పోటీ వ్యాఖ్యలు చోటు చేసుకున్నాయి. షర్మిల ఏకంగా.. అన్న సీఎం జగన్‌పైనా, అధికార పార్టీపైనా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. మొత్తంగా ప్రచార హోరు హోరెత్తిపోతోంది. బిజెపి నుంచి ప్రచారంలోకి మోడీ, అమిత్ షాలు కూడా త్వరలోనే అడుగు పెట్టనున్నారు. అదేసమయంలో జనసేన అదినేత పవన్ కళ్యాణ్ కూడా జోరు పెంచుతున్నారు. టీడీపీ నుంచి నారా ఫ్యామిలీ, నారా లోకేష్, బ్రాహ్మణి, బాలయ్య.. వంటివారు దిగిపోనున్నారు. ఇక, కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా మరింత మంది ప్రచారం చేయనున్నారు. జై భారత్ నేషనల్ పార్టీ సహా కమ్యూనిస్టులు కూడా అరంగేట్రం చేయనున్నారు. మొత్తంగా ఎన్నికల వేడితో ఎపి రాజుకుంటోంది.

## పరమాత్మ అవతారంగా మోడీ ఫీల్

**మొదటిపేజీ తరువాయి**

ఎన్నికల్లో గెలవాలనుకుంటున్న బీజేపీని తిప్పికొట్టాలని ప్రజలను కోరారు. మతాన్ని రాజకీయాలతో ముడిపెడితే మంచి, చెడులను నిర్వచనం చాలా కష్టమవుతుందన్నారు. మతాన్ని ఒక ఉపకరణంగా మోదీ, బీజేపీ వాడుకుంటున్నాయి. విద్వేష భావాలను సృష్టిస్తున్నాయి. వారికి దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ఎలాంటి ఆసక్తి లేదు. సొంత అధికారం, ఎజెండాపైనే వారి దృష్టంతా ఉంది‘ అని ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్, ఆ పార్టీ నేతలను చూసి బీజేపీ భయపడుతోందని, ఆ కారణంగానే వారిని ఆడిపోసుకుంటోందని ఖర్గే అన్నారు. జహహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, సోనియాగాంధీతో పాటు రాహుల్ గాంధీ కూడా బీజేపీ నేతల కలల్లోకి వస్తుండటంతో వారికి నిద్రపట్టడం లేదన్నారు. కాంగ్రెస్ పట్ల ఉన్న భయంతోనే బీజేపీ అధికారంలో ఉన్న అసోంలో కాంగ్రెస్ పర్యటనలను అడ్డుకుంటోందన్నారు. కాంగ్రెస్ ర్యాలీపై రాళ్లు విసిరారని, పోస్టర్లు చించివేసి, జెండాలు తొలగించారని చెప్పారు. కాంగ్రెస్ యాత్రలకు ఒక్క అసోంలో మినహా ఎక్కడా అంతరాయం కలగలేదని, అడ్డుకోలేదని అన్నారు. ఈ తరహా ఎత్తుగడలకు తాము భయపడేది లేదన్నారు. ప్రజల హక్కులు కాపాడేందుకు, ప్రభుత్వ తప్పిదాలపై పోరుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. కాంగ్రెస్ నేతలు దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారని, స్వాతంత్య్ర కోసం, దేశ సమైక్యత కోసం తమ ప్రాణాలను అర్పించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ప్రజలకు ఎప్పుడూ పార్టీ అండగా నిలబడుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి త్యాగాలు, సేవల చరిత్ర ఉందని, ప్రగతి, న్యాయం కోసం ఒక విజన్ అంటూ ఉందని ఖర్గే చెప్పారు. నవభారత నిర్మాణమనే మిషన్ కోసం కాంగ్రెస్ శ్రమిస్తోందన్నారు. రైల్వేలతో సహా వివిధ ప్రభుత్వ విభాగాల్లో 30 లక్షకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం యువతకు తగినన్ని ఉద్యోగావకాశాలు కల్పించడం లేదని ఖర్గే విమర్శించారు. అగ్నివీర్ పథకం ద్వారా నాలుగేళ్లు ఉపాధి కల్పించి, ఆ తర్వాత నుంచి యువతకు ఉపాధి లేకుండా చేస్తుందని ఖర్గే అన్నారు.

## గుడివాడలో టిడిపి-జనసేన ఇంటింటి ప్రచారం

గుడివాడ : ఏపీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని.. కొండకోనల్లో ఉన్నామ అన్నట్లుగా.. నందివాడ మండల రహదారులు ఉన్నాయని గుడివాడ టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. రాము ఆధ్వర్యంలో సోమవారం నాడు మండల కేంద్రమైన నందివాడ గ్రామంలో ' బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులతో కలిసి ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ... 'అయ్యా ఎమ్మెల్యే ప్రజలను మనుషులుగా గుర్తించు.. ఒక్కసారి రోడ్లపైకి వస్తే ప్రజల కష్టాలెంటే తెలుస్తాయి' అని వెనిగండ్ల రాము అన్నారు.నికిరాని వ్యక్తినా మనం ఎన్నుకున్నది అని ప్రజలందరూ బాధపడుతున్నారని చెప్పారు. చేసిన తప్పు తెలుసుకుని టీడీపీ. జనసేన కూటమికి మద్దతు తెలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నందివాడ మండల ప్రగతికి చేయూతనిచ్చేలా ఆక్వాహబ్ ఏర్పాటు చేస్తామని ఇప్పటికే చంద్రబాబు ప్రకటించారన్నారు. పాలకులకు తీరిక లేకపోయినా, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను చొరవ తీసుకుంటున్నానని తెలిపారు.

# కెటిఆర్‌వి అహంకారపూరిత వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి**

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీ నగర్ మండలంలోని మహాదేవపూర్‌లో వేణుగోపాల స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కోమటిరెడ్డి .. రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మూడవరోజే మూసి ప్రక్షాళన గురించి మాట్లాడారని.. మీరెప్పుడైనా దాని గురించి మాట్లాడారా అని ప్రశ్నించారు. కేటీఆర్ బాషా మార్చుకోవాలని, ముఖ్యమంత్రిని గౌరవించడం నేర్చుకోవాలని మంత్రి కోమటిరెడ్డి హితవు పలికారు. రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్ జెడ్పీటీసీ నుంచి సీఎం అయిన వ్యక్తి అని.. నువ్వు కేసీఆర్ పేరుతో దొంగ మాటలు చెప్పి ఎమ్మెల్యే అయ్యావని విమర్శించారు. రేవంత్ రెడ్డి చిటికెనా వేలుకు కూడా సరిపోవంటూ కేటీఆర్ పై ధ్వజమెత్తారు. కేటీఆర్ అహంకారంతోనే నల్లగొండ జిల్లాలో వేల ఓట్లు మెజార్టీతో ఎమ్మెల్యేలు గా కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చెప్పింది అంటే చేసే చూపిస్తుందని తెలిపారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లు రవి అన్నారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ కాలిగోటికి కూడా రేవంత్ రెడ్డి సరిపోరని అంటూ కేటీఆర్ మాట్లాడిన మాటలు ఆయన అహంకారానికి పరాకాష్ట అని అన్నారు. ప్రజలు తీర్పు ఇస్తే ప్రజాస్వామ్య బద్ధంగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి రాష్ట్రంలో విప్లవాత్మక పాలన చేస్తున్నారని అన్నారు. ప్రజారంజకంగా, ప్రజా పాలన చేస్తూ ప్రజల మనసులలో స్థానం సంపాదించా రన్నారు. ప్రజాభిమానంతో సీఎంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల కేటీఆర్ ఇలా అనుచితం గా మాట్లాడ్డం ప్రజలను అవమానించడమే అవుతుందని మల్లు రవి అన్నారు. ఇలా నోటికొచ్చినట్టు మాట్లాడితే ప్రజలు తిరగబడుతారన్నారు. హరీష్ రావు ముఖ్యమంత్రికి హుందాతనం లేదని అనడం ఆయన అహంకారానికి పరాకాష్ట అన్నారు. ప్రజలకు మరింత చేరువుగా ఉంటూ ప్రజా పాలన చేస్తూ హుందాగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డిని ఇలా అనడం పద్దతి కాదని, కేటీఆర్, హరీష్ రావు వారి పద్దతి మార్చుకోవాలని మల్లు రవి హితవుపలికారు. భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీపీఐ అగ్ర నేత నారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ తానే ముఖ్యమంత్రి అనే భావనలో ఉన్నారని మండిపడ్డారు. ఆయన మాట తీరు అలా ఉందని సీపీఐ నారాయణ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నడుస్తోందని, రేవంత్ రెడ్డి సీఎం పదవీ చేపట్టారని కేటీఆర్‌కు గుర్తుచేశారు. అయితే సిఎం అన్న గౌరవం కూడా లేకుండా కెటిఆర్ విమర్శలు చేయడం దారుణమన్నారు. ఇది అహంకారానికి పరాకాష్ట అన్నారు. కులగణన చేపట్టాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సీపీఐ నారాయణ స్వాగతించారు. కాంగ్రెస్ పార్టీలో సమస్యలు ఉన్నప్పటికీ సరిదిద్దుకొని ముందుకెళ్లాలని సూచించారు. తెలంగాణ నేతలు కలుపుకొని వెళ్లడంతో విజయం సాధించారని సీపీఐ నారాయణ వివరించారు. బీఆర్ఎస్ ఓటమి అనుభవాలను కాంగ్రెస్ పార్టీ దృష్టిలో ఉంచుకొని పాలించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఐ ఐదు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తుందని స్పష్టంచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు 17ఏ కోసం ఉద్యమించాలని సీపీఐ నారాయణ సూచించారు. బీహర్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై సీపీఐ నారాయణ మండిపడ్డారు. కక్కిన కూడు తినేందుకు నితీశ్ ఆశపడ్డారని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయోధ్య రామాలయం ఎన్నికల స్టంట్ అని ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచార బ్రాండ్ అంబాసిడర్‌గా అయోధ్య రామాలయం పనిచేస్తుందన్నారు. అందుకోసమే ఇంటింటికీ రాముడి అక్షింతలు పంపి లబ్ది పొందాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నించాయని నారాయణ ధ్వజమెత్తారు. తీర్పులు చెప్పే న్యాయ మూర్తులు కూడా అయోధ్యకు



వెళ్లొచ్చారని గుర్తుచేశారు. కోర్టులు, దర్యాప్తు సంస్థలు బీజేపీ గుప్పిట్లో ఉన్నాయని మండిపడ్డారు. అయోధ్య రావాలని బీజేపీ అగ్రనేత అద్వానీని ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. రాముడి పేరు చెప్పి ఓట్లు అడగడాన్ని బీజేపీ ప్రారంభించిందని తేల్చిచెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో పబ్లిక్ సెక్టార్ అమ్మడం తప్ప కొత్తగా స్థాపించినవి ఏమీ లేవని విమర్శించారు. భారతదేశం హిందూ దేశం కాదని, ఇక్కడ అన్ని మతాల వారు ఉన్నారని సీపీఐ నారాయణ వివరించారు. దేశ స్వాతంత్య్ర కోసం అన్ని మతాలు, వర్గాలు ఏకమై పోరాడాయని గుర్తుచేశారు.

## దర్శకుడు కొరటాల శివకు చుక్కెదురు

**మొదటిపేజీ తరువాయి**

ఈ వ్యవహారంతో నిర్మాతకు సంబంధం లేదని సుప్రీంకోర్టు తెలిపింది. 'శ్రీమంతుడు' స్టోరీని స్వాతి మ్యాగజైన్‌లో ప్రచురించిన కథ ఆధారంగా కాపీ చేశారని..రచయిత శరత్ చంద్ర గతంలో హైదరాబాద్ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు డైరెక్టర్ కొరటాల శివపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో నాంపల్లి కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ, కొరటాల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. శ్రీమంతుడు సినిమాకు సంబంధించి కాపీ రైట్ యాక్ట్ కింద మొదలైన వివాదం డైరెక్టర్ కొరటాల శివ చాలా రోజుల నుంచి ఎదుర్కొంటున్నారు. నిర్మాత ఎర్నేని రవి, ఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్‌లపై కాపీ రైట్‌యాక్ట్ కేసుతో పాటు ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేయాలన్న కథ రచయిత శరత్ చంద్ర (ఆర్డీ విల్సన్) అభ్యర్థనను హైకోర్టులో పెట్టుకున్నారు. కానీ తమ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. 'చచ్చేంత ప్రేమ' పేరిట తాను రాసిన నవలలో స్వల్ప మార్పులు చేసి శ్రీమంతుడు పేరిట సినిమా తీశారంటూ ఆ మూవీ డైరెక్టర్ కొరటాల శివ, నిర్మాతలు ఎర్నేని రవి, ఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్లపై రచయిత శరత్ చంద్ర క్రిమినల్ కేసు పెట్టారు. దీనిని సవాల్ చేస్తూ ఆ ముగ్గురూ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో కాపీ రైట్ యాక్ట్ కింద డైరెక్టర్ కొరటాల శివ విచారణ ఎదుర్కోవాల్సిందేనని హైకోర్టు గతంలో తేల్చి చెప్పింది. ఇదే సమయంలో వారిపై చీటింగ్, ఫోర్జరీ కేసుల నమోదుకు ఉత్తర్వులివ్వాలని శరత్‌చంద్ర తన పిటిషన్‌లో కోరారు. 'శ్రీమంతుడు కథలో స్వల్ప మార్పులు ఉన్నాయని 8 మంది రచయితల కమిటీ చెప్పింది. దీంతో డైరెక్టర్ కాపీ రైట్ యాక్ట్ నిబంధనల ప్రకారం విచారణను ఎదుర్కోవాలి. ఎందుకంటే, దర్శకుడే కథా రచయతకు, స్క్రీన్‌ప్లేకు సొమ్ము చెల్లించారు. కథనంలో మార్పులు చేసి తన కథ అంటే కుదరదు. ఇలాంటి వ్యవహారాలపై విచారణను ఎదుర్కోవాలి. ఈ వ్యవహారంతో నిర్మాతకు సంబంధం లేదు. ఇదే సమయంలో దర్శకుడు, నిర్మాత, ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలపై చీటింగ్, ఫోర్జరీ కేసులు చెల్లవు‘ అని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది.



## కడప పర్యటనలో సునీతతో షర్మిల భేటీ

కడప : ఎన్నికల టైం దగ్గర పడుతున్న కొద్దీ ఏపీ రాజకీయాల్లో రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైసీపీ, టీడీపీ, జనసేన మధ్య జరుగుతున్న షర్మిల ఎంట్రీతో కాంగ్రెస్ కూడా చేరింది. మొన్నటి వరకు తెలంగాణ రాజకీయాలకే పరిమితమైన షర్మిల ఏపీలోకి వచ్చీరాగానే స్పీడ్ పెంచేశారు. పీసీసీ పగ్గాలు తీసుకున్న ఆమె... అన్నపై విమర్శల బాణాలు ఎక్కుపెడుతున్నారు. రోజుకో జిల్లాలో పర్యటిస్తూ రోజుకో షాక్ ఇస్తున్నారు. పీసీసీ చీఫ్ షర్మిల బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి రోజుకో కొత్త విషయంతో జగన్‌ను ప్రశ్నిస్తున్నారు. తనను ఒంటరిని చేసిన విషయం, ఇంటి తగాదాలు అన్నింటిపై సీరియస్‌గా రియాక్ట్ అవుతున్నారు. ఇప్పుడు ఆమె మరో అడుగు ముందుక వేశారు. షర్మిల బాబాయి, వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీతతో సమావేశమయ్యారు. కడప కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి భేటీకి వెళ్లిన షర్మిల... ఇడుపులపాయలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధికి నివాళి అర్పించారు. అనంతరం సునీతతో సమావేశమయ్యారు. షర్మిల ఇప్పటి వరకు చాలా అంశాలను ప్రస్తావిస్తూ వస్తున్నారు. కుటుంబ వ్యవహారాలు, పార్టీ అంశాలు, ప్రజా సమస్యలు ఇలా ప్రతి ఒక్కదాంట్లో జగన్‌ను సూటిగానే ప్రశ్నిస్తున్నారు. జగన్, అవినాష్ రెడ్డిపై ఉన్న ప్రధాన ఆరోపణ అయిన వైఎస్ వివేక హత్యపై ఇంత వరకు స్పందించలేదు. ఆ అంశాన్ని కూడ ఇంత వరకు టచ్ చేసింది లేదు. ఇప్పటి వరకు ఎందుకు ఆ విషయంలో రియాక్ట్ కాలేదన్న ఓ వైపు జరుగుతున్న టైంలో సునీతతో షర్మిల భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. సునీత, షర్మిల భేటీలో ఏ అంశాలు ప్రస్తావనకు వచ్చాయో తెలియదు కానీ దీనిపై రకరకాల ఊహానాలు జరుగుతున్నాయి. సునీత కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం నడుస్తోంది. ఆమెను కడప ఎంపీగా కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో నిలపాలనే ఆలోచనలో షర్మిల ఇతర నేతలు ఉన్నట్టు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దీనిపై ఇరు వర్గాల నుంచి ఎలాంటి స్పందన మాత్రం లేదు. ఈ భేటీ తర్వాత ఎవరూ మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.



## అభివృద్ధి కోసం పదేళ్లపాటు కష్టపడ్డాం

**మహాలక్ష్మితో ఆటోడ్రైవర్లకు గోస**

**ఎక్కడా 24 గంటల కరెంట్ రావడం లేదు**

**చేవెళ్ల అసెంబ్లీ సమీక్షలో కెటిఆర్ విమర్శలు**

హైదరాబాద్: పదేండ్లు ఎంతో కమిట్‌మెంట్‌తో పనిచేశామని.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సర్కారును నడిపించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడోవంతు సీట్లను ఇచ్చి బలమైన ప్రతిపక్షంగా పని చేయమని ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదేశించా రని చెప్పారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్పు అనే పేరుతో అమాయకులైన యువతను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లను సర్కారు గోసపెడుతు న్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఎక్కడా 24 గంటల కరెంటు రావడం లేదని చెప్పారు. ల్గ, తుబంధు అడిగితే చెప్పుతీసి కొడతామని అంటున్నారని విమర్శించారు. రైతుభరోసా ఇచ్చామంటూ అంతర్జాతీయ వేదికలపై అబద్ధం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులను చెప్పుతో కొడతా మంటున్న కాంగ్రెస్‌ను ఓటుతో కొడదామన్నారు. అధికారంలో వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, ఇప్పటికీ అది అమలుకాలేదని చెప్పారు. రుణం తెచ్చుకున్న రైతులకు మొండి చేయి చూపించారని విమర్శించారు. డిసెంబర్ 9న రుణమాఫీ ్గ, లుపై సంతకం చేస్తామని రేవంత్ చెప్పారని గుర్తుచేశారు. తాము ప్రభుత్వంలో ఉన్నామనే విషయాన్ని కాంగ్రెస్ మర్చిపోయినట్లుందని ఎద్దేవాచేశారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఎప్పటి నుంచి ఇస్తారని ప్రశ్నించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ ప్రసంగం సామాన్య కాంగ్రెస్ కార్యకర్త ప్రసంగం కంటే హీనంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చిందని, ఆ హామీలను అమలు చేయకుంటే బట్టలిప్పి నిలబెడతా మన్నారు. నోటికొచ్చిన హామీలిచ్చి ఇరుక్కుపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ఐదేండ్లు అధికారం నిలుపుకుంటుందా.. లేదా వేచి చూద్దామన్నారు. పార్లమెంటు ఎన్నిల కోడ్ రాకముందే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బెదిరింపులకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని సూచించారు. ఎలాంటి కష్టం వచ్చినా తాము అండగా నిలబడతామని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో ప్రజల్లోకి వస్తారని చెప్పారు. దేశానికి, రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదన్నారు. బీజేపీ వచ్చాకే మనం బొట్టు పెట్టుకోవడం నేర్చుకున్నాం అన్నట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఐటీఐఆర్‌పై బండి సంజయ్ ఒక్క మాట మాట్లాడలేదని, తెలంగాణ కోసం పార్లమెంటులో మాట్లాడేది బీఆర్ఎస్ నాయకులు మాత్రమేనని స్పష్టం చేశారు.



## తెలంగాణను అప్పులకుప్ప చేసిన బిఆర్ఎస్

**అభివృద్ధి పేరుతో అప్పుల ఊబిలోకి నెట్టారు**

**ముషీరాబాద్ బూత్ సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి**

హైదరాబాద్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క పరిశ్రమను ఏర్పాటు చేయలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. కానీ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారని అన్నారు. ఓ రకంగా చెప్పాలంటే రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకున్నారని మండిపడ్డారు. సోమవారం నాడు బాగ్ లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు వాజీ హుస్సేన్, కల్పన యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.... విద్య, వైద్యాన్ని కాంగ్రెస్ అభివృద్ధి చేసిందని తెలిపారు.కాంగ్రెస్ ఆస్తులు, సంపద సృష్టిస్తే బీఆర్ఎస్ విధ్వంసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ కోసం ప్రతి కార్యకర్త కష్ట పడతారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం చరిత్రాత్మక నియోజకవర్గమని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ నగరం గర్వకారణమని చెప్పారు. తెలంగాణను అభివృద్ధి చెసింది ఆనాటి కాంగ్రెస్ నాయకులేనని అన్నారు.

## నర్సారెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

### సంతాపం ప్రకటించిన సిఎం రేవంత్ తదితరులు

హైదరాబాద్ :

మాజీ పీసీసీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి నర్సారెడ్డి మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. అలాగే పలువురు మంత్రులు, నేతలు కూడా నర్సారెడ్డికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షులుగా, మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివి అని నేతలు కొనియాడారు. నర్సారెడ్డి మృతిపట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియ జేశారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ప్రజలకు ఆయన అనేక సేవలందించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షులుగా, మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన అనుభవాలు తమకు మార్గదర్శకంగా ఉండేవని చెప్పుకొచ్చారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మనిషి, నీతికి నిజాయితీకి మారు పేరుగా నిలిచిన మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి పి. నర్సారెడ్డి ఈరోజు ఉదయం స్వర్గస్తులయ్యారని తెలియజేయడానికి చింతిస్తున్నామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నామని తెలిపారు. నర్సారెడ్డి మృతి పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంతాపం తెలిపారు. నిజాయితీగా రాజకీయాలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకొని జీవితాంతం నమ్ముకున్న సిద్ధాంతం కోసం పని చేసిన మాజీ పీసీసీ అధ్యక్షులు పి.నర్సారెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పి.నర్సారెడ్డి మరణం పట్ల రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విలువలు కలిగిన రాజకీయ నాయకుడిగా, కాంగ్రెస్ వాదిగా, సుపరిపాలనాదక్షుడిగా అందరి మన్ననలు పొందారని గుర్తుచేశారు. ఆయన రాజకీయ జీవితం నేటితరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అలంకరించిన నర్సారెడ్డి మృతి రాష్ట్రానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షులు పొద్దుటూరి నర్సారెడ్డి మృతిపై ఉమ్మడి జిల్లాలోని అన్ని పార్టీల నేతలు సంతాపం తెలియజేశారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షులుగా నర్సారెడ్డి విశేష సేవలు అందించారని కొనియాడారు. నర్సారెడ్డి మృతితో స్వగ్రామం సారంగాపూర్ మండలం మలక్‌చించోలిలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన చేసిన సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకుంటున్నారు. నర్సారెడ్డి మృతిపై మాజీ మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి తీవ్ర దిగ్భం, `రతిని వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి పారుదల, రెవెన్యూ శాఖల మంత్రిగా ఆయన సమర్ధవంతంగా పని చేశారని ఇంద్రకరణ్‌రెడ్డి కొనియాడారు.



# మధుర శ్రీకృష్ణజన్మభూమి సమస్య

### అహాబాద్ హైకోర్టు ఉత్వర్వులపై సుప్రీం స్టే


**న్యూఢిల్లీ:**
ఉత్తరప్రదేశ్‌లోని మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి –షాహీ ఈద్గా మసీదు వివాదానికి సంబంధించి షాహీ ఈద్గా మసీదుకు కమిషన్‌ను నియమిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టేను పొడిగించింది. తదుపరి విచారణ వరకు ఈ స్టే కొనసాగుతుందని సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి–షాహీ ఈద్గా మసీదు వివాదానికి సంబంధించిన అంశంపై విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఈ కేసులోని వాది ప్రతివాదుల అభ్యర్థనలను వ్రాతపూర్వక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి జన్మభూమి వివాదానికి సంబంధించి అలహాబాద్? హైకోర్టు నియమించిన కమిషన్? విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లహాబాద్ హైకోర్టు మసీదు ప్రాంగణంలో సర్వేను పర్యవేక్షించేందుకు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించేందుకు అంగీకరించింది. ఈ ఆలయం ఒకప్పుడు హిందూ దేవాలయంగా ఉండేదని సూచించే గుర్తులు ఉన్నాయని పిటిషనర్లు పేర్కొన్నారు.

# ఒత్తిడితో కూడిన చదువు మంచిదికాదు

### ఇతరులతో పోల్చి విద్యార్థుల్లో న్యూనత పెంచవద్దు

### పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ప్రధాని మోడీ సూచన

**న్యూఢిల్లీ:**
విద్యార్థులపై ఒత్తిడి పెంచడం..ఇతరులతో పోల్చడం వంటి చర్యలు సరి కాదని తల్లిదండ్రులకు ప్రధాని మోడీ సూచించారు. పాజిటివ్ దృక్పథంతో వారిని ముందుకు సాగేలా చూడాలన్నారు. రోజుకు 10 నుంచి 12 గంటలు చదవాలని తల్లిదండ్రులు విద్యార్థుల పైన ఒత్తిడి చేయడం మంచిది కాదని ప్రధాని మోదీ




అన్నారు. పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఢల్లీలోని భారత మండపంలో విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా పరీక్షలు రాసే చిన్నారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడి లేకుండా చూసుకోవాలని.. తల్లిదండ్రులు కూడా వారిపై ఒత్తిడి పెంచకూడదన్నారు. పిల్లలను తల్లిదండ్రులు మరొకరితో పోల్చకూడ దని అది వారి భవిష్యత్తుకు హాని కలిగిస్తుందని మోదీ తెలిపారు. విద్యార్థులు తమతో తాము పోటీపడాలని చెప్పారు. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లల రిపోర్ట్ కార్డును విజిటింగ్ కార్డుగా భావిస్తున్నారని, అది మంచిది కాదన్నారు. ఉపాధ్యాయులు కూడా తమ పనిని కేవలం ఉద్యోగంగా భావించకుండా.. విద్యార్థుల జీవితాలను బలోపేతం చేసే విధంగా మార్చుకోవాలన్నారు ప్రధాని మోదీ. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు చూడాలని సూచించారు. విద్యార్థులు మన దేశ భవిష్యత్తును నిర్మిస్తారన్న మోదీ... ఇప్పటి పిల్లల్లో సృజనాత్మకత ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల ఈ కార్యక్రమం తనకి కూడా పరీక్ష లాంటిదేనని చెప్పుకొచ్చారు. ఈసారి పరీక్షా పే చర్చా కార్యక్రమానికి ప్రతి రాష్ట్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులను, ఓ టీచర్‌ను ఆహ్వానించారు. కలా ఉత్సవ్ విజేతలను కూడా ఆహ్వానించారు. ఓ ◌ూఉనీల పోర్టల్ ద్వారా సుమారు 2.26 కోట్ల మంది విద్యార్థులు ఈ కార్యక్రమం కోసం రిజిస్టర్ చేసుకున్నారు.

# సుప్రీంకోర్టులో చంద్రబాబుకు ఊరట

### బెయిల్ రద్దు పిటిషన్‌ను కొట్టేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ:**
సుప్రీంకోర్టులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి ఊరట లభించింది. ఐఆర్ఆర్ కేసులో సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. కనీసం నోటీసులు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని అభిప్రాయపడిరది. గతంలో సుప్రీంకోర్టు ఇదే



కేసులో దాఖలు చేసిన ఎస్ఎల్‌పీని రద్దు చేసిన నేపథ్యంలో చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఐఆర్ఆర్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం వేసిన పిటిషన్ ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఇదే కేసులో సహ నిందితులపై ఉన్న ఉత్తర్వులు చంద్రబాబుకూ వర్తిస్తాయని తెలిపింది. 420 సెక్షన్ చంద్రబాబుకు ఎలా వర్తిస్తుందని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు. 17 ఏ సెక్షన్‌తో ఈ కేసుకు కూడా సంబంధం ఉందా? అని ధర్మాసనం నిలదీసింది. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. కాగా ఐఆర్ఆర్ కేసులో ఏపీ హైకోర్టు చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఏపీ ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేసింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. న్యూఢల్లీ: సుప్రీంకోర్టులో ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి ఊరట లభించింది. ఐఆర్ఆర్ కేసులో సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. కనీసం నోటీసులు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని అభిప్రాయపడిరది. గతంలో సుప్రీంకోర్టు ఇదే కేసులో దాఖలు చేసిన ఎస్ఎల్‌పీని రద్దు చేసిన నేపథ్యంలో చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.

# ముఖ్యమంత్రి అయ్యాక మారిన జగన్

### వైకాపా కోసం పనిచేస్తే తనపైనే దాడులా

### రాష్ట్ర ప్రజల హక్కుల కోసం పోరాడుతా

### బిజెపికి అండగా ఉన్నా ప్రాజెక్టులు ఎందుకు రాలేదు

### వైఎస్ మార్క్ అభివృద్ధికి దూరంగా జగన్ పాలన

### సాక్షిలో నాకూ సమాన వాటా ఉంది

### కడప కార్యకర్తల సమావేశంలో షర్మిల ఘాటు విమర్శలు





**కడప:**
జగన్ ముఖ్యమంత్రి అయ్యాక పూర్తిగా మారిపోయారని ఏపీసీసీ అధ్యక్షురాలు, ఆయన సోదరి వైఎస్ షర్మిల ఆరోపించారు. వైకాపా కోసం నిస్వార్థంగా పని చేస్తే.. ఇప్పుడు తనపైనే వ్యక్తిగత దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడపలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. తనకు ఎప్పుడూ పదవీ కాంక్ష లేదని, ఎన్ని అవరోధాలు కల్పించినా రాష్ట్ర ప్రజల హక్కుల కోసం పోరాటం సాగిస్తానని స్పష్టం చేశారు. 'వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా తన మార్క్ రాజకీయం, సంక్షేమ పాలన అందించారు. అదిప్పుడు జగనన్న పాలనలో ఎక్కడ ఉంది. వైకాపాని అధికారంలోకి తీసుకొచ్చేందుకు 3,200 కి.మీ పాదయాత్ర చేశా. అలాంటిది ఇప్పుడు నాపైన మూకుమ్మడిగా దాడి చేస్తున్నారు. రోజుకొకరితో నాపై వ్యక్తిగతంగా దూషణలు చేయిస్తున్నారు. ప్రణబ్ ముఖర్జీతో నా భర్త అనిల్ కలిసి రాజకీయం చేశారని మాట్లాడుతున్నారు. జగన్‌ను జైల్లో పెట్టి నేను ముఖ్యమంత్రి కావాలని బ్రదర్ అనిల్ కోరినట్లు విష ప్రచారం చేస్తున్నారు. అదంతా అబద్ధం' 'సోనియా గాంధీ దగ్గరికి అనిల్.. భారతి రెడ్డితో కలిసే వెళ్లేవారు. వైకాపా నేతలకు దమ్ముంటే ప్రణబ్ ముఖర్జీ కుమారుడిని అడిగి తెలుసుకోండి. జగన్ పత్రికలో నా పైన వ్యక్తిగతంగా వార్తలు రాయిస్తున్నారు. ఆ పత్రికలో జగన్‌కు ఎంత భాగస్వామ్యం ఉందో నాకూ అంతే ఉంది. ఆ విషయం మరిచి ఆ పత్రిక ఇష్టానుసారం వార్తలు రాస్తోంది. వైకాపా నాయకులు ఏం రాసినా, ఏం చేసినా భయపడే ప్రసక్తే లేదు. ఏం చేసుకుంటారో చేసుకోండని షర్మిల తీవ్రంగా మండిపడ్డారు. రోజుకో బాంబు పేలుస్తూ వైసీపీకి సమస్యగా మారిన ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల మరో బాణం వదిలారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడిన జగన్ మీడియా అయిన సాక్షిలో తనకూ భాగం ఉందంటూ ప్రకటించారు. తనపై రోజుకో జోకర్‌ను తీసుకొచ్చి విమర్శలు చేయిస్తున్నారని మండిపడ్డారు. తనపై ఎన్ని నిందలు వేసినా తాను మాత్రం వైఎస్ షర్మిలా రెడ్డినే అన్నారు. తెలంగాణలో తనతో కలిసి పని చేసిన వాళ్లకు సాక్షి సంస్థ ఫోన్లు చేస్తుందని... తనపై వ్యతిరేకంగా మాట్లాడాలని అడుగుతున్నారన్నారు షర్మిల. అదే సాక్షి సంస్థలో తనకూ భాగం ఉందన్నారు. వైఎస్సారే తనకు సగం భాగం ఇచ్చారని చెప్పారు. సగం భాగం ఉన్నా నాపై నా సంస్థ బురద చల్లుతుందని ఆవేదన చెందారు. తాను ప్రజల సమస్యల మాట్లాడుతున్నానని.. హామీల వైఫల్యాల మీద మాట్లాడుతున్నానని చెప్పారు. విలువలు ,విశ్వసనీయత లేకుండా దిగజారుతున్నారని అన్నారు. తండ్రి వైఎస్ రక్తమే తనలో ఉందన్నారు షర్మిల. పులి కడుపున పులే పుడతుందని చెప్పుకొచ్చారు. ఏపీ తన పుట్టినిల్లు అన్న షర్మిల... అందుకే ఇక్కడ రాజకీయాలు చేయడానికి వచ్చానంటూ చెప్పుకొచ్చారు. ఏం పీక్కుంటారో పీక్కోండని... ఎన్ని నిందలు వేస్తారో వేసుకోండని సవాల్ చేశారు. ఎడుగూరి సందింటి రాజశేఖర్ రెడ్డి ఈ కడప బిడ్డ. పులివెందుల పులి అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన షర్మిల తర్వాత వైసీపీ టా `గ్గం ట్‌గా డోసు పెంచారు. తెల్లని పంచే కట్టు మొహం నిండా చిరునవ్వుతో నేటికీ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారన్నారు. వైఎస్సార్ పథకాలతో ముఖ్యమంత్రి అంటే ఇలా పని చేయాలని నిరూపించారన్నారు. వైఎస్సార్ పథకాలు పొందని గడపే లేదని అభిప్రాయపడ్డారు షర్మిల. పార్టీలకు అతీతంగా అందరూ ఆయన పథకాలు పొందారన్నారు. అలాంటి మార్క్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా వైఎస్ ఆర్ ఉండేవారని అన్నారు వైఎస్ షర్మిలా రెడ్డి. ఆయన పథకాలే ఒక మార్క్ అని చెప్పుకచ్చారు షర్మిల. రైతులకు రుణమాఫీ వైఎస్సార్ మార్క్, 50 లక్షల మంది బిడ్డలకు ఫీజు రీయింబర్స్మెంట్ వైఎస్సార్ మార్క్. 46 లక్షల పేదలకు పక్కా ఇళ్లు కట్టడం వైఎస్సార్ మార్క్ అంటూ పథకాలు పేర్లను వివరించారు. మాట తప్పడం మడమ తిప్పడం వైఎస్సార్ కి చేతకాదని అన్నారు షర్మిల. తనకు మేలు చేస్తే..జీవితాంతం గుర్తు పెట్టుకోవడం వైఎస్సార్ మార్క్ అన్నారు. తన అనుకున్న వాళ్లకు ప్రాణం సైతం ఇవ్వడం వైఎస్సార్ మార్క్. నమ్మిన వాళ్ళను మనసులో ఎప్పటికీ ఉంచుకోవడం వైఎస్సార్ మార్క్. ప్రజలకు అందుబాటులో ఉండటం వైఎస్సార్ మార్క్, పథకాలు అందుతున్నాయో లేదో చూడటం వైఎస్సార్ మార్క్ అంటూ వివరించారు. వైఎస్ బతికే ఉంటే కడప స్టీల్ వచ్చేదన్నారు. అదే పూర్తై ఉంటే కచ్చితంగా 20 వేల మందికి ఉద్యోగాలు వచ్చేవి అన్నారు. లక్ష మందికి పరోక్షంగా ఉపాధి దొరికేది అని అభిప్రాయపడ్డారు. నేటి పాలకుల కారణంగా కడప స్టీల్ ఒక కల గానే మిగిలిపోయిందని విమర్శించారు షర్మిల. కాంగ్రెస్ పార్టీ కడప స్టీల్ ప్రాజెక్ట్ ను విభజన హామీల్లో పెట్టిందని గుర్తు చేశారు. చంద్రబాబు 18 వేల కోట్లతో మళ్ళీ శంకుస్థాపన చేశారని... 5 ఏళ్లలో నిర్లక్ష్యం చేశారన్నారు. ఆ టైంలో జగన్ దీక్షలు కూడా చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి అయ్యాక రెండు సార్లు శంకుస్థాపన చేశారని వివరించారు. కడప స్టీల్ ను శంకుస్థాపన ప్రాజెక్ట్ గా మార్చారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ హయాంలో కడప నుంచి బెంగళూర్ వరకు రైల్వే లైన్ అనుమతి తెచ్చారని వివరించారు. కేంద్రంతో మాట్లాడి ప్రాజెక్ట్‌కు నిధులు కూడా తెచ్చారన్నారు. 25 కిలేమేటర్ల వరకు నిర్మాణం జరిగిందని... ఎస్సార్ మరణం తర్వాత ఈ ప్రాజెక్ట్ పట్టించుకునే వాళ్లే లేరన్నారు. జగన్ హయాంలో ఆ రైల్వే లైన్ అవసరం లేదని లేఖ రాశారని ఆరోపించారు. ఒక చిన్న లైన్ చాలని సర్దుకున్నారని విమర్శించారు. మట్టి బిందెను తీసుకొని బంగారు బిందె ఇచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు. మోడీతో దోస్తీ చేసే మీరు ఎందుకు ఈ ప్రాజెక్టులను తేలేక పోయారని ప్రశ్నించారు షర్మిల. అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకు పోతే ఇంత వరకు మరమ్మత్తులు లేవన్నారు. రోడ్డున పడ్డ కుటుంబాలను పట్టించుకోలేదని ఆరోపించారు. వైఎస్సార్ తన జీవితంలో బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించారని... అలాంటి వ్యక్తి ఆశయాలను జగన్ నిలబెడుతున్నరా ? అని ప్రశ్నించారు. వైఎస్సార్ మైనారిటీలను ప్రేమించే వారు... ఇప్పుడు జగన్ మైనారిటీలపై బీజేపీ దాడులు చేస్తుంటే స్పందించడం లేదని విమర్శించారు షర్మిల. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించలేనీ మీరు వైఎస్సార్ వారసులు ఎలా అవుతారని నిలదీశారు. బీజేపీనీ అడిగే శక్తి లేదు. నిలదీసే దమ్ము కూడా లేదని తూర్పారబట్టారు. పోలవరం అడిగే సత్తా లేదు...హోదా కోసం కొట్లాడే పరిస్థితి లేదన్నారు. దేశంలో బీజేపీ వేరే అర్థం ఉంటే ఇక్కడ మాత్రం బాబు, జగన్, పవన్ అని విమర్శలు చేశారు. ఈ ఎన్నికల్లో మన జాతకాలు మారాలని పిలుపునిచ్చారు. కడప నా పుట్టిన ఇల్లని చెప్పుకొచ్చిన షర్మిల. జగన్ ఎలా పుట్టారో తను కూడా అలానే పుట్టానన్నారు. జమ్మల మడుగు ఆసుపత్రిలో పుట్టినట్టు చెప్పుకొచ్చారు. జగన్‌కు నేను వ్యతిరేకి కాదన్నారు షర్మిల. ఇద్దరిదీ ఒకటే రక్తం అన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మారిపోయారని ఆరోపించారు. ఇప్పుడున్న జగన్‌ను ఎప్పుడు చూడలేదన్నారు. ఆయనకు క్యాడర్‌కి, పార్టీకి తాను చేసిన సేవలు గుర్తు లేవన్నారు. తనపైనే స్టోరీలు అల్లుతున్నారని ఆవేదన చెందారు. రోజుకో జోకర్‌ను తీసుకొచ్చి బురదజల్లుతున్నారని ధ్వజమెత్తారు. కొత్తగా వచ్చిన జోకర్ ప్రణబ్ ముఖర్జీ పేరు ప్రస్తావించారని తన భర్త వెళ్లి అనిల్‌ను కలిసినట్టు విమర్శలు చేస్తున్నారని అన్నారు షర్మిల. జగన్‌ను బయటకు రానివ్వద్దు లాబియింగ్ చేశామని కొత్త పుకార్లు సృష్టిస్తున్నరన్నారు. సాక్ష్యం చెప్పడానికి ప్రణబ్ లేరనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వీళ్ల కుట్రలకు అంతే లేదన్నారు. తనకు పదవి ఆకాంక్ష ఉంటే నాన్నను అడిగి తీసుకోనా అని ప్రశ్నించారు. వైసీపీలోనైనా పదవి తీసుకోనా అని చెప్పుకొచ్చారు. అప్పుడు అనిల్, భారతి రెడ్డితో కలిసి సోనియా వద్దకు వెళ్ళారు... మరి ఆమెకు తెలియకుండా ఎలా అడిగారని ప్రశ్నించారు.

# ఇండియా కూటమిలో అప్పుడే బీటలు

### బిజెపి శక్తివందన్ వర్క్‌షాపులో కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ:**
విపక్షాలు పెట్టుకున్న ఇండియా కూటమి అప్పుడే విచ్ఛిన్నం అవుతోందని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నాడు శక్తి వందన్ వర్క్ షాప్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, మహిళా రుణాలు, ముద్రా యోజన లోన్లపై అవగాహన కల్పించారు. ఒక్కో జిల్లా నుంచి 15మంది ప్రతినిధులను బీజేపీ నాయకత్వం నియమించింది. ఈ కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో అనేక కుంభకోణాలు జరిగాయని.. ఆ కుంభకోణాల వల్లే అధికారానికి దూరం అయిందని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై విసిగి పోయిన ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని తెలిపారు. సమర్థవంతంగా కరోనాను మోదీ ఆధ్వర్యంలో ఎదుర్కొన్నామని చెప్పారు. స్వయంగా ప్రధాని వచ్చి వ్యాక్సిన్ తయారు చేసే కంపెనీలను సందర్శించి వారికి ధైర్యం ఇచ్చారన్నారు. మోదీని విమర్శించే ధైర్యం విపక్షాలకు లేదన్నారు. ఏదో ఓ రకంగా మోదీపై కొన్ని పార్టీల్లోని నేతలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి అవినీతి లేకుండా మోదీ పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలలో కనీసం రోడ్లు కూడా ఉండేవి కావని.. ఇప్పుడు పెద్ద ఎత్తున జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోందని వెల్లడిరచారు.



# జగన్ ఒత్తిడి మేరకు స్పీకర్ పనితీరు

### తమ్మినేనితో అసమ్మతి ఎమ్మెల్యేల భేటీ

**అమరావతి:**
వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు ఆనం రాంనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి సోమవారం స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిశారు. తాము ఇది వరకే లేఖలో రాసిన విధంగా 4 వారాల సమయం కోరినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం తాము కోరిన వెసులుబాటు కల్పించాలని స్పీకర్ కు విన్నవించినట్లు చెప్పారు. తాము పార్టీ నియమాలు ఉల్లంఘించినట్లు వైసీపీ చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాల్సిందిగా సభాపతిని, అసెంబ్లీ కార్యదర్శిని కోరామని అన్నారు. సీఎం జగన్ ఒత్తిడి మేరకే స్పీకర్ పని చేస్తున్నారని వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చినా రశీదు అడిగితే మాత్రం ఇవ్వలేదని వైసీపీ సీనియర్ ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డి ఆరోపించారు. స్పీకర్ తీరు చూస్తుంటే చట్టాలపై గౌరవం పోతోందని మండిపడ్డారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కావాలనే తమపై అనర్హత వేటు వేయాలని ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాలపై ఉన్న గౌరవంతోనే ఆయన్ను కలిసి సమయం కావాలని నేరుగా కోరామని, కానీ ఆయన దీనికి అంగీకరించక పోవడం వల్ల ఇప్పుడు కోర్టును ఆశ్రయించక తప్పదన్నారు. కోర్టులు, ప్రజా కోర్టుల్లోనే పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన సభాపతి వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. ఏపీలో స్పీకర్ రూల్ బుక్‌ను కూడా విభజించారని ఆయన మండిపడ్డారు. మరో రెండు, మూడు నెలల్లో సభాపతి కాలం ముగిసిపోబోతోందని, చివరి రోజుల్లో అయినా ఆయన చరిత్రలో నిలిచే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఇప్పుడు వైసీపీలో చాలా మంది ఎమ్మెల్యేలు తమకన్నా ఎక్కువ వ్యతిరేకంగా మాట్లాడుతున్నారన్నారు. 16 నెలల ముందు తాము ఏం చెప్పామో ఇప్పుడు అందరూ అదే చెబుతున్నారన్నారు. వారిపైనా చర్యలు తీసుకుంటారా అని వారు ప్రశ్నించారు. అంతకు ముందు సభాపతిని కలవడంపై రెబల్ ఎమ్మెల్యేలు న్యాయ నిపుణులు సలహా తీసుకున్నారు. అనర్హత పిటిషన్‌పై సమయం కావాలని కోరినా స్పీకర్ అంగీకరించకపోవడంతో నేరుగా కలిసి సమయం కోరాలని నిర్ణయించారు. అనర్హతకు సంబంధించి న్యాయ నిపుణులతో చర్చించేందుకు.. పేపర్స్, వీడియో క్లిప్పింగుల వాస్తవ నిర్ధారణకు సమయం కావాలని రెబల్ ఎమ్మెల్యేలు ఆనం రాంనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, కోటంరెడ్డి తెలిపారు. తనకు ఆరోగ్యం బాగాలేదని వైద్యులు ఇచ్చిన నివేదికను ఇచ్చినా స్పీకర్ పరిగణనలోకి తీసుకోలేదని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వాపోయారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో జరిగే సీక్రెట్ ఓటింగ్‌లో విప్ ఉల్లంఘించారని ఎలా నిర్ధారిస్తారన్నారు. వైసీపీలో రాజీనామా చేసిన ఎమ్మెల్యేలు, చేయని ఎమ్మెల్యేలు కూడా జగన్‌ను విమర్శిస్తున్నారని.. వారిపై లేని చర్యలు తమపై ఎందుకని ఆయన మండిపడ్డారు.

# రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

### తెలుగు రాష్ట్రాల్లో ఆరు స్థానాలకు ఎంపిక

### ఫిబ్రవరి 8న రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్

### ఫిబ్రవరి 27న పోలింగ్ ..అదే రోజున ఓట్ల లెక్కింపు

**న్యూఢిల్లీ:**
రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. 15 రాష్ట్రాలకు చెందిన 56 మంది సభ్యుల ఎంపికకు ఈసీ షెడ్యూల్ రిలీజ్ చేసింది. ఫిబ్రవరి 8న రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుండగా.. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుంది. అదే రోజున ఓట్ల లెక్కింపు ఉంటుంది. నామినేషన్ దాఖలుకు ఫిబ్రవరి 15 చివరి తేదీ, ఉపసంహరణకు చివరి తేదీ ఫిబ్రవరి 20. తెలంగాణలో మూడు, ఏపీలో మూడు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రాజ్యసభ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం నాడు షెడ్యూల్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఆరు స్థానాలకు ఎన్నిక జరగనుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు, తెలంగాణ నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ఏప్రిల్ నెలలో ముగియనుంది. రాజ్యసభ సభ్యుల నియామకం కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 8వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. రాజ్యసభ సభ్యుల ఎన్నిక పరోక్ష పద్ధతిలో జరుగుతుంది. ఏప్రిల్ నెలఖారుకు 56 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ముగియనుంది. తెలుగురాష్ట్రాల్లో మొత్తం 6 స్థానాలు ఖాళీ అవుతుండగా .... తెలంగాణాలో 3 స్థానాలకు.. ఆంధ్రప్రదేశ్? లో 3 స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు జరుగనున్నాయి. అత్యధికంగా... ఉత్తరప్రదేశ్‌లో 10 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణ నుంచి రిటైర్ అవుతున్న రాజ్యసభ ఎంపీల్లో వద్దిరాజు రవిచంద్ర, బడుగుల లింగయ్య యాదవ్, జోగినపల్లీ సంతోష్ కుమార్ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రిటైర్ అవుతున్న ఎంపీల్లో సీఎం రమేష్, కనకమేడల రవీంద్ర కుమార్,. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలు ఉన్నారు. యూపీలో అత్యధికంగా 10 మంది సభ్యులను ఎన్నుకోనున్నారు. ఆ తరవాత బిహార్, మహారాష్ట్రలో ఆరుగురు చొప్పున సభ్యుల ఎన్నిక జరగనుంది. ఇక పశ్చిమబెంగాల్‌లో ఐదుగురు, మధ్యప్రదేశ్‌లో ఐదుగురు, కర్ణాటకలో నలుగురు సభ్యులను ఈ ఎన్నికల ద్వారా ఎన్నుకోనున్నారు. ఆంధప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్‌లో మూడు సీట్లున్నాయి. ఛత్తీస్‌గఢ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఒక్కో సీట్‌కి ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 16వ తేదీన నామినేషన్లు పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 20 చివరి తేదీగా ఎన్నికల సంఘం వెల్లడిరచింది. ఫిబ్రవరి 27న సాయంత్రం 5 గంటలకు ఓటింగ్ పక్రియ మొదలవుతుంది. రాజ్యసభ సభ్యుల్ని ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారు. బ్యాలెట్ పేపర్ విధానంలో ఈ ఎన్నిక జరుగుతుంది. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థుల వివరాలుంటాయి. ఆ పేర్లలో తనకు నచ్చిన పేరుని మార్క్ చేసి బాక్స్‌లో వేస్తారు ఎమ్మెల్యేలు. తొలిరౌండ్‌లో అవసరమైన మెజార్టీ సాధించిన వ్యక్తి గెలిచినట్టుగా ప్రకటిస్తారు. అందరికన్నా తక్కువ ఓట్లు వచ్చిన వాళ్లను తొలగిస్తారు. ఆ ఓట్లను ఎమ్మెల్యేల నిర్ణయం ప్రకారం మిగతా అభ్యర్థులకు బదిలీ చేస్తారు. అన్ని వేకెన్సీలు భర్తీ అయ్యేంత వరకూ ఈ పక్రియ కొనసాగుతుంది.

# సంపాదకీయం

## దిగజారుడు రాజకీయాల్లో దిట్ట నితీశ్ !

దేశ సార్వత్రిక ఎన్నికలు, పలు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు బీహార్ రాజకీయాలు ఏవగింపు కలిగించేలా ఉన్నాయి. తాను నిబద్ధ రాజకీయనేతగా చెప్పుకుంటూ వచ్చిన నితీశ్ కుమార్ అవకాశవాద రాజకీయాలకు ఆద్యుడిగా నిలిచిపోయారు. ఎప్పటికప్పుడు తన విధానాలను మార్చుకుంటూ పోవడం రాజకీయాల్లో ఆయనను మించిన వారు ఎవరూ లేదనరి చెప్పుకోవాలి. అవసరమైతే కాంగ్రెస్ కూటమితో..లేదంటే బిజెపి కూటమితో జతకట్టడం అలవాటు చేసుకున్నారు. పదవి కోసం నానాగడ్డి తినడం లాలూ దగ్గర నేర్చుకు న్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి.ఇంతటి దిగజారుడు రాజకీయాలు గతంలో.. ఇకముందు కూడా ఎవరు చేయరేమో. ఎన్నికల్లో గెలుపోటములు మాత్రమే ప్రధానం అనుకునే వైఖరి ప్రమాదకరం. ఎందుకంటే.. ప్రజా సమస్యల కోసం నిలబడి పోరాడే చిత్తశుద్ధి గల నాయకుడు గెలిచే అవకాశం లేకపోయినా సరే, పార్టీలు అలాంటి వారికి టిక్కెట్లు ఇచ్చి నిలబెట్టాలి, ప్రోత్సహించాలి. వారికి అన్ని రకాలుగా అండగా నిలబడి పార్టీనే గెలిపించుకోవాలి. ఒకటి రెండు చోట్ల ఓటమి చెందవచ్చు కానీ.. ప్రజల కోసం నిస్వార్ధంగా పనిచేసే వారికి లభించే గుర్తింపు కావాలి. ఆ మాత్రం గుర్తింపు ఉంటే వారిలోని చిత్తశుద్ధి సడలిపోకుండా ఉంటుంది. కానీ పార్టీలు అలాంటి నిజమైన నాయకుల్ని తయారుచేయడం గురించి పట్టించుకోవడం లేదు. అలాంటి వారు ఉన్నా.. ప్రోత్సహించే ఉద్దేశమూ లేదు. అధికారం, ధనార్జన మాత్రమే లక్ష్యాలుగా ఉంటున్నాయి. దానికి తగ్గట్టుగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతోంది. అంతిమంగా ప్రజల కోసం పనిచేయడం మాత్రమే తెలిసిన వారు కనపడకుండా పోతున్నారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి విరమించుకుంటున్నారు. నితీశ్ విషయంలో కొంత నిజాయితీ అనిపించేది. కానీ గత చరిత్ర పరిశీలిస్తే ఆయన నిజాయితీ మంటగలిచిందనే చెప్పాలి. నితీష్ కుమార్ 20 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పీఠాన్ని వదల కుండా అంటిపెట్టుకున్నా అక్కడి ప్రజల పరిస్థితిలో మార్పు రాలేదు. జీవనస్థితిగతులు మారలేదు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టడంలో...అవసరాన్ని బట్టి గోడదూకడంలో నితీష్ ముందుటారని నిరూపించుకున్నారు. ఎప్పుడు ఎవరికి చేయిస్తారో ..ఎప్పుడు ఎవరితో కలుస్తారో ...రాజకీయ విశ్లేషకులు కూడా అంచనా వేయలేకపోతున్నారు. తలపండిన రాజకీయ నేతలు, పండితులు కూడా నితీష్ కుమార్ వ్యూహాల ను పసి గట్టలేకపోయారు. పదవి కోసం ఎంతకైన దిగజారుతాడని మాత్రం ఇప్పుడు మరోమారు రుజువు అయ్యింది. రాజకీయ విలువలు గురించి అవసరం లేదు. సీఎం పదవి తర్వాతే ఏదైనా అంటాడు. సీట్లు ఎవరికి ఎక్కువున్నా సీఎం పదవి తనదే అంటారు నితీష్ కుమార్. 2013 నుంచి ఇప్పటికి నాలుగుసార్లు కూటముల మార్చేశారు నితీష్. ఎన్నిసార్లు కూటములు ఫిరాయించినా..20 ఏళ్లుగా ఆయనే ముఖ్యమంత్రి. బీహార్‌లో మహాగడ్‌బంధన్‌కు రాంరాం చెప్పారు. నితీష్ కుమార్...యూటర్న్ తీసుకోవడం ఇదేం తొలిసారి కాదు. గతంలో అనేకసార్లు ఆయన కూటమిలు మార్చేశారు. మొదట్నుంచి నితీష్ రాజకీయ రూటే సపరేటు... జనతాదళ్‌తో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నితీష్... ఆ పార్టీ తరపున 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1994లో ఆ పార్టీని చీల్చి సమతాపార్టీ పెట్టుకున్నారు. 1996లో లోక్‌సభకు ఎన్నికైన ఆయన అటల్ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా పనిచేశారు. 2003లో తన పార్టీని జేడీయూలో విలినం చేసేసారు. ఆ తర్వాత ఆ పార్టీకి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అప్పట్నుంచి ఆయనకు తిరుగు లేకుండా పోయింది. 2005లో బీజేపీతో చేతులు కలిపిన ఆయన ఘనవిజయం సాధించి తొలిసారి బీహార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. 2010లోనూ బీజేపీతో కలిసే ఎన్నికలకు వెళ్లి విజయం సాధించారు. కానీ 2013లో బీజేపీ తన ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీని ప్రకటించడంతో నితీష్ కమలంతో తెగతెంపులు చేసుకున్నారు. కాంగ్రెస్, ఆర్జేడీలతో కలిపి మహాగడ్‌బంధన్ ఏర్పాటు చేశారు. అయితే 2014లో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిపోవడంతో సీఎంగా రాజీనామా చేసి మాంజీని ఆ పీఠంపై కూర్చోపెట్టారు. 2015లో మాంజీని దించేసి తాను మరోసారి సీఎం అయ్యారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. అయితే 2017లో మహాగడ్‌బంధన్‌కు హ్యాండిచ్చి కమలం గూటికి చేరిపోయారు. ఐఆర్‌సీటీసీ కుంభకోణంలో...సీబీఐ లాలుప్రసాద్ ఇంట్లో సోదాలు చేయడంతో ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమికి గుడ్ బై చెప్పారు. 2020లో తక్కువ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2022లో మళ్లీ బీజేపీని వదిలి మహాగడ్‌బంధన్ అంటూ కూటమిని ఏర్పాటు చేశారు. ఆర్జేడీ కంటే జేడీయూకు తక్కువమంది ఎమ్మెల్యేలు ఉన్నా నితీషే సీఎం అయ్యారు. మళ్లీ రెండేళ్లు కూడా కాకముందే మళ్లీ యూటర్న్ తీసుకున్నారు. రకరకాల కారణాలతో కూటములు మార్చే నితీష్ ఈసారి బయటకు రావడానికి కారణం ఇండియా కూటమి ప్రధాన మంత్రి ఫేస్ కాలేకపోవడమే అంటున్నారు. ఇండియా కన్వీనర్‌గా ఖర్గేను ప్రకటించడంతో ఇక తనకు ఛాన్స్ రాదని నితీష్ డిసైడైనట్లు కనిపిస్తోంది. పైగా మరోసారి కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వమే వస్తుందన్న అంచనాలు కూడా ఆయన్ను ఆలోచనలో పడేశాయి. ఉత్తరాదిలో ప్రధాని మోడీ హవా కొనసాగుతోంది. పైగా కర్పూరి ఠాకూర్‌కు భారతరత్నతో బీహార్‌లో పొలిటికల్ ఈక్వేషన్స్ మార్చేశారు మోడీ... దీంతో నితీష్‌కుమార్ జాగ్రత్తపడ్డారు. మోడీని ఢీ కొట్టలేని పరిస్థితులు, బలం లేకపోవడంతో బీజేపీతో కలసి నడవాలని నిర్ణయించుకున్నారు. అందుకే ఆయన బిజెపి కూటమిలో చేరి తన పదవిని పదిలం చేసుకున్నారు. రాజకీయంగా దిగజారుడు వ్యవహారాలకు నితీశ్ పెద్దపీట వేశారు. దీంతో ఆయన తన నిజాయితీని కలోa`పోయారు. పదవికోసం ఎంతకైనా దిగజారే నేతగా చరిత్రలో నిలిచిపోతారు.

## కెటిఆర్, బండిల మధ్య మాటల యుద్ధం

### పరస్పర విమర్శలతో వేడెక్కుతున్న రాజకీయం

**హైదరాబాద్:** కేటీఆర్, బండి మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది.మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్లు.. బీజేపీ ఎంపీ బండి సంజయ్ ప్రతికౌంటర్లతో కరీంనగర్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలే టార్గెట్‌గా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగుతున్నాయి. తాజాగా మరోసారి కేటీఆర్‌పై బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పనిలో పనిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పైనా వ్యాఖ్యలు చేశారు. నేను మఠం పెట్టుకుంటే.. మీ అయ్య బార్ పెట్టుకుంటాడా.. నువ్వు మసీదు పెట్టుకుని నమాజ్ చేసుకుంటూ ఉండు‘ అంటూ కేటీఆర్‌పై సెటైర్ విసిరారు. యాదాద్రిని వ్యాపార కేంద్రం చేశారని మండిపడ్డారు. కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి నాస్తికుడని.. కేటీఆర్ కూడా నాస్తికుడే అని అన్నారు. కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ద మేధావిలాగా ఫోజ్ కొడతారని బండి సంజయ్ దుయ్యబట్టారు. బండి సంజయ్ ఇంకా మాట్లాడుతూ... జీపీలకు బీఆర్ఎస్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారని... సర్పంచ్‌ల ఆందోళనకు మద్దతు ఇస్తామన్నారు. సర్పంచ్‌లతో పనులు చేయించి.. బిల్లులు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం పేరు చెప్పి.. ఈ ప్రభుత్వం తప్పించుకోవద్దని హితవుపలికారు. సర్పంచ్‌ల సమస్యలపై అడిగే హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. బీఆర్ఎస్ కొత్త డ్రామా మొదలు పెట్టిందన్నారు. తెలంగాణలో పది ఎంపీ సీట్లు గెలుస్తామని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.



# ఆందోళనలతో ప్రభుత్వ వ్యతిరేకత

### ప్రజల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి

### ఎన్నికల్లో ప్రభావం చూపనున్న కార్మిక సంఘాలు




**విజయవాడ:** ఏపిలో ఇటీవలి వరుస ఆందోళనలు అధికార వైసిపిపై తీవ్ర వ్యతిరేకతను చాటాయి. ఈ ప్రభుత్వం తమను పట్టించుకోదన్న వైఖరిలో పలు రంగాలు ఉన్నాయి. మరింత మెరుగైన వేతనాలు, ప్రయోజనాలు కావాలని వివిధ విభాగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అనేక సంఘాలు ఇప్పటికే నిరసనలకు దిగడమో లేదా ఎన్నికల్లోగా ఆందోళనలు చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించడమో చేస్తున్నాయి. వారి డిమాండ్లను పరిశీలిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో వారిలో కొంతమంది మాత్రమే తాత్కాలికంగా తమ ఆందోళనలను ఆపారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సైతం ప్రభుత్వంతో కొంత కాలంగా పోరాడుతున్నారు. ఎస్మాను ప్రయోగించడం ద్వారా ఆందోళనలను అణగదొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ అంగన్‌వాడీలు తమ పట్టును ఏమాత్రమూ సడలించ లేదు. ఆందోళన విరమించలేదు. తమ డిమాండ్లన్నింటికీ ప్రభుత్వం ఆమోదించే వరకు సమ్మె కొనసాగి తీరుతుందని స్పష్టం చేశారు. న్యాయమైన తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం దీర్ఘకాలంగా ఉదాసీనంగా వ్యవహరించడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దశలవారీగా నిరసనలు చేపట్టేందుకు ఎ.పి యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ సమాయత్తమవుతోంది. విజయవాడలో ఫిబ్రవరి మొదటి వారంలో మహాధర్నాతో ముగించాలని భావిస్తోంది. రూ.18 వేల కోట్ల మేరకు వివిధ పద్దుల కింద పెండింగ్ వున్న తమ బకాయిలు, ఎరియర్లను తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పారా మెడికల్ సిబ్బంది, 104, 108 అంబులెన్స్ సర్వీసుల్లో పని చేస్తున్న ఇతర ఉద్యోగులు జనవరి 23 నుండి ప్రతిపాదిత సమ్మెకు ఆరోగ్య శాఖకు నోటీసు ఇచ్చారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వేతనాలు, ఇతర ప్రోత్సాహకాలను పెంచాలని వారు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్స్‌డ్ సర్వీసెస్ కార్పొరేషన్‌లో తమని భాగం చేసినట్లైతే ఇవన్నీ తమకు వస్తాయని వారు పేర్కొంటున్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మితో చర్చలకు తమ నేతలను ఆహ్వానించడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్న ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ వర్కర్లు తాత్కాలికంగా సమ్మె విరమించారు. దాదాపు 55,400 మంది అక్రిడేటెడ్ సామాజిక ఆరోగ్య కార్యకర్తలు కూడా విధులకు దూరంగా వున్నారు. తమకు నెలకు రూ.26 వేలు కనీస వేతనంగా ఇవ్వాలని వారు పట్టుబడుతున్నారు. మున్సిపల్ పాఠశాలలను విద్యా శాఖ పర్యవేక్షణ కిందకు తీసుకువస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులపై మున్సిపల్ టీచర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లలో కొన్నింటిని అమలు చేయడానికి ప్రభుత్వం అంగీకరించడంతో సమగ్ర శిక్షా పథకానికి చెందిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 22 రోజుల నుండి చేస్తున్న సమ్మెను ఇటీవలే విరమించారు. మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, నిర్మాణ కార్మికులు, గ్రామ రెవిన్యూ అసిస్టెంట్లు, గ్రామీణాభివృద్ధి విభాగానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు వీరందరిదీ ఒకటే ఫిర్యాదు. ద్రవ్యోల్బణం నెలకొన్నప్పటికీ తమ ఆదాయాలు అస్సలు పెరగడం లేదని వాపోతున్నారు. 2019 ఎన్నికల సమయంలో పాదయాత్ర సందర్భంగా వేతనాలు పెంచుతానని, మరింత మెరుగైన పని పరిస్థితులు కల్పిస్తానని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆనాడు హామీ ఇచ్చారని, కానీ నేడు వాటన్నింటినీ గాలికి వదిలేశారని, మాట నిలబెట్టుకోలేదని వారు విమర్శిస్తున్నారు. తమ ఆందోళనలు, డిమాండ్ల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ఆందోళన చేస్తున్న సంఘాలు తీవ్ర ఆగ్రహంతో వున్నాయి. సమ్మెల పట్ల ప్రభుత్వం తీసుకున్న కఠిన వైఖరితో సమస్య ఇంకా ముదిరిందని అత్యధికులు అభిప్రాయ పడుతున్నారు. వేతనాలు పెంచినట్లైతే వాటిని ప్రస్తుత బడ్జెట్లలోనే చెల్లించాల్సిన అవసరం వుంది. అందుకే పరిష్కారాలను కనుగొనడంలో జాప్యం జరుగుతోందనేది వాస్తవం. ఇదిలావుండగా, ఈ వైఫల్యాలన్నింటికీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి ఈ నిరసనలు, సమ్మెలు, ఆందోళనలన్నీ కూడా ప్రతిపక్షాలకు ఒక అవకాశాన్ని ఇచ్చాయి. తెలుగుదేశం–జనసేన కూటమి, బిజెపి, కాంగ్రెస్‌లు అన్నీ కూడా జగన్మోహన్ రెడ్డిపై దాడి చేస్తున్నాయి.

## మీరిచ్చిన ఉద్యోగాలు ఎక్కడో చెప్పండి

**ఇడి నోటీసులు వచ్చినప్పుడల్లా కవిత డ్రామాలు**

### మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ , విపక్ష బీఆర్ఎస్ మధ్య డైలాగ్ వార్ తీవ్రస్థాయికి చేరింది. ఉద్యోగాల కల్పన నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన కామెంట్లపై కాంగ్రెస్ పార్టీ విరుచుకుపడిరది. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని కవిత చెబుతున్నారు.. ఇఎక్కడ ఇచ్చారో మరి ఆ లెక్క చెప్పాలని డిమాండ్ చేసింది. ఈడీ నోటీసులు వచ్చిన ప్రతిసారి కవిత ఢల్లీ వెళ్లి టెంట్ వేస్తారని ఆరోపించింది. గత పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ చేయని పనులను 100 రోజుల్లో తమ పార్టీ చేయనుందని స్పష్టం చేసింది. గత ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంది. తాము డెవలప్ చేస్తే తట్టుకోలేక పోతుందని మండిపడిరది. గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు భవాని రెడ్డి, సునీతా పాల్, జ్ఞాన సుందర్ మీడియాతో మాట్లాడారు. కెమెరాలు పెట్టుకొని, కార్మిక సంఘ ఆటోల్లో తిరుగతూ కేటీఆర్ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పీపుల్స్ అని, ప్రజల కోసం ఆలోచిస్తున్నారని సునీతా పాల్ అన్నారు. కేటీఆర్ మాత్రం ప్రజలని వాడుకుంటూ డ్రామాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం ఏర్పడి ఇంకా 50 రోజులు కాలేదన్నారు. కేటీఆర్ ప్రజల్లో తిరిగితే పదేళ్లలో ఏం చేశారని ప్రజలు అడుగుతున్నారని పేర్కొన్నారు. బీజేపీ కోసం బీఆర్ఎస్ పని చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్నడూ ఒక్కటి కాలేవన్నారు. తాము అవగాహనతో ఉంటే తమ పార్టీ నాయకులపై ఈడీ కేసులు ఎందుకు అవుతాయని నిలదీశారు. వాళ్ళకు అవగాహన ఉన్నందునే లిక్కర్ కేసులో కవిత అరెస్ట కాలేదని చెప్పారు.

## అభివృద్ధికి నిధుల కోసమే కలిశా: ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

**హైదరాబాద్ :** నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎంని కలిశానని చెప్పారు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బహదూర్ గూడ, కొత్వాల్ గూడ, ఘుస్మియ గూడ గ్రామలలో రైతులకు పట్టా పాసు పుస్తకాల సమస్యలు ఉన్నాయని.. వాటితో పాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడం జరిగిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పష్టం చేశారు. దీంట్లో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని.. సీఎం రేవంత్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందించి అతి త్వరలో సమస్యల పరిష్కారం చేద్దామని అన్నారని తెలిపారు. పార్టీ మారే ఉద్దేశం తనకు లేదని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.

## కుక్కలు చింపిన విస్తరిలా ఇండియా కూటమి

### బీహార్ పరిణామాలే ఇందుకు నిదర్శనం

### తెలంగాణలో 10 లోక్‌సభ సీట్లు గెలుస్తామన్న బండి

హైదరాబాద్: దేశానికి, తెలంగాణకు భవిష్యత్తు బీజేపీయేనని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఈసారి 350కిపైగా స్థానాల్లో గెలవడం ఖాయమని, తెలంగాణలోనూ 10కి పైగా ఎంపీ స్థానాల్లో విజయం సాధిస్తామని జోస్యం చెప్పారు. ఇండియా కూటమి కుక్కలు చింపిన విస్తరిలా మారిందని విమర్శించారు. బీహార్ లో జరుగుతున్న పరిణామాలే అందుకు నిదర్శనమని తెలిపారు. కేటీఆర్ మాటలను బీఆర్ఎసోళ్లే పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు సంజయ్. బీఆర్ఎస్ ను గెలిపిస్తే సాధించిందేమిటి?... అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేయడం తప్ప అని అన్నారు. కేంద్రం ఏ గ్రామానికి ఎన్ని నిధులిచ్చిందో వెల్లడిరచేందుకు సిద్ధమని, కేటీఆర్ కు దమ్ముంటే బీఆర్ఎస్ గ్రామాలకు ఏం చేసిందో చెప్పాలని సంజయ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ లో 99 శాతం మంది ప్రజలు దేవుడిని నమ్ముతారన్న సంజయ్... దేవుడినే నమ్మని నాన్ లోకల్ అభ్యర్థి వినోద్ కుమార్ కు ప్రజలు ఓట్లు వేస్తారా? అని ప్రశ్నించారు. వినోద్ మేధావితనమంతా కేసీఆర్ కుటుంబానికే తప్ప ప్రజలకు ఉపయోగపడిరదేమీ లేదన్నారు. ప్రజల సంగతి దేవుడెరుగు.. సొంత పార్టీ కార్యకర్తలే వినోద్ ను గుర్తు పట్టరని విమర్శించారు. స్థానికంగా ఉంటూ మీకోసం కొట్లాడే బండి సంజయ్ కావాలా? ఇతర పార్టీల నుండి పోటీ చేసే నాన్ లోకల్ అభ్యర్థి కావాలా? ఆలోచించుకోవాలని సూచించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ది మూడో స్థానానికే పరిమితమని సంజయ్ తెలిపారు.

# తెలంగాణ ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు

### ఎమ్మెల్యేల గెలుపుపై హైకోర్టులో పిటిషన్లు

### కెటిఆర్, హరీష్‌రావుల ఎన్నికపైనా వ్యాజ్యాలు

**హైదరాబాద్:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయాలు వేడెక్కు తున్నాయి. తెలంగాణలో ఓటమి చెందిన బిఆర్ఎస్ నేతలు కన్నూమిన్నూ గానక మాట్లాడుతున్నారు. మరీ ముఖ్యంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ తీరు దారుణంగా ఉంది. బజారు రాజకీయ నాయకుడి కన్నా దారుణంగా ఆయన ప్రవర్తన ఉంది. ఆయన తన వైఖరి మార్చుకోకుంటే ప్రజలు మరోమారు ఎంపి ఎన్నికల్లోనూ గుణపాఠం చెప్పక తప్పదు. ఇకపోతే గత నవంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గెలిచిన 24 మంది అభ్యర్థుల ఎన్నికను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వారి ఎన్నిక చెల్లదని, శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసి.. తమను ఎమ్మెల్యేలుగా ప్రకటించాలని మరికొందరు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఎన్నికను సైతం సవాల్ చేశారు. అయితే, నిబంధనల ప్రకారం ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లోపే ఆ ఎన్నికను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పిటిషన్లన్నీ ఇంకా స్క్రూట్నీ దశలోనే ఉన్నాయి. అన్నీ సక్రమంగా ఉంటే త్వరలోనే హైకోర్టు రిజిస్ట్రీ వీటికి నెంబర్లు కేటాయించనుంది. 2023 శాసనసభ ఎన్నికల్లో మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ తరఫున సిరిసిల్ల నుంచి పోటీ చేయగా.. కాంగ్రెస్ తరఫున మహేందర్ రెడ్డి పోటీ చేశారు. కేటీఆర్ కు 89,224 ఓట్లు రాగా, మహేందర్ రెడ్డికి 59,557 ఓట్లు వచ్చాయి. అయితే, కేటీఆర్ తన ఎన్నికల అఫిడవిట్ లో పూర్తి సమాచారం ఇవ్వలేదని.. ఆయన ఎన్నిక చెల్లదని మహేందర్ రెడ్డి పిటిషన్ లో పేర్కొన్నారు. తన కుమారుడు హిమాన్షు పేరుతో ఉన్న 32 ఎకరాల భూమి వివరాలు వెల్లడిరచలేదని ఫిర్యాదు చేశారు. ఈ భూమి సేల్ డీడ్ ను సైతం మహేందర్ రెడ్డి సమర్పించారు. అలాగే, అమెరికా వర్శిటీలో చదువుతున్న కుమారుడికి కేటీఆరే ఫీజు కడుతున్నా డిపెండెంట్ గా చూపలేదని అన్నారు. అలాగే, వీవీ ప్యాట్లను మరోసారి లెక్కించేలా ఎన్నికల కమిషన్ కు ఆదేశాలివ్వాలని కోరారు. కేటీఆర్ ఎన్నికను రద్దు చేసి తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ తన కొడుకు ఆస్తులు చూపలేదని మరో పిటిషన్ సైతం దాఖలైంది. అటు, సిద్ధిపేటలో బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కాంగ్రెస్ తరఫున హరికృష్ణ, బీఎస్పీ నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. హరీశ్ రావుకు 1,05,514 ఓట్లు రాగా హరికృష్ణకు 23,206 ఓట్లు, చక్రధర్ కు 16,610 ఓట్లు వచ్చాయి. అయితే, హరీశ్ రావు అఫిడవిట్ లో పూర్తి సమాచారం వెల్లడిరచకుండా దాచిపెట్టారని, తన కుమారుడి వివరాలు పేర్కొనలేదని చక్రధర్ హైకోర్టును ఆశ్రయించారు. 2018లో 36 కేసులుండగా, 2023లో 3 కేసులు ఉన్నట్లుగా అఫిడవిట్ లో పేర్కొన్నారని.. మిగిలిన కేసుల గురించి ప్రస్తావించలేదని అన్నారు. హరీశ్ రావు ఎన్నికను రద్దు చేయాలని కోరారు. హుజూరాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలిచిన పాడి కౌశిక్ రెడ్డి విజయాన్ని సవాల్ చేస్తూ బీజేపీ నేత ఈటల రాజేందర్ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే, జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విజయాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత అజారుద్దీన్, కూకట్‌పల్లి నుంచి మాధవరం కృష్ణారావు ఎన్నికపై కాంగ్రెస్ నేత బండి రమేశ్ పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే, ఆసిఫాబాద్, గద్వాల, పటాన్ చెరు, కామారెడ్డి, షాద్ నగర్, ఆదిలాబాద్, మల్కాజిగిరి, కొత్తగూడెం తదితర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతల గెలుపును సవాల్ చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్ లో అవకతవకలు ఉన్నాయని, సరైన వివరాలు వెల్లడిరచలేదని ఆరోపించారు.



ఈవీఎం, వీవీ ప్యాట్ లను మళ్లీ లెక్కించాలని కోరారు. మరోవైపు, నాగర్ కర్నూల్ నుంచి బీఆర్ఎస్ తరఫున బరిలో నిలిచిన మర్రి జనార్దన్ రెడ్డి ఎన్నికల కమిషన్ తన విధులు సక్రమంగా నిర్వహించలేదని పిటిషన్ వేశారు. అయితే, 2018 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లే ఇప్పటికీ హైకోర్టులో పెండింగ్ లో ఉన్నాయి. అప్పటి ఎన్నికలకు సంబంధించి కొత్తగూడెం, గద్వాల ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తూ ఉన్నత న్యాయస్థానం తీర్పులు ఇచ్చింది. అయితే, ఈ ఆదేశాలపై సదరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు.

# తెలంగాణను అప్పులకుప్ప చేసిన బీఆర్ఎస్

**అభివృద్ధి పేరుతో అప్పుల ఊబిలోకి నెట్టారు**

**ముషీరాబాద్ బూత్ సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి**

హైదరాబాద్,జనవరి29 : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క పరిశ్రమను ఏర్పాటు చేయలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. కానీ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారని అన్నారు. ఓ రకంగా చెప్పాలంటే రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకున్నారని మండిపడ్డారు. సోమవారం నాడు బాగ్ లింగం పల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా



కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు వాజీ హుస్సేన్, కల్పన యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.... విద్య, వైద్యాన్ని కాంగ్రెస్ అభివృద్ధి చేసిందని తెలిపారు.కాంగ్రెస్ ఆస్తులు, సంపద సృష్టిస్తే బీఆర్ఎస్ విధ్వంసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ కోసం ప్రతి కార్యకర్త కష్ట పడతారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం చరిత్రాత్మక నియోజకవర్గమని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ నగరం గర్వకారణమని చెప్పారు. తెలంగాణను అభివృద్ధి చెసింది ఆనాటి కాంగ్రెస్ నాయకులేనని అన్నారు. కృష్ణ , గోదావరి నుంచి కాంగ్రెస్ నీళ్లు తెచ్చిందని తెలిపారు.బీఆర్ఎస్ హైదరాబాద్‌కి చుక్క నీళ్లు తెలేదని విమర్శించారు. చదువుకోవడానికి కళాశాలలు పెట్టి ఫీజు రియంబర్స్‌మెంట్‌ను కాంగ్రెస్ ఇచ్చిందన్నారు.హైటెక్ సిటీ కంప్యూటర్ రంగాన్ని మొదట కాంగ్రెస్ తెచ్చిందని గుర్తుచేశారు. ఇక్కడ పరిశ్రమలు రావడానికి కారణం ఆనాటి కాంగ్రెస్ నాయకులేనని భట్టి విక్రమార్క తెలిపారు.

## కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని సరిగా తిప్పికొట్టలేదు

### వర్ధన్నపేట సమీక్షలో మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

వరంగల్,జనవరి29 : ఇటీవల జరిగిన తెలంగాణఅసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడానికి గల కారణాలపై ఆ పార్టీ నేతలు విశ్లేషణలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో వరుస సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. తాజాగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బీఆర్ఎస్ ఓటమిపై కీలక కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ నాయకులు కసితో పని చేయడం వల్లే ఆ పార్టీ విజయం సాధించిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వ్యూహం పని చేసిందన్నారు. సోమవారం నాడు వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న నిరంజన్ రెడ్డి.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేసిందన్నారు. కాంగ్రెస్ చేసే విష ప్రచారాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు సరిగ్గా తిప్పికొట్టలేకపోయారని అభిప్రాయం వ్యక్తం చేశారు నిరంజన్ రెడ్డి. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్ఎస్ కార్యకర్తలు సమాయత్తం కావాలని పార్టీ శ్రేణులకు నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. గత ఎంపీ ఎన్నికల్లో కరీంనగర్‌లో బీజేపీ, కాంగ్రెస్ కలిసి బీఆర్ఎస్ పార్టీని ఓడగొట్టాయని, ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు నిరంజన్ రెడ్డి. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మెజార్టీ సీట్లను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. చాలా తక్కువ సమయంలోనే అనేక సంక్షేమ పథకాలను అందించిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు నిరంజన్ రెడ్డి. బీఆర్ఎస్ గొప్ప గొప్ప పనులు చేసినా.. ప్రజలు సంతృప్తి చెందలేదన్నారు. ఉద్యోగాల విషయంలోనూ బీఆర్ఎస్‌ను బద్నాం చేశారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రేమను బీఆర్ఎస్ పొందలేదన్నారు. అలాగే.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగాలు రాలేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేసిందన్నారు నిరంజన్ రెడ్డి.

## విజయ్ చౌక్‌లో గణతంత్ర రీట్రీట్

### ఆకట్టుకున్న పరేడ్ కార్యాక్రమాలు

న్యూఢిల్లీ,జనవరి29 : భారత 75వ గణతంత్ర దిన వేడుకల ముగింపు సందర్భంగా ఏటా నిర్వహించే బీటింగ్ రీట్రీట్ ఈసారి కూడా ఘనంగా జరిగింది. ఢిల్లీలోని విజయ్ చౌక్‌లో సోమవారం సాయంత్రం బీటింగ్ రీట్రీట్ కార్యక్రమం జరిగింది. గణతంత్ర వేడుకల ముగింపునకు సూచకంగా బీటింగ్ రీట్రీట్ ను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాతకాలం నాటి గుర్రపు బగ్గీలో వచ్చారు. ఈ బగ్గీ బ్రిటిష్ కాలంలోని ఓ భారత వైస్రాయ్‌కు చెందిన సంగతి తెలిసిందే. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్, ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సహా కేంద్ర మంత్రులు, సీనియర్ ఉన్నతాధికారులు, సాధారణ ప్రజలు అప్పటికే అక్కడికి చేరుకోగా.. రాష్ట్రపతి రాకతో కార్యక్రమం ప్రారంభం అయింది. త్రివిధ దళాలు (ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్), సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) కు చెందిన మ్యూజిక్ బ్యాండ్స్ ఈ కార్యక్రమంలో దేశభక్తి ట్యూన్లను ప్లే చేశాయి. ఆ ట్యూన్లకు తగ్గట్లుగా కాళ్లు కదుపుతూ దళాలు చేసిన మార్చ్ ఆకట్టుకుంది. బీటింగ్ రీట్రీట్ కార్యక్రమం శంఖ్‌నాద్ ట్యూన్ తో ప్రారంభం అయింది. ఆ తర్వాత వీర్ భారత్, సంగమ్ దూర్, దేశోన్ కా సర్తాజ్ భారత్, భగీరథి, అర్జున ట్యూన్లను వివిధ వాయిద్యాలు, డ్రమ్ లతో ప్లే చేశారు. సీఏపీఎఫ్ బ్యాండ్ భారత్ కె జవాన్, విజయ్ భారత్ లాంటి ట్యూన్లను ప్లే చేసింది. రీటింగ్ రీట్రీట్ కార్యక్రమం మొత్తం లెఫ్టినెంట్ కల్నల్ విమల్ జోషి నేతృత్వంలో జరిగింది. ఆర్మీ బ్యాండ్ అనేది సుబేదార్ మేజర్ మోదీలాల్, మాస్టర్ చీఫ్ పెట్టీ ఆఫీసర్ ఎం ఆంటొనీ ఇండియన్ నేవీ బ్యాండ్‌కు, వారెంట్ ఆఫీసర్ అశోక్ కుమార్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ బ్యాండ్ ను నిర్వహిస్తారు. సీఏపీఎఫ్ బ్యాండ్ కు జీడీ రాణిదేవి నిర్వహించారు. ఇక వాద్యకారులు నయిబ్ సుబేదార్ ఉమేశ్ కుమార్, పైప్స్ అండ్ డ్రమ్స్ బ్యాండ్ సుబేదార్ మేజర్ రాజేందర్ సింగ్ లీడర్ షిప్ లో జరిగాయి.

## మంత్రి కార్యక్రమానికి డైరెక్టర్ల డుమ్మా

గుంటూరు,జనవరి29 : మంత్రి అంబటి రాంబాబుకు గుంటూరు జిల్లా, మిర్చి యార్డ్‌లో జలక్ ఇచ్చారు. యార్డ్‌లో రైతులకు అల్పాహారం, భోజన శాల ప్రారంభ కార్యక్రమం మంత్రి అంబటి చేతుల మీదుగా జరిగింది. అయితే ఈ కార్యక్రమానికి యార్డ్ ఛైర్మన్ మినహా యార్డ్ డైరెక్టర్‌లు డుమ్మా కొట్టారు. యార్డ్ ఛైర్మన్ నిమ్మకాయల రాజ నారాయణ తీరుకు నిరసనగా వారు రాలేదు. యార్డ్ ఛైర్మన్ ఏకపక్ష వ్యవహార శైలికు నిరసనగా డైరెక్టర్‌లు డుమ్మా కొట్టారు. అలాగే మిర్చి యార్డ్ వైస్ ఛైర్మన్.. సహా డైరెక్టర్‌లు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. మిర్చి యార్డ్‌లో ఛైర్మన్, డైరెక్టర్‌ల మధ్య వివాదం కొనసాగుతోంది.

## నర్సారెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

### సంతాపం ప్రకటించిన సిఎం రేవంత్ తదితరులు

హైదరాబాద్,జనవరి29 : మాజీ పీసీసీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి నర్సారెడ్డి మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. అలాగే పలువురు మంత్రులు, నేతలు కూడా నర్సారెడ్డికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షులుగా, మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివి అని నేతలు కొనియాడారు. నర్సారెడ్డి మృతిపట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియ జేశారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ప్రజలకు ఆయన అనేక సేవలందించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షులుగా, మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన అనుభవాలు తమకు మార్గదర్శకంగా ఉండేవని చెప్పుకొచ్చారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మనిషి, నీతికి నిజాయితీకి మారు పేరుగా నిలిచిన మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి పి. నర్సారెడ్డి ఈరోజు ఉదయం స్వర్గస్తులయ్యారని తెలియజేయడానికి చింతిస్తున్నామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నామని తెలిపారు. నర్సారెడ్డి మృతి పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంతాపం తెలిపారు. నిజాయితీగా రాజకీయాలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకొని జీవితాంతం నమ్ముకున్న సిద్ధాంతం కోసం పని చేసిన మాజీ పీసీసీ అధ్యక్షులు పి.నర్సారెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పి.నర్సారెడ్డి మరణం పట్ల రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విలువలు కలిగిన రాజకీయ నాయకుడిగా, కాంగ్రెస్ వాదిగా, సుపరిపాలనాదక్షుడిగా అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. ఆయన రాజకీయ జీవితం నేటితరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అలంకరించిన నర్సారెడ్డి మృతి రాష్ట్రానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షులు పొద్దుటూరి నర్సారెడ్డి మృతిపై ఉమ్మడి జిల్లాలోని అన్ని పార్టీల నేతలు సంతాపం తెలియజేశారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షులుగా నర్సారెడ్డి విశేష సేవలు అందించారని కొనియాడారు. నర్సారెడ్డి మృతితో స్వగ్రామం సారంగాపూర్ మండలం మలక్‌చించోలిలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన చేసిన సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకుంటున్నారు. నర్సారెడ్డి మృతిపై మాజీ మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి పారుదల, రెవెన్యూ శాఖల మంత్రిగా ఆయన సమర్థవంతంగా పని చేశారని ఇంద్రకరణ్‌రెడ్డి కొనియాడారు.

## దర్శకుడు కొరటాల శివకు చుక్కెదురు

### శ్రీమంతుడు కథను కాపీ కొట్టినందుకు కేసు

### నాంపల్లి కోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం

న్యూఢిల్లీ,జనవరి29 : మహేశ్ బాబు హీరోగా నటించిన శ్రీమంతుడు సినిమాకు సంబంధించి కాపీ రైట్ యాక్ట్ కింద డైరెక్టర్ కొరటాల శివకు.. సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. నాంపల్లి సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం కచ్చితంగా క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సిందే అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి వ్యవహారాలపై విచారణను ఎదుర్కోవాలి అయితే..ఈ వ్యవహారంతో నిర్మాతకు సంబంధం లేదని సుప్రీంకోర్టు తెలిపింది. 'శ్రీమంతుడు' స్టోరీని స్వాతి మ్యాగజైన్‌లో ప్రచురించిన కథ ఆధారంగా కాపీ చేశారని..రచయిత శరత్ చంద్ర గతంలో హైదరాబాద్ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు డైరెక్టర్ కొరటాల శివపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో నాంపల్లి కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ, కొరటాల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. శ్రీమంతుడు సినిమాకు సంబంధించి కాపీ రైట్ యాక్ట్ కింద మొదలైన వివాదం డైరెక్టర్ కొరటాల శివ చాలా రోజుల నుంచి ఎదుర్కొంటున్నారు. నిర్మాత ఎర్నేని రవి, ఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్‌లపై కాపీ రైట్‌యాక్ట్ కేసుతో పాటు ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేయాలన్న కథ రచయిత శరత్ చంద్ర (ఆర్డీ విల్సన్) అభ్యర్థనను హైకోర్టులో పెట్టుకున్నారు. కానీ తమ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. 'చచ్చేంత ప్రేమ' పేరిట తాను రాసిన నవలలో స్వల్ప మార్పులు చేసి శ్రీమంతుడు పేరిట సినిమా తీశారంటూ ఆ మూవీ డైరెక్టర్ కొరటాల శివ, నిర్మాతలు ఎర్నేని రవి, ఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్లపై రచయిత శరత్ చంద్ర క్రిమినల్ కేసు పెట్టారు. దీనిని సవాల్ చేస్తూ ఆ ముగ్గురూ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో కాపీ రైట్ యాక్ట్ కింద డైరెక్టర్ కొరటాల శివ విచారణ ఎదుర్కోవాల్సిందేనని హై కోర్టు గతంలో తేల్చి చెప్పింది. ఇదే సమయంలో వారిపై చీటింగ్, ఫోర్జరీ కేసుల నమోదుకు ఉత్తర్వులివ్వాలని శరత్‌చంద్ర తన పిటిషన్‌లో కోరారు. 'శ్రీమంతుడు కథలో స్వల్ప మార్పులు ఉన్నాయని 8 మంది రచయితల కమిటీ చెప్పింది. దీంతో డైరెక్టర్ కాపీ రైట్ యాక్ట్ నిబంధనల ప్రకారం విచారణను ఎదుర్కోవాలి. ఎందుకంటే, దర్శకుడే కథా రచయతకు, స్క్రీన్‌ప్లేకు సొమ్ము చెల్లించారు. కథనంలో మార్పులు చేసి తన కథ అంటే కుదరదు. ఇలాంటి వ్యవహారాలపై విచారణను ఎదుర్కోవాలి. ఈ వ్యవహారంతో నిర్మాతకు సంబంధం లేదు. ఇదే సమయంలో దర్శకుడు, నిర్మాత, ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలపై చీటింగ్, ఫోర్జరీ కేసులు చెల్లవు' అని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది.

## సామాన్యులకు పద్మశ్రీ అవార్డులు

### గడ్డం సమ్మయ్య సన్మాన కార్యక్రమంలో కిషన్ రెడ్డి

హైదరాబాద్,జనవరి29 : పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక పీపుల్స్ పద్మా అవార్డులు ఇస్తున్నారని తెలిపారు. గతంలో పెద్ద పెద్ద పొజిషన్‌లో ఉన్నవారికే పద్మశ్రీ అవార్డులు వచ్చేవని అన్నారు. మొగిలయ్యాకు, మల్లేశం, సమ్మయ్య లాంటి వారికి పద్మా అవార్డులు వచ్చాయని తెలిపారు. యక్షగానం చేస్తున్న సమ్మయ్యకు ప్రధాని నరేంద్రమోదీ గుర్తించి పద్మశ్రీ అవార్డు ఇచ్చారని కిషన్ రెడ్డి తెలిపారు. నరేంద్రమోదీ తీసుకొచ్చిన నూతన విప్లవం ఇదని చెప్పారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ.. సినిమాలను తట్టుకొని కళను బతికిస్తున్నామని తెలిపారు. పద్మశ్రీ అవార్డు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా 5 రోజుల పాటు రామాయణ నాటకం వేసినట్లు తెలిపారు. అవార్డు వచ్చినట్లు ప్రకటన రావడం చాలా ఆనందంగా ఉందని గడ్డం సమ్మయ్య పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, లంకల దీపాక్ రెడ్డికి గడ్డం సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రగ్స్ దందాలో ఇద్దరి అరెస్ట్

### సినీ రంగంతో సంబంధం ఉన్న మహిళగా గుర్తింపు

హైదరాబాద్,జనవరి29 : 'డ్రగ్స్ దందా' ను తెలంగాణ నుంచే పూర్తిగా నిర్మూలించాలని అధికారులు సాయశక్తులా ప్రయత్నిస్తున్నా.. చాపకింద నీరులా ఈ డ్రగ్స్ దందా కొనసాగుతూనే ఉంది. సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తుల్లో కొందరు ఈ దందాని అత్యంత రహస్యంగా నడుపుతున్నారని ఇదివరకే కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. అందుకే.. అధికారులు ఇండస్ట్రీపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలోనే.. నార్సింగిలో ఇద్దరు నిందితులను తాజాగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిలో ఒకరు మహిళ కాగా, మరొకరు పురుషుడు. ట్విస్ట్ ఏమిటంటే.. ఆ మహిళ ఒక హీరో ప్రియురాలిగా తేలింది. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. నార్సింగిలో లావణ్య, ఉనీత్ రెడ్డిలను అరెస్ట్ చేశారు. ఈ ఇద్దరి నుంచి 4 గ్రాముల ఓఆఓం డ్రగ్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. లావణ్య హ్యాండ్ బ్యాగ్‌లో ఈ డ్రగ్స్ లభ్యమైంది. ఒక హీరో ప్రియురాలైన లావణ్య.. సంగీతం టీచర్‌గా పని చేస్తోంది. పోలీసుల విచారణలో.. ఉనీత్ రెడ్డి తనకు డ్రగ్స్ ప్యాకెట్లు ఇచ్చినట్లు లావణ్య తెలిపింది. అయితే.. ఆ డ్రగ్స్‌ని కొన్ని రోజుల క్రితమే ఉనీత్ నుంచి ఆమె కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. ఆ సమాచారంతోనే లావణ్యని ÷ూక్షి పోలీసులు తనిఖీ చేయగా.. హ్యాండ్‌బ్యాగ్‌లో ప్యాకెట్లు దొరికాయి. ఈ ఇద్దరిపై ఔఆఖా 22బీ, రెడ్ విత్ 8సీ కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులను రిమాండ్‌కి తరలించారు.

## అధ్వాన్నంగా ఎపిలో రోడ్లు

గుడివాడ,జనవరి29 : ఏపీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని.. కొండకోనల్లో ఉన్నామ అన్నట్లుగా.. నందివాడ మండల రహదారులు ఉన్నాయని గుడివాడ టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. రాము ఆధ్వర్యంలో సోమవారం నాడు మండల కేంద్రమైన నందివాడ గ్రామంలో ' బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులతో కలిసి ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ... 'అయ్యా ఎమ్మెల్యే ప్రజలను మనుషులుగా గుర్తించు.. ఒక్కసారి రోడ్లపైకి వస్తే ప్రజల కష్టాలేంటే తెలుస్తాయి' అని వెనిగండ్ల రాము అన్నారు.నికిరాని వ్యక్తినా మనం ఎన్నుకున్నది అని ప్రజలందరూ బాధపడుతున్నారని చెప్పారు. చేసిన తప్పు తెలుసుకుని టీడీపీ. జనసేన కూటమికి మద్దతు తెలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నందివాడ మండల ప్రగతికి చేయూతనిచ్చేలా ఆక్వాహబ్ ఏర్పాటు చేస్తామని ఇప్పటికే చంద్రబాబు ప్రకటించారన్నారు. పాలకులకు తీరిక లేకపోయినా, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను చొరవ తీసుకుంటున్నానని తెలిపారు. మనమందరం కలిసి గుడివాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళదామని వెనిగండ్ల రాము పేర్కొన్నారు.

## గ్యాంగ్‌స్టర్ దారుణహత్య

చండీఘడ్,జనవరి29 : హర్యానాలోని యమునానగర్‌లో గ్యాంగ్ షీటర్ రాజన్ దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు రాజన్ చేతులు, కాళ్లు కట్టేసి నిప్పంటించారు. పశ్చిమ యమునా కాలువ ఒడ్డున ఈ ఘటన జరిగింది. ఈ హత్యకు బాధ్యత వహిస్తూ దేవేంద్ర బంబిహా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. ఘటనపై సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పాట్ కు చేరుకున్నారు. మృతుడు రాజన్ ఎన్నో నేరాలకు పాల్పడుతూ పోలీసులకు వాంటెడ్ క్రిమినల్ గా పేరు గాంచాడు. అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కాల్వ ఒడ్డున కాలిపోయిన వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందింది. మృతదేహాన్ని పరిశీలించి రాజన్ గా గుర్తించారు.యితే.. ఈ హత్యకు బాధ్యత వహిస్తూ ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ వైరల్ అవుతోంది. రాజన్ హత్యకు దేవేంద్ర బంబిహా బాధ్యత వహిస్తున్నట్లు ఉంది. ఈ పోస్టు గురించి పోలీసు అధికారిని ప్రశ్నించగా తమకు ఏమీ తెలియదని చెప్పారు. మృతుల సన్నిహితులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా మృతుడు ఒక సంవత్సరం నుంచి ఇంటికి వెళ్లలేదని ఎవరితోనూ పరిచయం గానీ సంబంధ బాంధవ్యాలు గానీ లేవని పోలీసులు చెప్పారు.

## సిరిసిల్ల బిఆర్ఎస్‌కు షాక్

### మెత్తగా జారిపోతున్న నేతలు

రాజన్న సిరిసిల్ల,జనవరి29 : సిరిసిల్లలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌కు షాక్ తగిలింది. ముస్తాబాద్ మండలం జడ్పీటీసీ సభ్యుడు నర్సయ్య రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే పలువురు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కార్యకర్తలు రాజీనామాలు చేశారు. వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరడానికి రంగం సిద్ధమైంది. ఇటీవలేకేటీఆర్ సిరిసిల్లలో మీటింగ్ పెట్టారు. ఇంతలోనే నేతలు రాజీనామా విషయం బయటకు వచ్చింది. అయితే వారంతా రాజీనామా చేసే యోచనతోనే కేటీఆర్ సమావేశానికి సైతం గైర్హాజరైనట్టు సమాచారం. నేడో రేపో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

## బిసిలను అణగదొక్కుతూ దౌర్జన్యాలు

### మండిపడ్డ మాజీమంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి,జనవరి29 : వైసీపీ ప్రభుత్వం వల్ల ఏపీలో దౌర్జన్యాలు, అక్రమాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీ వర్గాలను అణగదొక్కి.. జగన్ నా బీసీలని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. చెవిటిపల్లి దుర్గారావు అనే మత్స్యకారుడిని పోలీసులు పొట్టన పెట్టుకున్నారన్నారు. జై జగన్ అని చెప్పమంటే.. జై చంద్రబాబు అన్నందుకు తోట చంద్రయ్యను చంపారని ÷ర్ అయ్యారు. వైసీపీలో చేరనందుకు పద్మను వివస్త్రను చేసి వేధించారని చెప్పారు. రాంసింగ్ అనే బీసీ.. హారన్ కొట్టాడని చితకబాదారన్నారు. తన అక్కను వేధించవద్దన్నందుకు అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లాలో కృష్ణా మాస్టర్‌ని దారుణంగా చంపారన్నారు. అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. నియంతృత్వ జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించే తొలి ఓటు బీసీలదే అవుతుందని కొల్లు రవీంద్ర అన్నారు.

# గూడూరులో స్వల్ప ఉద్రిక్తత

**వార్డు సభ్యుడిగా గెలవలేనోడు విమర్శిస్తాడా**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**మంత్రి తీరుపై హరీష్ రావు ఆగ్రహం**

భువనగిరి,జనవరి29 : గ్రామపంచాయతీ సాక్షిగా మంత్రి, జడ్పీ చైర్మన్ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. ఒకరినొకరు పరస్పరం విమర్శలు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. యదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రితో పాటు ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా సందీప్ రెడ్డి మాట్లాడుతూ నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నిధులతో నిర్మించిన భవనాలను ప్రారంభించడమే కాకుండా బీఆర్ఎస్ పై బురద జల్లడం సరికాదన్నారు. రైతుబంధు అడిగినోళ్లను చెప్పుతో



కొట్టాలని మంత్రి అనడం మంచి పద్ధతి కాదని సూచించారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వెంటనే లేచి మాజీ మంత్రి మాధవరెడ్డి మహనీయుడని, ఆయన కొడుకు బచ్చా అంటూ.. కనీసం వార్డు సభ్యుడిగా కూడా గెలవలేనోడు తనను విమర్శించడం హాస్యాస్పదం అని అన్నారు. వెంటనే ఆయనను బయటకు పంపాలని పోలీసులను మంత్రి ఆదేశించారు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వావాదం చోటు చేసుకుంది. ఇంతలోనే కాంగ్రెస్ శ్రేణులు స్టేజీపైకి వచ్చి హంగామా సృష్టించి ఒక్కసారిగా జడ్పీ చైర్మన్ పైకి దూసుకెళ్లారు. దీంతో జడ్పీ చైర్మన్ ను పోలీసులు,బీఆర్ఎస్ శ్రేణులు అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లారు. యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డిపై కాంగ్రెస్ నేతల దౌర్జన్యాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో సాటి ప్రజాప్రతినిధులను అవమానపరుస్తున్న మంత్రుల వైఖరి గర్హనీయమని హరీశ్‌రావు అన్నారు. మొన్న రైతుబంధు రాలేదన్న వారిని చెప్పుతో కొట్టండి అని పిలుపునిచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. నేడు అధికారిక కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్‌ను అకారణంగా దుర్భాషలాడటం కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని విమర్శించారు. దుర్భాషలాడింది చాలదన్నట్టు.. పోలీసులకు హుకుం జారీ చేసి బలవంతంగా సందీప్ రెడ్డిని బయటకు పంపిన తీరును ఖండిస్తున్నా అని హరీశ్‌రావు అన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా కోమటిరెడ్డి పోకడలను తీవ్రంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం నమ్మకం ఉన్నా.. జడ్పీచైర్మన్‌కు తక్షణమే క్షమాపణ చెప్పాలని మంత్రి కోమటిరెడ్డిని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఆరేళ్ల కల సాకారమైన వేళ

- పొంగులేటి చొరవతో అప్పల నర్సింహాపురానికి బస్సు సర్వీస్
- గ్రామ నాయకుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ అధికారులతో మాట్లాడిన క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి
- హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు



**పాలేరు జనవరి 29(నినాదం న్యూస్)** నేలకొండపల్లి మండలం అప్పలనర్సింహాపురం గ్రామస్తుల ఆరేళ్ల కల మంత్రి పొంగులేటి చొరవతో సాకారమైంది. గత ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు తమ గ్రామానికి బస్సు సర్వీస్ ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని చెబుతూ ఇదే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి దృష్టికి ఆదివారం తీసుకువెళ్ళారు. వెంటనే ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. గ్రామస్తుల కోరిక మేరకు బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన అధికారులు బస్సు సర్వీస్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఉదయాన్నే ఆ గ్రామానికి బస్సు రావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో ఎనికె జానకి రామయ్య, మన్నే నగేష్, శీలం పెద్ద వెంకటేశ్వర్లు, పుసులూరి విశ్వనాథం, పెంటమాల అశోక్, వెంపటి స్వామి, అయినాల భాస్కరరావు తదితరులు ఉన్నారు.

## దగ్ధమైన కిరాణా షాప్ పరిశీలన



**ఆళ్లపల్లి, జనవరి 29 నినాదం న్యూస్:** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని నరేడ్ల ప్రవీణ్ కిరాణా దుకాణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో గత మూడు రోజుల క్రితం కాలిపోయిన సంగతి విధితమే సోమవారం కిరాణా షాప్ బాధితులను పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు ఈ కార్యక్రమంలో రెండో వార్డు సభ్యులు మహమ్మద్ ఖయ్యూం, కసనబోయిన నరేష్, కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ నారగాని జన్మదిన వేడుకలు



**ఖమ్మం టౌన్, జనవరి 30(నినాదం న్యూస్):** ఆద్య హాస్పిటల్ అధినేత డాక్టర్ నారగాని రాంప్రసాద్ జన్మదిన వేడుకలు మెడికల్ రీప్రజెంటేటివ్స్ ఆధ్వర్యంలో మయూరి సెంటర్ లో గల తన ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. తొలుత డాక్టర్ రాంప్రసాద్ రీప్రజెంటేటివ్స్ ల నడుమ కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అనంతరం రాజకీయ ప్రముఖులు, స్థానిక ప్రజా ప్రతి నిధులు, పుర ప్రముఖులు పుష్ప గుచ్ఛం అందించి నారగాని కి శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల వైద్యుడిగా పేరొందడమే గాక, అన్ని వర్గాల పేద ప్రజలకు అందుబాటు ధరలో వైద్య సేవలు అందిస్తూ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజ్మెంట్ సత్యనారాయణ, ఫార్మా సిబ్బంది కిరణ్ శిరీష, రీప్రజెంటటివ్స్ మేనేజర్ పూర్ణ, సురేష్ , అశోక్, ఆదిత్య, రవిబాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిసిసిబి ఉద్యోగులపై దాడి చేసిన యువకులను రిమాండ్ కోర్టుకు తరలింపు

**ఆళ్లపల్లి జనవరి 29 నినాదం న్యూస్:** ఆళ్లపల్లి మండలం మర్కోడులో బ్యాంకు రుణాల రికవరీ కోసం వచ్చిన ఉద్యోగులపై మద్యం మత్తులో యువకులు దాడి చేసిన సంగతి విధితమే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు ఇల్లందు డిఎస్పి రమణమూర్తి, టేకులపల్లి సిఐ ఇంద్రసేనారెడ్డి ఆదేశాల సారంగా స్థానిక ఎస్సై రతీష్ డిసిసిబి ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేసిన యువకులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని ఓ ప్రకటనలో మీడియా మిత్రులకు సోమవారం తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల పైన తిరగబడిన, దాడి చేసిన వారిపై పోలీస్ శాఖ తరపున కఠినమైన చర్యలు తీసుకుంటామని విద్యార్థులు యువకులు ఎలాంటి మత్తు పదార్థాలు సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని అట్లు చేసిన యెడల వారి పైన కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆటోవాలా పరిస్థితి ఆగమాగం..!

- ఉచిత బస్సుతో ఆటో డ్రైవర్ల ఇబ్బందులు...



**కారేపల్లి, జనవరి 29 (నినాదం న్యూస్):** కారేపల్లి మండల వ్యాప్తంగా ప్యాసింజర్ ఆటోలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఐనా సరే ఒకప్పుడు ప్రయాణికులని ఎక్కించుకోవడంలో బస్సులతో పోటీ పడేవి. కాని నేడు మహిళలకు ఉచిత ప్రయాణాలు కావడం వల్ల ఆటోలకు ఆదరణ తగ్గింది. కారేపల్లి మండల కేంద్రం నుంచి పలుమార్గాల్లో ఐతే ఆటోల గిరాకీ పూర్తిగా పడిపోయింది. కాగా రోజు మొత్తం నడిపిన కనీస లాభాలు కూడా రాక ఆటో డ్రైవర్లు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు బస్సులతో పోటీపడిన ఆటోలు నేడు మూగబోతున్నాయి. ఉచిత బస్సులలో ప్రయాణికులు కిటకిటలాడటంతో బస్టాండ్ సెంటర్లలో ఆటో డ్రైవర్లు ముచ్చటలాడుతున్నారు. కిరాయి లేక ఆటో ఫైనాన్స్ కట్టుకోలేక పలు డ్రైవర్ల కుటుంబాల్లో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆటోల పరిస్థితి ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో ఆటో ను నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఆటోలు అమ్ముకొని రోడ్డు మీద పడాల్సిందేనని పలువురు ఆటో ఓనర్లు, డ్రైవర్లు వాపోతున్నారు.

## సియంఓఏఐ సభ్యులకు జిఎం శుభాకాంక్షలు




**ఇల్లందు,జనవరి29 (నినాదం న్యూస్):** సింగరేణి ఏరియా ఇల్లందులో నిర్వహించిన కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా ఎన్నికలలో గెలుపొందిన సభ్యులకు సోమవారం జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లందు ఏరియా బ్రాంచి అధ్యక్షులుగా జి. శివప్రసాద్(అడిషనల్ మేనేజర్ జెకెఓసి),ఉపాధ్యక్షులుగా ఎం. చిన్నయ్య(ప్రాజెక్ట్ ఇంజెకెఓసి),మధుసూదన్(ఎస్ ఈ కోయగూడెం),ఏరియా సెక్రటరీ కె. శ్రీనివాసరావు(ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్),జాయింట్ సెక్రటరీలుగా పి. పవన్ కుమార్(డివైఎస్ఇ),బి. నాగేశ్వరరావు(సర్వే ఆఫీసర్ జెకెఓసి),ట్రెజరర్ గా వి. సందీప్(సీనియర్ ఎకౌంటు ఆఫీసర్)జాయింట్ ట్రెజరర్ గా బోడ నాగేశ్వరరావు(ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)లను అభినందించారు.

## రైతుల కోసం మేగా ఫుడ్ పార్క్‌ను ప్రారంభిస్తాం...

- ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు చేస్తాం
- ఈ ప్రాంతంలోనే పామాయిల్ విత్తనాల సేకరణ



**సత్తుపల్లి, జనవరి 29 (నినాదం న్యూస్):** సత్తుపల్లి మండలంలో వచ్చే నెలలో ఫుడ్ పార్క్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు మేగా ఫుడ్ పార్క్ ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల, సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మన ప్రాంతంలో పండే అన్ని పంటలను నిల్వ చేయటానికి ఫుడ్ పార్క్ ను స్థాపించామన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతులు పండించే పంటకు డిమాండ్ పెరుగుతుందన్నారు. రైతుకు మేలు జరగాలి అంటే స్టోరేజ్ కు రావాలన్నారు. అన్ని దేశాలు కూడా మన దేశం వైపు చూస్తున్నాయన్నారు. పంటను దాచుకొని యే విధంగా ఎగుమతి చేయ్యాలి, యే సమయంలో చేయాలి అనే దానితో అవగాహన కలిగి ఉంటే రైతులకు డిమాండ్ పెరుగుతుందన్నారు. పామాయిల్ విత్తనాల కోసం ఇతర దేశాల నుండి తీసుకురాకుండా మన దేశంలో మన రాష్ట్రం లో మన జిల్లా లోనే ప్రాసెసింగ్ ప్రారంబిస్తామన్నారు. వచ్చే నెలలో ఫుడ్ ఫార్క్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీద ప్రారంభిస్తామన్నారు. ముందుగా మామిడి ప్రాసెసింగ్ ప్రారంభించాలన్నారు. రైతులకు మేలు జరగాలి అంటే మంచి విత్తనాలు కావాలన్నారు. రైతు వేదికలు నిరుపయోగంగా ఉన్నాయని, అక్కడ విత్తనాలు పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతు వేదిక ద్వారా శాస్త్రవేత్తలతో మాట్లాడే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. అప్పుడు రైతులు ఎక్కడికి పోవాల్సిన అవసరం లేదనని, రైతు వేదికలను ఉపయోగంలోకి తీసుకొని ప్రతి విషయాన్ని శాస్త్ర వేత్తల ద్వారా రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయాన్ని ముందుగా తీసుకు వెళ్తానని అన్నారు. రైతులు ఆర్థికంగా నిలబడాలన్నారు. ఫుడ్ ఫార్క్ ద్వారా రైతులకు ఎలాంటి మేలు జరుగుతుందో రైతులకు వివరించాలని అధికారులకు ఆదేశించారు. మన పంటలను చూసి మీగతా జిల్లాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. భవిష్యత్తులో ఆయిల్ ఫాం రైతులకు మంచి రోజులు రావాలన్నారు. రైతులు పండించే ప్రతి పంట బుగ్గపాడు ఫుడ్ పార్క్ ద్వారా ప్రాసెసింగ్ అవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, ఆయిల్ ఫామ్ అధికారులు, ఆయిల్ ఫామ్ రైతు నాయకులు, కాకర్లపల్లి బుగ్గపాడు రుద్రాక్ష పల్లి నాగుపల్లి ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## దాతృత్వగుణం ఎంతో గొప్పది




- తండ్రి జ్ఞాపకార్థంగా స్టేషనరీ పంపిణీ...
- ప్రణాళిక బద్ధంగా చదివితేనే మంచి ఫలితాలు...
- కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు...

**కారేపల్లి, జనవరి 29 (నినాదం న్యూస్):** కారేపల్లి మండల కేంద్రంలోని కారేపల్లి గ్రామానికి చెందిన కందుకూరి వరప్రసాద్ తన తండ్రి గురప్ప జ్ఞాపకార్థంగా పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు. సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కారేపల్లి ఎస్ఐ పుష్పాల రామారావు విద్యార్థులకు స్టేషనరీ అందజేసిన అనంతరం మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యను అభ్యసించే ప్రతి ఒక్కరు ప్రణాళిక బద్ధంగా చదివితేనే పరీక్షలను మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు. పరీక్షలు సమయం ఆసన్నమైందని, విద్యార్థులు నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధగా చదవాలన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి నేడు మంచి స్థితిలో ఉన్నారంటే వరప్రసాద్ తండ్రి విద్యకు ఇచ్చిన విలువతోనే సాధ్యమైందన్నారు. విద్యార్థులందరూ రాబోయే పరీక్షలకు బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఈ సందర్భంగా కోరారు. డబ్బులు ఉన్నా దాతృత్వగుణం కలిగి ఉండడం చాలా అరుదుగా ఉంటుందని, కందుకూరి వరప్రసాద్ తన తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషనరీ దాత కందుకూరి వరప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు మంచి విద్యార్థి అందించాలని లక్ష్యంతో ఎంత కష్టానైనా తల్లిదండ్రులు భరిస్తారని అన్నారు. అటువంటి తల్లిదండ్రుల కష్టాన్ని ప్రతి ఒక్క విద్యార్థి గుర్తించి విద్య పట్ల శ్రద్ధ కనబరచాలని కోరారు. వ్యవసాయ కూలీగా పనిచేస్తూ సరైన ఇల్లు లేకపోయినా విద్య అందిస్తే భవిష్యత్తులో పెద్ద ఇల్లు కట్టుకుంటారని నమ్మి నా తండ్రి గుర్రప్ప తన సంపాదన మొత్తాన్ని మా చదువులకే వెచ్చించారని, నేడు తన తండ్రి ప్రోత్సాహంతోనే ఈ స్థితిలో ఉన్నామన్నారు. కాగా పాఠశాల ఉపాధ్యాయురాలు శిరీష సంకల్పం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ చెప్పిన కథ విద్యార్థులను, అతిథులను ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, కందుకూరి రమేష్, రిటైర్డ్ హెచ్ఎం వి రాములు, రిటైర్డ్ ఉపాధ్యాయులు బాబు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లోనే నాణ్యమైన విద్య : డీఎస్పి




**ఇల్లందు,జనవరి29(నినాదం న్యూస్):** మైనార్టీ గురుకులాల్లోనే నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని ఇల్లందు డిఎస్పి రమణమూర్తి అన్నారు. సోమవారం మొదటి సంవత్సర ఇంటర్మీడియట్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ పాంప్లేట్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ..కార్పొరేట్ కంటే దీటుగా నిర్వహించ బడుతున్న మైనారిటీ గురుకులాన్ని ప్రతి పేద,మధ్య తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10వ తరగతి పూర్తి చేసిన మైనారిటీ, నాన్ మైనారిటీ(ఎస్సీ,ఎస్టి,బీసీ,ఓసి) విద్యార్థులు యంపిసీ,బైపిసీ కోర్సులలో చేరి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ ముదస్సార్ హుస్సేన్,కొండలరావు,అశోక్,హరీష్, సైదవాలి,సాదిక్, విద్యాసాగర్, చైతన్య,మహేశ్వరీ, పిడి నజీముద్దీన్ పాల్గొన్నారు.

## 42 గోవా మద్యం సీసాల పట్టివేత

**మునిపల్లి జనవరి 29 (నినాదం న్యూస్)** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద సోమవారం ఎన్ఫోర్స్మెంట్ మెదక్ డివిజన్ ఎక్సైజ్ అధికారులు జరిపిన వాహన తనిఖీలలో భాగంగా గోవా నుండి హైదరాబాద్‌కు కార్‌లో అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని స్వాదీనం చేసుకున్నారు , ఇందులో మొత్తం 42 మద్యం సీసాలతో పాటు నలుగురు వ్యక్తులను స్కోడా కార్ ని సీజ్ చెయ్యడం జరిగింది, పట్టుబడిన వ్యక్తులలో బొల్లారం కు చెందిన శంకర్ తో పాటు అనుచరులు ఉన్నారు. తనిఖీలలో సి.ఐ లు మోహన్ కుమార్, రమేష్ రెడ్డి , రజిత ఎస్.ఐ లు విశ్వనాథ్ , అనిల్ కుమార్ అలీమ్ , అజామ్ ఈ. సి లు గోపాల్ , సతీష్, మల్కయ్య , రామారావు, కరీం లు పాల్గొన్నారు.



## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో విద్యాభ్యాసం కొనసాగించాలి

- ఎం ఇ ఓ బి. రాములు



**పాలేరు, జనవరి 29(నినాదం న్యూస్):** నేలకొండపల్లి మండలం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి మండల స్థాయి ప్రతిభా పరీక్షలో మండలంలోని 16 ఉన్నతపాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాధికారి శ్రీ బి రాములు మాట్లాడుతూ, విద్యార్థులు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిహెచ్ భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షులు సుంకర మోని నాగార్జున, జిల్లా బాధ్యులు ఇ. వెంకటేశ్వర్లు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు రోజు కూలి 600 రూపాయలు చెల్లించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వి.రామిరెడ్డి డిమాండ్


**పాలేరు, జనవరి 29(నినాదం న్యూస్):** ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి 600 రూపాయలు చెల్లించాలని, ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేవీ రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక డిప్యూటీ తాసిల్దార్ కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల మంది వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ పనిని జీవనాధారంగా కొనసాగిస్తున్నారన్నారు. బిజెపి అధికారం చేపట్టిన తర్వాత ప్రతి ఏటా బడ్జెట్లో ఉపాధి నిధులు తగ్గిస్తూ పేదలకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెరిగిన దామాషా పద్ధతిలో కేంద్ర బడ్జెట్లో 2.64 వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో కనీస మౌలిక సదుపాయాలు, టెంట్లు, మంచినీళ్లు మెడికల్ కిట్టు ఏర్పాటు చేయాలన్నారు. కార్పొరేషన్, మున్సిపల్ పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పనిని చేపట్టాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, కొత్తగా పెళ్లయిన కుటుంబాలకు తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలందరికీ సమగ్ర కూలి చట్టం తేవాలని, ప్రతి పేద కుటుంబానికి ప్రతి నెల 10 వేల రూపాయలు కూలి బందు ఇవ్వాలని, విద్య వైద్య రంగాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తి బాధ్యత తీసుకొని వ్యవసాయ కార్మిక కుటుంబాలను ఆదుకోవాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దుగ్గి వెంకటేశ్వర్లు ఉన్నారు.



## నేటితో తీరనున్న చిన్నారుల కష్టాలు

- నేడు మీట్యా తండా అంగన్వాడి కేంద్రం ప్రారంభోత్సవం

**కారేపల్లి, జనవరి 29 (నినాదం న్యూస్):** కారేపల్లి మండల పరిధిలోని వెంకటయ్య తండా గ్రామ పంచాయతీలో గల మీట్యా తండాలో ఎన్నో సంవత్సరాల తరబడి బుడిబుడి అడుగులేసే చిన్నారుల అంగన్వాడి కష్టాలు నేటితో తెరపడనున్నాయి. ఐటిడిఏ నిధులతో రూ. లక్షలు వెచ్చించి నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనం (వెంకట్యా తండాలో) మంగళవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ప్రారంభించనున్నారు.



# స్పోర్ట్స్

# వైజాగ్ మ్యాచ్‌కు జడేజా, కేఎల్ రాహుల్ దూరం

ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా హైదరాబాద్ వేదికగా జరిగిన తొలి పోటీలో టీమిండియా 28 పరుగుల తేడాతో ఓడిపోయింది. అసలే ఓటమి బాధలో ఉన్న భారత జట్టుకు ఇప్పుడు స్ట్రోకు మీద స్ట్రోకు తగులుతోంది. విశాఖపట్నంలో ఇరు జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ నుంచి స్టార్ ప్లేయర్లు రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ తప్పుకున్నారు. %దీజజ×% స్వయంగా తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఈ విషయాన్ని పంచుకుంది. తొలి టెస్టు మ్యాచ్‌లో గాయపడిన రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ రెండో టెస్టు మ్యాచ్‌కు దూరమైనట్లు బీసీసీఐ తెలిపింది. హైదరాబాద్‌లో జరుగుతున్న తొలి టెస్టు నాలుగో రోజు రవీంద్ర జడేజా గాయపడ్డాడు. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో పరుగు కోసం పరుగులు తీస్తున్న జడేజా.. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అద్భుత త్రోతో రనౌట్ అయ్యాడు. అప్పటికే గాయంతో బాధపడుతున్నాడు రవీంద్ర. అతనితో పాటు, కేఎల్ రాహుల్ కూడా కుడి తొడ నొప్పితో బాధపడుతున్నారని, వారిద్దరూ వైద్య బృందం పర్యవేక్షణలో ఉంటారని బీసీసీఐ తెలిపింది. మరోవైపు గాయం కారణంగా జట్టుకు దూరమైన జడేజా, రాహుల్ స్థానంలో ముగ్గురు ఆటగాళ్లను బీసీసీఐ ఎంపిక చేసింది. ఇంగ్లండ్ లయన్స్ పై అద్భుత ప్రదర్శన చేసిన సర్ఫరాజ్ ఖాన్ ఎట్టకేలకు టీమిండియాలో స్థానం సంపాదించాడు. రాహుల్ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ జట్టులోకి వచ్చాడు. అలాగే ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాకు బదులుగా వాషింగ్టన్ సుందర్‌కు జట్టులో చోటు కల్పించారు. వీరిద్దరితో పాటు తొలి టెస్టు ప్రారంభానికి ముందే జట్టు నుంచి విడుదలైన అవేశ్ ఖాన్ స్థానంలో సౌరభ్ కుమార్ జట్టులోకి ఎంపికయ్యాడు. గాయం కారణంగా జట్టుకు దూరమైన రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ అందుబాటులో లేకపోవడం టీమ్ ఇండియాకు భారీ ఎదురుదెబ్బేనని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ ఇద్దరు ఆటగాళ్లు తొలి టెస్టులో అద్భుత ప్రదర్శన చేశారు. కేఎల్ రాహుల్ 86 పరుగుల ఇన్నింగ్స్ ఆడగా, రవీంద్ర జడేజా కూడా 87 పరుగులు చేసి మొదటి



ఇన్నింగ్స్‌లో జట్టు స్కోరును 400 దాటించాడు. దీంతో పాటు బౌలింగ్‌లోనూ మ్యాజిక్ చేసిన జడేజా 5 వికెట్లు పడగొట్టి అద్భుతంగా రాణించాడు. మరి వీరిద్దరి అందుబాటులో లేని పరిస్థితిని కెప్టెన్ రోహిత్ శర్మ ఎలా అధిగమిస్తాడో చూడాలి. రోహిత్ శర్మ (కెప్టెన్), శుభమన్ గిల్, యశస్వి జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్, కెఎస్ భరత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ముఖేష్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, సర్ఫరాజ్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్ వాషింగ్టన్ సుందర్, సౌరభ్ కుమార్.



## బుమ్రాపై చర్యలకు ఉపక్రమించిన ఐసిసి

హైదరాబాద్ టెస్టులో టీమిండియా ఓటమి క్రికెట్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇంగ్లండ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు ప్రదర్శన నిరాశకు గురిచేసిందంటూ మాజీ ప్లేయర్లు, క్రికెట్ నిపుణులు రోహిత్ సేనపై విమర్శలు చేస్తున్నారు. అసలే ఓటమి పరాజయంతో ఉన్న టీమిండియాకు షాక్ ల మీద షాక్ లు తగులుతున్నాయి. మొదటి టెస్ట్‌లో అద్భుతంగా రాణించిన స్టార్ ఫాస్ట్ బౌలర్ జట్టు వైస్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా పై ఐసీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భారీ సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలిపించిన ఓలీ పోప్‌తో అనుచితంగా ప్రవర్తించినందుకు బుమ్రాపై చర్యలకు ఉపక్రమించింది అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్. తొలి టెస్టులో ఐసీసీ ప్రవర్తనా నియమావళి లెవల్ 1ను ఉల్లంఘించినందుకుశిక్షగా బుమ్రాకు ఒక డీమెరిట్ పాయింట్, అలాగే మ్యాచ్ ఫీజులో 50% జరిమానా విధించబడింది. జస్ప్రీత్ బుమ్రా ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12ను ఉల్లంఘించినట్లు ఐసీసీ తెలిపింది. అంటే మైదానంలోని అంపైర్, మ్యాచ్ రెఫరీ లేదా ఇతరులతో ఢీకొట్టడం లేదా అనుచితంగా ప్రవర్తించినందుకన్నమాట. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 81వ ఓవర్ వేయడానికి జస్ప్రీత్ బుమ్రా బంతిని అందుకున్నాడు. ఇదే ఓవర్‌లో సెంచరీ వీరుడు ఓలీ పోప్ పరుగు తీస్తున్న సమయంలో సమయంలో బుమ్రా కావాలనే అతనికి అడ్డుగా వెళ్లినట్లు, పోప్‌ను ఢీకొట్టేందుకు ప్రయత్నించాడని అంపైర్లు గుర్తించారు. .ఇది ఐసిసి నిబంధనలకు విరుద్ధం. అయితే గత 24 నెలల్లో బుమ్రా ఇలా అనుచితంగా ప్రవర్తించడం ఇదే మొదటిసారి కావడంతో ఐసీసీ తక్కువ శిక్ష, జరిమానాతో వదిలేసింది. బుమ్రాపై ఆన్-ఫీల్డ్ అంపైర్లు పాల్ రీఫిల్, క్రిస్ గాఫ్నీ, థర్డ్ అంపైర్ మరైస్ ఎరాస్మస్చ ఫోర్త్ అంపైర్ రోహన్ పండిట్ ఆరోపణలు చేశారు. ప్రవర్తనా నియమా వళి యొక్క లెవల్ 1 ఉల్లంఘన సాధారణంగా అధికారికంగా మందలింపు, ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లకు దారి తీస్తుంది. తదనుగుణంగా, బుమ్రా తన తప్పును అంగీకరించాడు ఎమిరేట్స్ %×జజ% ఎలైట్ ప్యానెల్ ఆఫ్ మ్యాచ్ రిఫరీలకు చెందిన రిచీ రిచర్డ్సన్ విధించిన పెనాల్టీని కూడా అంగీకరించాడు. అందువల్ల ఎలాంటి అధికారిక విచారణ అవసరం లేదని ఐసీసీ తెలిపింది.

## మైదానంలో దిగి సత్తాచాటుతాం: బెన్ స్టోక్స్

హైదరాబాద్ టెస్టులో టీమిండియా ఓటమి క్రికెట్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇంగ్లండ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు ప్రదర్శన నిరాశకు గురిచేసిందంటూ మాజీ ప్లేయర్లు, క్రికెట్ నిపుణులు రోహిత్ సేనపై విమర్శలు చేస్తున్నారు. అసలే ఓటమి పరాజయంతో ఉన్న టీమిండియాకు షాక్ ల మీద షాక్ లు తగులుతున్నాయి. మొదటి టెస్ట్‌లో అద్భుతంగా రాణించిన స్టార్ ఫాస్ట్ బౌలర్ జట్టు వైస్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా పై ఐసీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భారీ సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలిపించిన ఓలీ పోప్‌తో అనుచితంగా ప్రవర్తించినందుకు బుమ్రాపై చర్యలకు ఉపక్రమించింది అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్. తొలి టెస్టులో ఐసీసీ ప్రవర్తనా నియమావళి లెవల్ 1ను ఉల్లంఘించినందుకుశిక్షగా బుమ్రాకు ఒక డీమెరిట్ పాయింట్, అలాగే మ్యాచ్ ఫీజులో 50% జరిమానా విధించబడింది. జస్ప్రీత్ బుమ్రా ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12ను ఉల్లంఘించినట్లు ఐసీసీ తెలిపింది. అంటే మైదానంలోని అంపైర్, మ్యాచ్ రెఫరీ లేదా ఇతరులతో ఢీకొట్టడం లేదా అనుచితంగా ప్రవర్తించినందుకన్నమాట. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 81వ ఓవర్ వేయడానికి జస్ప్రీత్ బుమ్రా బంతిని అందుకున్నాడు. ఇదే ఓవర్‌లో సెంచరీ వీరుడు ఓలీ పోప్ పరుగు తీస్తున్న సమయంలో సమయంలో బుమ్రా కావాలనే అతనికి అడ్డుగా వెళ్లినట్లు, పోప్‌ను ఢీకొట్టేందుకు ప్రయత్నించాడని అంపైర్లు గుర్తించారు. .ఇది ఐసిసి నిబంధనలకు విరుద్ధం. అయితే గత 24 నెలల్లో బుమ్రా ఇలా అనుచితంగా ప్రవర్తించడం ఇదే మొదటిసారి కావడంతో ఐసీసీ తక్కువ శిక్ష, జరిమానాతో వదిలేసింది. బుమ్రాపై ఆన్-ఫీల్డ్ అంపైర్లు పాల్ రీఫిల్, క్రిస్ గాఫ్నీ, థర్డ్ అంపైర్ మరైస్ ఎరాస్మస్చ ఫోర్త్ అంపైర్ రోహన్ పండిట్ ఆరోపణలు చేశారు. %×జజ% ప్రవర్తనా నియమావళి యొక్క లెవల్ 1 ఉల్లంఘన సాధారణంగా అధికారికంగా మందలింపు, ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లకు దారి తీస్తుంది. తదనుగుణంగా, బుమ్రా తన తప్పును అంగీకరించాడు ఎమిరేట్స్ %×జజ% ఎలైట్ ప్యానెల్ ఆఫ్ మ్యాచ్ రిఫరీలకు చెందిన రిచీ రిచర్డ్సన్ విధించిన పెనాల్టీని కూడా అంగీకరించాడు. అందువల్ల ఎలాంటి అధికారిక విచారణ అవసరం లేదని ఐసీసీ తెలిపింది.

## ఏడు ఓవర్ల కోసం స్పెషలిస్ట్ పేసర్ అవసరమా?

### భారత మాజీ క్రికెటర్, కామెంటేటర్ పార్థివ్ పటేల్

మహమ్మద్ సిరాజ్‌తో ఎక్కువగా బౌలింగ్ చేయించనప్పుడు అతన్ని తుది జట్టులో ఆడించడం ఎందుకు? అని, ఏడు ఓవర్ల కోసం స్పెషలిస్ట్ పేసర్ అవసరమా? అని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను భారత మాజీ క్రికెటర్, కామెంటేటర్ పార్థివ్ పటేల్ ప్రశ్నించాడు. సిరాజ్‌కు బదులు ఎక్స్‌ట్రా బ్యాటర్‌ను తుది జట్టులోకి తీసుకోవాలన్నాడు. అక్షర్ పటేల్‌కు బదులు కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో హైదరాబాద్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 28 పరుగుల తేడాతో ఓటమిపాలైన విషయం తెలిసిందే. మొదటి టెస్టులో ఇంగ్లండ్ జట్టు పేసర్ మార్క్ వుడ్.. ముగ్గురు స్పిన్నర్లు జాక్ లీచ్, టామ్ హార్ట్లీ మరియు రెహాన్ అహ్మద్‌లలో బరిలోకి దిగింది. భారత్ భారత్ స్పిన్ త్రయం రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లతో పాటు జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్‌లను ఆడించింది. ఈ మ్యాచ్‌లో 24.4 ఓవర్లు బౌలింగ్ చేసిన బుమ్రా.. ఆరు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్ మొదటి ఇన్నింగ్స్‌లో నాలుగు ఓవర్లు, రెండవ ఇన్నింగ్స్‌లో ఏడు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. ఇన్నింగ్స్‌లలో ఒక్క వికెట్ కూడా తీయలేదు. ఈ క్రమంలోనే సిరాజ్ బదులు స్పెషలిస్ట్ బ్యాటర్‌ను తీసుకోవడం ఉత్తమమని పార్థీవ్ పటేల్ అభిప్రాయపడ్డాడు. జియోసినిమా షోలో పార్థీవ్ పటేల్ మాట్లాడుతూ%ా% 'తుది జట్టులో ముగ్గురు స్పిన్నర్లు సరిపోతారనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే నాకు భిన్నమైన దృక్పథం ఉంది. ఉప్పల్ టెస్ట్ మ్యాచ్‌లో సిరాజ్‌తో 6-7 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయించారు. ఈ టెస్ట్ మ్యాచ్‌కు ముందు కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ.. బ్యాటింగ్ సామర్థ్యం కారణంగానే కుల్దీప్ యాదవ్‌కు బదులు అక్షర్ పటేల్‌ను ఆడిస్తున్నామన్నాడు. అయితే వైవిధ్యం కావాలనుకుంటే అక్షర్ స్థానంలో కుల్దీప్‌ని ఎంచుకోవచ్చు. స్పషలిస్ట్ బ్యాటర్‌ను తీసుకోవడం మంచిది. అప్పుడు భారత బ్యాటింగ్ డెప్త్ బలంగా మారుతుంది' అని అన్నాడు. 'ఆర్ అశ్విన్, ఆర్ జడేజా మరియు కుల్దీప్‌లతో జట్టులో మూడు రకాల బౌలర్లు ఉంటారు. అదనపు బ్యాటర్ కారణంగా భారత బ్యాటింగ్ డెప్త్ పెరుగుతుంది. సిరాజ్‌తో ఎక్కువగా బౌలింగ్ చేయించనప్పుడు అతన్ని ఆడించడంలో అర్థం లేదు' అని పార్టీవ్ పటేల్ పేర్కొన్నాడు. ఉప్పల్ టెస్ట్ మ్యాచ్‌లో భారత్ బ్యాటింగ్ వైఫల్యంతో ఓడిపోయిన విషయం తెలిసిందే. మొదటి టెస్ట్ నాలుగు రోజుల్లో ముగిసింది. ఇక ఫిబ్రవరి 2 నుంచి విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో రెండో టెస్ట్ ఆరంభం అవుతుంది.



## టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌ను కలిసిన తమిళనాడు సీఎం!

టెన్నిస్ దిగ్గజం, సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్‌ను తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కలిశారు. స్పెయిన్‌కు వెళ్లే మార్గంలో విమానంలోనే జొకోవిచ్‌ను స్టాలిన్ కలుసుకున్నారు. కాసేపు టెన్నిస్ దిగ్గజంతో మాట్లాడిన సీఎం.. ఆపై ఫొటో దిగారు. ఈ పోటోలను స్వయంగా తమిళనాడు సీఎం తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విమానంలో జొకోవిచ్‌ను చూసి ఒక్కసారిగా ఆశ్చర్యపోయానని, అతడిని కలిసినందుకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. 'ఆకాశంలో ఆశ్చర్యం. స్పెయిన్‌కు వెళ్లే మార్గంలో టెన్నిస్ దిగ్గజం నోవాక్ జొకోవిక్‌ను కలిశాను' అని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ పోస్టుకు జొకోవిచ్‌తో తాను దిగిన ఫొటోను జత చేశారు. ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ 2024లో ఓటమి అనంతరం జకో తన స్వదేశమైన సెర్బియాకు బయలుదేరాడు. ఆ సమయంలోనే సీఎం స్టాలిన్ అతడిని కలిసి ఉంటారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ 2024 సెమీస్ నుంచే నోవాక్ జకోవిచ్ నిష్క్రమించిన విషయం తెలిసిందే. మెల్‌బోర్న్ పార్క్‌లో శుక్రవారం జరిగిన సెమీస్‌లో జకోను 6-1, 6-2, 6-7 (6/8), 6-3తో ఇటాలియన్ స్టార్ జనిక్ సినర్ ఓడించాడు. 22 ఏళ్ల యువ ప్లేయర్ సినర్ ఆట ముందు.. జకో ఏ మాత్రం నిలవలేకపోయాడు. పదిసార్లు చాంపియన్ అయిన జకోవిచ్ సెమీస్‌లోనే వైదొలగడం ఇదే మొదటిసారి. ప్రపంచ టెన్నిస్‌లో 24 గ్రాండ్‌స్లామ్స్‌తో జకోవిచ్ చరిత్ర సృష్టించాడు.

## ఐదో స్థానానికి పడిపోయిన భారత్!

తొలి టెస్టు ఓటమి బాధలో ఉన్న టీమిండియాకు భారీ షాక్ తగిలింది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023-25 పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానానికి పడిపోయింది. గత ఐదు టెస్టుల్లో రెండింటిలో మాత్రమే గెలిచిన టీమిండియా.. 43.33 విజయాల శాతంతో బంగ్లాదేశ్ (50) తర్వాతి స్థానంలో నిలిచింది. తొలి టెస్టుకు ముందు భారత్ రెండో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. అంతకుముందు డబ్ల్యూటీసీ పట్టికలో అగ్రస్థానంలో కూడా నిలిచింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో ఇంగ్లండ్ మూడు విజయాలు సాధించింది. ఇప్పటివరకు 6 టెస్టులు ఆడిన ఇంగ్లీష్ జట్టు రెండు విజయాలు, ఓ డ్రాతో 29.16 విజయాల శాతంతో ఎనిమిదవ స్థానంలో ఉంది. స్వదేశంలో పాకిస్థాన్‌ను వైట్‌వాష్ చేసి, వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ సమం చేసుకున్న ఆస్ట్రేలియా పట్టికలో టాప్ ర్యాంక్‌లో (55 శాతం) ఉంది. దక్షిణాఫ్రికా (50 శాతం) రెండో స్థానంలో, న్యూజిలాండ్ (50 శాతం) మూడో స్థానంలో, బంగ్లాదేశ్ నాలుగో స్థానంలో ఉన్నాయి. ప్రపంచ టెస్టు చాంపియన్‌సిప్‌లో టీమిండియాకు తిరుగులేని రికార్డు ఉంది. వరుసగా రెండుసార్లు ఫైనల్ చేరిన ఘనత భారత్ సొంతం. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌ను ఈసారి కూడా భారత్ బాగానే ఆరంభించింది. దక్షిణాఫ్రికాపై చిరస్మరణీయ విజయం సాధించి డబ్ల్యూటీసీ పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. అయితే సొంతగడ్డపై మాత్రం తేలిపోయింది. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ఇంగ్లండ్ జరిగిన తొలి టెస్టులో అనూహ్యంగా ఓడిపోయింది. పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ ఆడుతాయనే విషయం తెలిసిందే.

## ఐపీఎల్‌కు ముందే డేంజర్ సిగ్నలిచ్చిన నూర్ అహ్మద్

ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఆడుతున్నారు. ఐపీఎల్లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన ఆఫ్ఘనిస్థాన్ స్టార్ స్పిన్నర్ నూర్ అహ్మద్.. ఎస్20లో డర్బన్ సూపర్ జెయింట్స్ తరపున ఆడుతున్నాడు. పార్ల్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా, నూర్ %ు%20లో మొదటి 'ఐదు వికెట్ల' హాల్ సాధించాడు. ఐపీఎల్ 2024కి ముందు గుజరాత్ టైటాన్స్ జట్టుకు నూర్ గుడ్ న్యూస్ అందించాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ మ్యాచ్‌లో, నూర్ పార్ల్ రాయల్స్ కెప్టెన్ డేవిడ్ మిల్లర్, ఆండిలే ఫెహ్లుక్వాయో, జార్న్ ఫోర్టుయిన్, ఒబెడ్ మెక్‌కాయ్, తబ్రేజ్ షమ్సీలను తన బాధితులుగా చేశాడు. నూర్ 3.2 ఓవర్లలో 5 వికెట్లు తీశాడు. ఈ సమయంలో అతను కేవలం 11 పరుగులు మాత్రమే ఇచ్చాడు. నూర్ ఇప్పటివరకు 78 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మ్యాచ్‌లలో 78 ఇన్నింగ్స్‌లలో బౌలింగ్ చేస్తున్నప్పుడు, ఆఫ్ఘన్ స్పిన్నర్ 25.20 సగటుతో 83 వికెట్లు పడగొట్టాడు. అందులో అతని అత్యుత్తమం 5/11గా నిలిచింది. ఈ కాలంలో, నూర్ 'ఐదు వికెట్ల హాల్'తో పాటు, తన పేరు మీద 'నాలుగు వికెట్ల హాల్' కూడా సాధించాడు. అంతర్జాతీయ కెరీర్ గురించి మాట్లాడితే, నూర్ ఆఫ్ఘనిస్తాన్ తరపున %ాణ×, ు%20 ఇంటర్నేషనల్ ఆడుతున్నాడు. ఇప్పటి వరకు 7 వన్డేలు, 4 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడాడు. పార్ల్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో



నూర్ అహ్మద్ జట్టు అంటే డర్బన్ సూపర్ జెయింట్స్ 125 పరుగుల భారీ తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన డర్బన్ సూపర్ జెయింట్స్ జట్టు 7 వికెట్లకు 208 పరుగులు చేసింది. జట్టు తరపున, మాథ్యూ బ్రీట్జ్కే 43 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్ల సాయంతో 78 పరుగుల అతిపెద్ద ఇన్నింగ్స్‌ను ఆడాడు. ఇది కాకుండా హెన్రిచ్ క్లాసెన్ 17 బంతుల్లో 294.12 స్ట్రైక్ రేట్‌తో 50 పరుగులు చేశాడు. ఈ సమయంలో అతను 2 ఫోర్లు, 6 సిక్సర్లు బాదాడు. అనంతరం లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పార్ల్ రాయల్స్ జట్టు 13.2 ఓవర్లలో 83 పరుగులకే ఆలౌటైంది. జట్టులో మిచెల్ వాన్ బ్యూరెన్ (36), జాసన్ రాయ్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మిగతా బ్యాటర్లంతా దారుణంగా ఫ్లాప్ అయ్యారు.

# పరమాత్మ అవతారంగా మోడీ ఫీల్

**తనకుతానుగా విష్ణుమూర్తి 11వ అవతారంగా భావన**

**మోడీ నిరంకుశ తీరుపై మండిపడ్డ మల్లికార్జున ఖర్గే**



డెహ్రాడూన్,జనవరి29 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తనను తాను విష్ణుమూర్తి 11వ అవతారంగా అనుకుంటున్నారని, మతాన్ని రాజకీయాలతో ముడిపెడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిశిత విమర్శలు చేశారు. ప్రజలు ఉదయం లేవగానే దేవీదేవతలు, గురువుల ముఖాలు చూడడానికి బదులు తన ముఖమే చూడాలని ప్రధాని కోరుకుంటున్నారని అన్నారు. డెహ్రూడూన్‌లోని బన్నూ స్కూల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఖర్గే మాట్లాడుతూ, విష్ణుమూర్తి దశావతారులు గురించి అందరికీ తెలుసునని, ప్రధాని ఇప్పుడు విష్ణువు 11వ అవతారంగా అనిపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. మతపరమైన సెంటిమెంట్లను ఉపయోగించుకుని ఈఏడాది లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలనుకుంటున్న బీజేపీని తిప్పికొట్టాలని ప్రజలను కోరారు. మతాన్ని రాజకీయాలతో ముడిపెడితే మంచి, చెడులను నిర్వచనం చాలా కష్టమవుతుందన్నారు. మతాన్ని ఒక ఉపకరణంగా మోదీ, బీజేపీ వాడుకుం టున్నాయి. విద్వేష భావాలను సృష్టిస్తున్నాయి. వారికి దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ఎలాంటి ఆసక్తి లేదు. సొంత అధికారం, ఎజెండాపైనే వారి దృష్టంతా ఉంది' అని ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్, ఆ పార్టీ నేతలను చూసి బీజేపీ భయపడుతోందని, ఆ కారణంగానే వారిని ఆడిపోసుకుంటోందని ఖర్గే అన్నారు. జహహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, సోనియాగాంధీతో పాటు రాహుల్ గాంధీ కూడా బీజేపీ నేతల కలల్లోకి వస్తుండటంతో వారికి నిద్రపట్టడం లేదన్నారు. కాంగ్రెస్ పట్ల ఉన్న భయంతోనే బీజేపీ అధికారంలో ఉన్న అసోంలో కాంగ్రెస్ పర్యటనలను అడ్డుకుంటోందన్నారు. కాంగ్రెస్ ర్యాలీపై రాళ్లు విసిరారని, పోస్టర్లు చించివేసి, జెండాలు తొలగించారని చెప్పారు. కాంగ్రెస్ యాత్రలకు ఒక్క అసోంలో మినహా ఎక్కడా అంతరాయం కలగలేదని, అడ్డుకోలేదని అన్నారు. ఈ తరహా ఎత్తుగడలకు తాము భయపడేది లేదన్నారు. ప్రజల హక్కులు కాపాడేందుకు, ప్రభుత్వ తప్పిదాలపై పోరుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. కాంగ్రెస్ నేతలు దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారని, స్వాతంత్య్రం కోసం, దేశ సమైక్యత కోసం తమ ప్రాణాలను అర్పించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ప్రజలకు ఎప్పుడూ పార్టీ అండగా నిలబడుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి త్యాగాలు, సేవల చరిత్ర ఉందని, ప్రగతి, న్యాయం కోసం ఒక విజన్ అంటూ ఉందని ఖర్గే చెప్పారు. నవభారత నిర్మాణమనే మిషన్ కోసం కాంగ్రెస్ శ్రమిస్తోందన్నారు. రైల్వేలతో సహా వివిధ ప్రభుత్వ విభాగాల్లో 30 లక్షకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం యువతకు తగినన్ని ఉద్యోగావకాశాలు కల్పించడం లేదని ఖర్గే విమర్శించారు. అగ్నివీర్ పథకం ద్వారా నాలుగేళ్లు ఉపాధి కల్పించి, ఆ తర్వాత నుంచి యువతకు ఉపాధి లేకుండా చేస్తుందని ఖర్గే అన్నారు.

## కన్నా ప్రచారంపై రాళ్లదాడి

తీవ్రంగా ఖండించిన ప్రత్తిపాటి

పల్నాడు : మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ప్రచారంపై వైసీపీ రాళ్ల దాడిని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తీవ్రంగా ఖండించారు. వైసీపీ రౌడీలు, గంజాయి స్మగ్లర్ల పార్టీ అని మరోసారి నిరూపితమైందని విమర్శించారు. రౌడీయిజం, భౌతికదాడులతో ప్రతిపక్షాలను భయపెట్టాలని చూస్తున్నారన్నారు. తొండపి ఘటనకు పూర్తి బాధ్యత మంత్రి అంబటి , వైసీపీ నాయకత్వానిదే అని అన్నారు. అంబటి తలకిందులుగా తపస్సు చేసినా సత్తెనపల్లిలో గెలిచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దాడి చేసిన వారిని, దాడి చేయించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. కాగా.. కన్నా ప్రచార కార్యక్రమంపై కొందరు వ్యక్తుల దాడి తీవ్ర కలకలం రేపింది. గత రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని తొండపి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా కన్నా లక్ష్మీనారాయణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. మరీ భవనాలపై నుంచి ఒక్కసారిగా రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో కన్నా లక్ష్మీనారాయణ పీఏ స్వామికి, పలువురు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. దీంతో తొండపిలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.

## రాజమండ్రిలో రా కదలిరా సభ

చంద్రబాబుకు తృటిలో తప్పిన ప్రమాదం

కిందపడబోగా పట్టుకుని కాపాడిని భద్రతాసిబ్బంది

రాజమండ్రి,జనవరి29 : టీడీపీ అధినేత చంద్రబాబుకు తృటిలో ప్రమాదం తప్పింది. రాజమండ్రిలోని కాతేరులో సోమవారం టీడీపీ 'రా.. కదలిరా' సభలో ఆయన కింద పడబోగా భద్రతా సిబ్బంది పట్టుకున్నారు. రాజానగరం టికెట్ ను జనసేనకు కేటాయించడంపై బొడ్డు వెంకటరమణ వర్గీయులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో సభలో గందరగోళం నెలకొంది. స్టేజ్ పై నుంచి చంద్రబాబు దిగుతుండగా.. కార్యకర్తలు దూకుడుగా దిగడంతో ఆయన తూలి కింద పడబోయారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయన్ను పట్టుకున్నారు. కార్యకర్తల తీరుపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయమనం పాటించాలని సూచించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇటీవలే మండపేట, అరకు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అయితే, తమతో ఎలాంటి సంప్రదింపులూ చేయకుండానే ఏకపక్షంగా ఈ ప్రకటన చేశారని జనసేనాని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేటలో టీడీపీ అభ్యర్థిని ప్రకటించడం బాగా లేదన్నారు. తాను రాష్ట్రాన్ని యూనిట్‌గా చూస్తానని.. దీని వల్ల కొన్నిసార్లు ఇబ్బంది కలగవచ్చని అన్నారు. పొత్తు ధర్మం ప్రకారం ఆ స్థానాలు ప్రకటించకుండా ఉండాల్సిందనే అభిప్రాయాన్ని పవన్ వ్యక్తం చేశారు. లోకేష్ సీఎం పదవి గురించి మాట్లాడిన తాను పట్టించుకోలేదన్న జనసేనాని.. చంద్రబాబు నన్ను అడగకుండా రెండు సీట్లు ప్రకటించారు కాబట్టి తాను రెండు సీట్లు ప్రకటిస్తానని అన్నారు. అందుకు అనుగుణంగానే రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ ఉంటుందని స్పష్టం చేశారు. పవన్ ప్రకటనతో రాజానగరం నియోజకవర్గంలో టీడీపీ నేతలు ఆందోళన చెందారు. దీనిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును ఇటీవల కలవగా.. ఆయన చంద్రబాబు సరైన నిర్ణయం తీసుకుంటారని నేతలకు సర్ది చెప్పి పంపించారు. అయితే, సోమవారం కాతేరు 'రా.. కదలిరా' సభలో దీనిపైనే గందరగోళం నెలకొంది. రాజానగరం నియోజకవర్గ టికెట్ ను జనసేనకు కేటాయించడంపై బొడ్డు వెంకటరమణ వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజానగరం అసెంబ్లీ స్థానంలో టీడీపీయే పోటీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రకటన చేయాలని పట్టుబట్టారు.అయితే ఈ విషయమై కార్యకర్తలకు చంద్రబాబు సర్ధిచెప్పే ప్రయత్నం చేశారు. స్టేజీపై ఉన్న కార్యకర్తలకు పార్టీ సీనియర్లు కూడా సర్ధిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే, వెంకటరమణ వర్గీయులు స్టేజీపై ఒక్కసారి తోసుకువచ్చారు. మరోవైపు, జనసేన, టీడీపీ నేతలు పోటాపోటీగా నినాదాలు చేయడంతో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలోనే టీడీపీ కార్యకర్తలు ఒక్కసారి గా దూకుడుగా దిగడంతో చంద్రబాబు పట్టు తప్పి కింద పడబోయారు. భద్రతా సిబ్బంది అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. అటు, కాతేరు సభకు 7 నియోజకవర్గాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ మంత్రులు కేఎస్ జవహర్, పత్తిపాటి పుల్లారావు సభా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## తెలంగాణ ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు

ఎమ్మెల్యేల గెలుపుపై హైకోర్టులో పిటిషన్లు

కెటిఆర్,హరీష్‌రావుల ఎన్నికపైనా వ్యాజ్యాలు

హైదరాబాద్,జనవరి29 : ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయాలు వేడెక్కు తున్నాయి. తెలంగాణలో ఓటమి చెందిన బిఆర్ఎస్ నేతలు కన్నూమిన్నూ గానక మాట్లాడుతున్నారు. మరీ ముఖ్యంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ తీరు దారుణంగా ఉంది. బజారు రాజకీయ నాయకుడి కన్నా దారుణంగా ఆయన ప్రవర్తన ఉంది. ఆయన తన వైఖరి మార్చుకోకుంటే ప్రజలు మరోమారు ఎంపి ఎన్నికల్లోనూ గుణపాఠం చెప్పక తప్పదు. ఇకపోతే గత నవంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గెలిచిన 24 మంది అభ్యర్థుల ఎన్నికను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వారి ఎన్నిక చెల్లదని, శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసి.. తమను ఎమ్మెల్యేలుగా ప్రకటించాలని మరికొందరు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఎన్నికను సైతం సవాల్ చేశారు. అయితే, నిబంధనల ప్రకారం ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లోపే ఆ ఎన్నికను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పిటిషన్లన్నీ ఇంకా స్క్రూట్నీ దశలోనే ఉన్నాయి. అన్నీ సక్రమంగా ఉంటే త్వరలోనే హైకోర్టు రిజిస్ట్రీ వీటికి నెంబర్లు కేటాయించనుంది. 2023 శాసనసభ ఎన్నికల్లో మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ తరఫున సిరిసిల్ల నుంచి పోటీ చేయగా.. కాంగ్రెస్ తరఫున మహేందర్ రెడ్డి పోటీ చేశారు. కేటీఆర్ కు 89,224 ఓట్లు రాగా, మహేందర్ రెడ్డికి 59,557 ఓట్లు వచ్చాయి. అయితే, కేటీఆర్ తన ఎన్నికల అఫిడవిట్ లో పూర్తి సమాచారం ఇవ్వలేదని.. ఆయన ఎన్నిక చెల్లదని మహేందర్ రెడ్డి పిటిషన్ లో పేర్కొన్నారు. తన కుమారుడు హిమాన్షు పేరుతో ఉన్న 32 ఎకరాల భూమి వివరాలు వెల్లడించలేదని ఫిర్యాదు చేశారు. ఈ భూమి సేల్ డీడ్ ను సైతం మహేందర్ రెడ్డి సమర్పించారు. అలాగే, అమెరికా వర్సిటీలో చదువుతున్న కుమారుడికి కేటీఆరే ఫీజు కడుతున్నా డిపెండెంట్ గా చూపలేదని అన్నారు. అలాగే, వీవీ ప్యాట్లను మరోసారి లెక్కించేలా ఎన్నికల కమిషన్ కు ఆదేశాలివ్వాలని కోరారు. కేటీఆర్ ఎన్నికను రద్దు చేసి తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ తన కొడుకు ఆస్తులు చూపలేదని మరో పిటిషన్ సైతం దాఖలైంది. అటు, సిద్ధిపేటలో బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కాంగ్రెస్ తరఫున హరికృష్ణ, బీఎస్పీ నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. హరీశ్ రావుకు 1,05,514 ఓట్లు రాగా హరికృష్ణకు 23,206 ఓట్లు, చక్రధర్ కు 16,610 ఓట్లు వచ్చాయి. అయితే, హరీశ్ రావు అఫిడవిట్ లో పూర్తి సమాచారం వెల్లడించకుండా దాచిపెట్టారని, తన కుమారుడి వివరాలు పేర్కొనలేదని చక్రధర్ హైకోర్టును ఆశ్రయించారు. 2018లో 36 కేసులుండగా, 2023లో 3 కేసులు ఉన్నట్లుగా అఫిడవిట్ లో పేర్కొన్నారని.. మిగిలిన కేసుల గురించి ప్రస్తావించలేదని అన్నారు. హరీశ్ రావు ఎన్నికను రద్దు చేయాలని కోరారు. హుజూరాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలిచిన పాడి కౌశిక్ రెడ్డి విజయాన్ని సవాల్ చేస్తూ బీజేపీ నేత ఈటల రాజేందర్ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే, జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విజయాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత అజారుద్దీన్, కూకట్‌పల్లి నుంచి మాధవరం కృష్ణారావు ఎన్నికపై కాంగ్రెస్ నేత బండి రమేశ్ పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే, ఆసిఫాబాద్, గద్వాల, పటాన్ చెరు, కామారెడ్డి, షాద్ నగర్, ఆదిలాబాద్, మల్కాజిగిరి, కొత్తగూడెం తదితర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతల గెలుపును సవాల్ చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్ లో అవకతవకలు ఉన్నాయని, సరైన వివరాలు వెల్లడించలేదని ఆరోపించారు. ఈవీఎం, వీవీ ప్యాట్ లను మళ్లీ లెక్కించాలని కోరారు. మరోవైపు, నాగర్ కర్నూల్ నుంచి బీఆర్ఎస్ తరఫున బరిలో నిలిచిన మర్రి జనార్ధన్ రెడ్డి ఎన్నికల కమిషన్ తన విధులు సక్రమంగా నిర్వహించలేదని పిటిషన్ వేశారు. అయితే, 2018 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లే ఇప్పటికీ హైకోర్టులో పెండింగ్ లో ఉన్నాయి. అప్పటి ఎన్నికలకు సంబంధించి కొత్తగూడెం, గద్వాల ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తూ ఉన్నత న్యాయస్థానం తీర్పులు ఇచ్చింది. అయితే, ఈ ఆదేశాలపై సదరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు.

## నితీశ్ ఎన్డీఏలో చేరడం సరికాదు

ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ స్పందన

న్యూఢిల్లీ,జనవరి29 : బీహార్‌లో మహాకూటమి విచ్ఛిన్నంపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఘాటుగా స్పందించారు. నితీష్ కుమార్ ఎన్డీయేలో చేరి ఉండాల్సిందని కాదని కేజ్రీవాల్ అన్నారు. ఈ క్రమంలో నితీష్ బీజేపీలో చేరి తప్పు చేశారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. నితీశ్ బీజేపీలో చేరితే ఎన్డీయేకు నష్టం వాటిల్లుతుందని..అదే క్రమంలో భారత కూటమి లాభపడుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చండీగఢ్ మేయర్ ఎన్నికలు రేపు జరగనున్నాయని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. అక్కడి నుంచి భారత కూటమి తొలి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడ ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ కలిసి మేయర్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. మరోవైపు ఢిల్లీ పవర్ మేనేజ్‌మెంట్ మొత్తం దేశంలోనే అత్యుత్తమంగా ఉందని కేజ్రీవాల్ అన్నారు. ఇప్పుడు సౌరశక్తిని మరింత మెరుగ్గా వినియోగించుకునేందుకు ఢిల్లీ సిద్ధమైందన్నారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ సోలార్ పాలసీ 2024ని ప్రకటించారు. దీని పెద్ద స్పెషాలిటీ ఏంటంటే.. దీన్ని వినియోగించే గృహ వినియోగదారుల కరెంటు బిల్లు జీరోగా మారి నెలకు రూ.700 నుంచి 900 వరకు సంపాదిస్తారు. వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారుల విద్యుత్ బిల్లులు సగానికి తగ్గనున్నాయి. అయితే 2024 సంవత్సరపు పాలసీ ప్రకారం తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్స్‌ను అమర్చుకునే వారందరికీ విద్యుత్ బిల్లు ఉచితంగా చేయబడుతుంది. ఎంత కరెంటు వాడినా ఫర్వాలేదు. దేశంలోనే ఢిల్లీలో ద్రవ్యోల్బణం అత్యల్పంగా ఉంది. ఈ విధానంతో ద్రవ్యోల్బణం రేటు మరింత తగ్గుతుంది. ఇన్వెస్ట్ చేసిన వారికి నాలుగేళ్లలో మొత్తం డబ్బు రికవరీ అవుతుందని ప్రకటించారు

# వైసిపి పని ఖాళీ అయ్యింది

**పోటీ చేయాలంటేనే జంకుతున్న ఎమ్మెల్యేలు**

**వచ్చే ఎన్నికల్లో టిడిపి-జనసేన విజయం ఖాయం**

**రాజమండ్రి రా..కదలిరా సభలో చంద్రబాబు**

రాజమండ్రి,జనవరి29(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఎన్నికలు అయిపోగానే వైసీపీ ఖాళీ అవుతుందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. వైసీపీలో తిరుగుబాటు మొదలైందని.. ఆ పార్టీ నుంచి పోటీ చేయాలంటేనే ఎమ్మెల్యేలంతా భయపడతున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఐదేళ్లలో ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం ఏనాడూ శ్రద్ధ పెట్టలేదని విమర్శించారు. వైసీపీని గద్దె దించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని.. త్వరలోనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ - జనసేన గెలుపును ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు.రాజమండ్రిలో సోమవారం నిర్వహించిన 'రా.. కదలిరా' సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వైసీపీ నేతలు నడిరోడ్డుపైనే మహిళలను వేధిస్తున్నారని.. వారి జోలికి వస్తే వైసీపీకి అదే చివరి రోజు అవుతుందని చంద్రబాబు హెచ్చరించారు. ప్రజల కోసం వైసీపీ నేతల మాటలు భరిస్తున్నా మని.. అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా చెల్లిస్తామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సైకో పాలన నడుస్తోందని.. ఆ ఉన్మాది పాలనలో అందరం బాధితులమేనని చెప్పారు. సీఎం జగన్ అన్ని వర్గాలను మోసం చేశారని మండిపడ్డారు. 'ఉద్యోగం అడిగితే గంజాయి ఇస్తున్నారు. ఆకు కూరలు దొరకడం లేదు కానీ రాష్ట్రమంతా గంజాయి దొరుకుతుంది. దానికి బానిసల్ని చేసి యువత భవిష్యత్ ను నాశనం చేస్తున్నారు.' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ చెప్పేవన్నీ నీతులని.. చేసేవన్నీ సైకో పనులని చంద్రబాబు దుయ్యబట్టారు. దళితులెవరైనా ప్రశ్నిస్తే వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నాలుగున్నరేళ్లలో 6 వేల దాడులు చేశారని.. 188 మందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. 'మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్ ను పిచ్చోణ్ని చేసి చంపారు. కోడికత్తి శ్రీని ఐదేళ్ల నుంచి జైలులో ఉన్నారు. సామాజిక న్యాయమంటే ఇదేనా.?' అని ప్రశ్నించారు. పన్నుల బాదుడుతో జగన్ పేదల రక్తం తాగుతున్నారని.. ప్రభుత్వంలో 9 సార్లు ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. ఎన్నికల్లో వైసీపీని భూ స్థాపితం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అటు, రాజమండ్రి కాతేరు 'రా.. కదలిరా' సభలో చంద్రబాబుకు ప్రమాదం తప్పింది. ఆయన వేదికపై నుంచి కింద పడబోగా వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయన్ను పట్టుకున్నారు. రాజానగరం టికెట్ ను జనసేనకు కేటాయించడంపై బొడ్డు వెంకటరమణ వర్గీయులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో సభలో గందరగోళం నెలకొంది. స్టేజ్ పై నుంచి చంద్రబాబు దిగుతుండగా.. కార్యకర్తలు దూకుడుగా దిగడంతో ఆయన తూలి కింద పడబోయారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయన్ను పట్టుకున్నారు. కార్యకర్తల తీరుపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయమనం పాటించాలని సూచించారు. రాజానగరం అసెంబ్లీ స్థానంలో టీడీపీయే పోటీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రకటన చేయాలని పట్టుబట్టారు. అయితే, ఈ విషయమై కార్యకర్తలకు చంద్రబాబు సర్ధిచెప్పే ప్రయత్నం చేశారు. వీరికి పార్టీ సీనియర్లు కూడా సర్ధిచెప్పేందుకు యత్నించారు. వెంకటరమణ వర్గీయులు స్టేజీపై ఒక్కసారిగా తోసుకువచ్చారు. ఈ క్రమంలోనే టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా దూకుడుగా దిగడంతో చంద్రబాబు పట్టు తప్పి కింద పడబోయారు.

## జడ్పీ ఛైర్మన్‌పై దాడి చేస్తారా ?

**భువనగిరి ఘటనపై బిఆర్ఎస్ నేతల ఖండన**

**మంత్రి కోమటిరెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్**

యాదాద్రి-భువనగిరి,జనవరి29 : ప్రజాస్వామ్య వాదులంతా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పోకడలను తీవ్రంగా ప్రతిఘటించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సోమవారం నాడు జిల్లా పరిషత్ సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి అవమానించడాన్ని హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ఖండించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో సాటి ప్రజాప్రతినిధులను అవమానపరుస్తున్న మంత్రుల వైఖరి గర్హనీయమని హరీష్ రావు అన్నారు. యాదాద్రి భువనగిరి జెడ్పీచైర్మన్ సందీప్ రెడ్డిపై అధికారిక కార్యక్రమంలో అకారణంగా దుర్భాష లాడటం కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని చెప్పారు. మంత్రి తాను మాట్లాడింది చాలదన్నట్టు.. పోలీసులకు హుకుం జారీ చేసి బలవంతంగా సందీప్ రెడ్డిని బయటకు పంపించారని మండిపడ్డారు. కోమటి రెడ్డికి ప్రజాస్వామ్యం మీద ఏ మాత్రం నమ్మకమున్నా జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్ రెడ్డికి తక్షణమే క్షమాపణ చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అధికారిక కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ సందీప్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అతని అనుచరుల దాడిని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సోమవారం నాడు బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి కాగానే కోమటిరెడ్డికి అహంకారం పెరిగిందని... ఆటవికుడిగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. వాళ్ళ నాన్న ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయన పేరు చెప్పి సిగరెట్లు అందించుకుంటూ బతికావని.. ఆ విషయం మరిచిపోయవా అని ప్రశ్నించారు. చరిత్రలు తీద్దామా....వ్యక్తిగత విమర్శలు వొద్దని ఇన్ని రోజులు ఊరుకున్నామని హెచ్చరించారు. కిరణ్ కుమార్ రెడ్డి గెంటేస్తున్నాడని తెలిసి రాజీనామా చేసి పెద్ద త్యాగం చేశా అని దొంగ డ్రామా చేశావన్నారు. రేవంత్ కాళ్లు పట్టుకుని మంత్రి పదవి తెచ్చుకున్నావని నీ తమ్ముడే చెబుతున్నాడని విమర్శించారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా చేసినా జిల్లాను ఏం అభివృద్ధి చేశావో చెప్పాలని ప్రశ్నించారు. దౌర్జన్యాలు చేసినోళ్లు కాల గర్భంలో కలిసిపోయారన్నారు. సందీప్ ఒక్క అక్షరం కూడా తప్పు మాట్లాడలేదన్నారు. అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కి విజ్ఞప్తి చేశామన్నారు. పథకం ప్రకారమే బీఆర్ఎస్ నాయకులపై దాడి చేస్తున్నారని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తిరుమల శ్రీవారి చెంత మంగళసూత్రాలకు పూజలు

తిరుమల,జనవరి29 : తిరుమల తిరుపతి దేవస్థానం సంచలన నిర్ణయం తీసుకుంది. హిందువుల ఆరాధ్యదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మహిళలకు మంగళసూత్రాలను అందజేయనున్నారు. వారు పవిత్రంగా భావించే తాళిబొట్లను (మంగళ సూత్రం) తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి అందించబోతున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్ష్యులు భూమన కరుణాకర రెడ్డి నేతృత్వంలో సోమవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి భక్తులు సమర్పించిన బంగారంతో వివిధ ఆచారాలు అనుసరించి ధరించే మంగళ సూత్రాలు తయారు చేయించాలని ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈ రకంగా తయారు చేసిన తాళి బొట్లను శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పాదాల చెంత ఉంచి పూజలు చేసి లాభ నష్టాలు లేని ధర నిర్ణయించి విక్రయిస్తారు. ఇప్పటికే వివాహం అయిన వారు, వివాహం చేసుకోబోయే వధువులు ఈ తాళిబొట్లను ధరించడం వల్ల దీర్ఘ సుమంగళిగా ఉంటారని భక్తుల విశ్వాసం. సనాతన హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా టీటీడీ ఈ మంగళ సూత్రాలు తయారు చేయబోతోంది. నాలుగైదు డిజైన్లలో తయారు చేసే ఈ మంగళ సూత్రాలు 5 గ్రాములు, 10 గ్రాముల బరువుతో ఉంటాయి. భూమన కరుణాకర రెడ్డి గతంలో టీటీడీ చైర్మన్ గా ఉన్న సమయంలో నిర్వహించిన కల్యాణ మస్తు ద్వారా సుమారు 32 వేల మంది వధువులకు స్వామివారి ఆశీస్సులు అందించిన మంగళ సూత్రాలు ఉచితంగా అందించారు. ఈ జంటలన్నీ స్వామివారి ఆశీస్సులతో జీవిస్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మహిళలకు స్వామివారి ఆశీస్సులు అందిన మంగళ సూత్రాలు అందించాలనే ఆలోచన చేసి కార్య రూపంలోకి తెచ్చారని టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.

## కడప పర్యనటలో సునీతతో షర్మిల భేటీ

కడప,జనవరి29 : ఎన్నికల టైం దగ్గర పడుతున్న కొద్దీ ఏపీ రాజకీయాల్లో రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైసీపీ, టీడీపీ, జనసేన మధ్య జరుగుతున్న ÷ట్‌లో షర్మిల ఎంట్రీతో కాంగ్రెస్ కూడా చేరింది. మొన్నటి వరకు తెలంగాణ రాజకీయాలకే పరిమితమైన షర్మిల ఏపీలోకి వచ్చీరాగానే స్పీడ్ పెంచేశారు. పీసీసీ పగ్గాలు తీసుకున్న ఆమె... అన్నపై విమర్శల బాణాలు ఎక్కుపెడుతున్నారు. రోజుకో జిల్లాలో పర్యటిస్తూ రోజుకో షాక్ ఇస్తున్నారు. పీసీసీ చీఫ్ షర్మిల బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి రోజుకో కొత్త విషయంతో జగన్‌ను ప్రశ్నిస్తున్నారు. తనను ఒంటరిని చేసిన విషయం, ఇంటి తగాదాలు అన్నింటిపై సీరియస్‌గా రియాక్ట్ అవుతున్నారు. ఇప్పుడు ఆమె మరో అడుగు ముందుక వేశారు. షర్మిల బాబాయి, వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీతతో సమావేశమయ్యారు. కడప కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి భేటీకి వెళ్లిన షర్మిల... ఇడుపుల పాయలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధికి నివాళి అర్పించారు. అనంతరం సునీతతో సమావేశమయ్యారు. షర్మిల ఇప్పటి వరకు చాలా అంశాలను ప్రస్తావిస్తూ వస్తున్నారు. కుటుంబ వ్యవహారాలు, పార్టీ అంశాలు, ప్రజా సమస్యలు ఇలా ప్రతి ఒక్కదాంట్లో జగన్‌ను సూటిగానే ప్రశ్నిస్తున్నారు. జగన్, అవినాష్ రెడ్డిపై ఉన్న ప్రధాన ఆరోపణ అయిన వైఎస్ వివేక హత్యపై ఇంత వరకు స్పందించలేదు. ఆ అంశాన్ని కూడ ఇంత వరకు టచ్ చేసింది లేదు. ఇప్పటి వరకు ఎందుకు ఆ విషయంలో రియాక్ట్ కాలేదన్న ఓ వైపు జరుగుతున్న టైంలో సునీతతో షర్మిల భేటీ ప్రాధాన్యత సంతరిచుకుంది. సునీత, షర్మిల భేటీలో ఏ అంశాలు ప్రస్తావనకు వచ్చాయో తెలియదు కానీ దీనిపై రకరకాల ఊహానాలు జరుగుతున్నాయి. సునీత కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం నడుస్తోంది. ఆమెను కడప ఎంపీగా కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో నిలపాలనే ఆలోచనలో షర్మిల ఇతర నేతలు ఉన్నట్టు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దీనిపై ఇరు వర్గాల నుంచి ఎలాంటి స్పందన మాత్రం లేదు. ఈ భేటీ తర్వాత ఎవరూ మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

## ఊబకాయం కూడా రొమ్ము క్యాన్సర్‌కు కారణం కావచ్చు.. ఇవి ప్రారంభ లక్షణాలు!



భారతదేశంలో ప్రతి సంవత్సరం రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పుడు యువతులు కూడా ఈ క్యాన్సర్ బారిన పడుతున్నారు. రొమ్ము క్యాన్సర్ చాలా కేసులు అధునాతన దశలలో సంభవిస్తాయి.బ్రెస్ట్ క్యాన్సర్ ఎందుకు వస్తుంది? యువతులు ఎందుకు దాని బారిన పడుతున్నారు? ఈ క్యాన్సర్ గురించి వైద్యుల ద్వారా వివరంగా తెలుసుకుందాం.ఒకప్పుడు 50 ఏళ్లు పైబడిన మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు నమోదయ్యేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు రొమ్ము క్యాన్సర్ కేసులు కూడా 25 నుండి 35 సంవత్సరాల వయస్సులో పెరుగుతున్నాయి. చాలా సందర్భాలలో ఈ క్యాన్సర్ కేసులు అధునాతనమైన అంటే చివరి దశలో కనిపిస్తున్నాయి. చెడు జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన కారణాల వల్ల మహిళలు బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. అయితే చాలా మంది మహిళల్లో ఈ క్యాన్సర్ గురించి ఇప్పటికీ అవగాహన లేకపోవడం ఆందోళనకరం. దాని లక్షణాల గురించి ఎటువంటి సమాచారం లేదు.యువతులలో రొమ్ము క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి.సీకే బిర్లా హాస్పిటల్‌లో సర్జికల్ ఆంకాలజీ డైరెక్టర్ డాక్టర్ మన్‌దీప్ సింగ్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఇటీవలి సంవత్సరాలలో ఆంకాలజీ రంగంలో ఆందోళనకరమైన, దిగ్భ్రాంతికరమైన ధోరణి కనిపించింది. ఇప్పుడు యువతులలో బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. యువతులలో రొమ్ము క్యాన్సర్ పెరగడానికి ప్రధాన కారణాలలో ఒకటి జీవనశైలి మార్పులు. నేటి ఆధునిక జీవనశైలి, కాలుష్యం, వ్యాయామం లేకపోవడం, తప్పుడు ఆహారపు అలవాట్లు ఈ క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు.

**ఊబకాయం పెరగడం కూడా దీనికి కారణం**

జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ వల్ల ఊబకాయం పెరుగుతోందని డాక్టర్ మల్హోత్రా చెప్పారు. అనారోగ్యకరమైన ఆహారాలు ఊబకాయంతో ముడిపడి ఉన్నాయి. రొమ్ము క్యాన్సర్‌కు ప్రమాద కారకం. అదనంగా సాధారణ గృహోపకరణాలలో కనిపించే రసాయనాలకు గురికావడం హార్మోన్ల క్యాన్సర్‌ల అభివృద్ధిలో పాత్ర పోషిస్తుంది. ఇందులో కొన్ని రకాల రొమ్ము క్యాన్సర్‌లు ఉన్నాయి. ఈ రసాయనాలు క్యాన్సర్‌కు కారణమవుతాయి.

**సంతానం కలగడంలో జాప్యం**

ప్రస్తుతం పిల్లల పుట్టుకను ఆలస్యం చేసే ధోరణి పెరిగింది. ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. బిడ్డలను ఆలస్యంగా ప్లాన్ చేయడం వల్ల తల్లిపాలు ఇచ్చే వ్యవధి కూడా తగ్గుతుంది. ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. ఇవే కాకుండా యువతులలో బ్రెస్ట్ క్యాన్సర్ పెరగడానికి కారణం కూడా జన్యుపరంగానే. తల్లికి ఈ క్యాన్సర్ కుటుంబ చరిత్ర ఉన్న స్త్రీలు 20 సంవత్సరాల వయస్సు తర్వాత వారి స్క్రీనింగ్ ప్రారంభించాలి.

ఇవి ప్రారంభ లక్షణాలు కావచ్చు
ఛాతీలో ముద్దలాగా ఏర్పడటం
ఛాతీపై మొటిమలు ఏర్పడటం
మొత్తం ఛాతీ లేదా దానిలోని ఏదైనా భాగం వాపు

## ప్రతి రోజు ఉదయం ఇలా చేస్తే
# అనారోగ్య సమస్యలు దూరం!



డిసెంబరు, జనవరిలో చల్లటి వాతావరణం తర్వాత ఇప్పుడు ఎండలు మండుతున్నాయి. ఇప్పుడు సూర్యభగవానుడు దర్శనమిస్తాడు. చలికాలంలో సూర్యరశ్మిని చూస్తే వారి ముఖాల్లో ఆనందం కనిపిస్తుంది.శీతాకాలంలో సూర్యరశ్మి లేకపోవడం వల్ల శరీరంలో విటమిన్ డి లోపం ఏర్పడుతుంది. ఇది కీళ్ల నొప్పులు, శరీర నొప్పి, నిరాశ, చిరాకు, బలహీనమైన రోగనిరోధక శక్తిని కలిగిస్తుంది. ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు అరగంట మాత్రమే ఎండలో కూర్చుంటారు. ఇది విటమిన్ డిని అందిస్తుంది. మీ శరీరంలోని అన్ని నొప్పులు, వ్యాధులు మాయమవుతాయి. విటమిన్ డి రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. అందుకే శరీరం ఏదైనా ఇన్ఫెక్షన్ తో పోరాడేందుకు సిద్ధంగా ఉంటుంది.

**ఎండలో అరగంట గడపండి**

విటమిన్ డి ఉత్తమ మూలం సూర్యుడు. ప్రతిరోజూ ఉదయం దాదాపు అరగంట పాటు ఎండలో కూర్చోవాలి. దీని వల్ల శరీరానికి విటమిన్ డి అందుతుంది. విటమిన్ డి సూర్యకాంతి నుండి ఉదయం 11 లేదా 11.30 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. సూర్యకాంతి బలంగా మారడంతో హానికరమైన కిరణాలు శరీరానికి మంచి కంటే ఎక్కువ హాని చేయడం ప్రారంభిస్తాయి. అందుకే కేవలం 11 గంటలలోపు ఉన్న సూర్యరశ్మి మాత్రమే విటమిన్ డికి మంచిదని భావిస్తారు.


**కనీస దుస్తులు ధరించండి**

సూర్యకాంతి నుండి విటమిన్ డి పొందడానికి తక్కువ దుస్తులు ధరించి ఎండలో కూర్చోండి. మీ చేతులు, పాదాలు, శరీరం చర్మాన్ని వీలైనంత వరకు ఎండలో ఉంచాలి. అయితే ఇప్పుడు ఎండలో బట్టలు లేకుండా కూర్చోలేని పరిస్థితి ఉంటుంది. అటువంటి సందర్భాలలో మీరు కేవలం పొరలు మాదిరిగా ఉన్న దుస్తులను వేసుకోవడం తగ్గించుకోండి. అలాగే చేతులు, కాళ్లు ఎప్పుడు బయట ఉండే దుస్తులను వేసుకోకపోవడం మంచిది.

**విటమిన్ డి వ్యాధులను దూరం చేస్తుంది**

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి విటమిన్ డి చాలా ముఖ్యం. విటమిన్ డి ఎముకలను బలపరుస్తుంది. విటమిన్ డి లోపం పిల్లలు, వృద్ధులలో సంభవిస్తుంది. ఎముకల సరైన అభివృద్ధి, పటిష్టత కోసం పెరుగుతున్న పిల్లలను ప్రతిరోజూ సూర్యరశ్మికి గురిచేయాలి. ఇది పిల్లల రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. వృద్ధులు ప్రతిరోజూ విటమిన్ డి తీసుకోవడం చాలా ముఖ్యం. దీనివల్ల ఎముకలు విరగడం, శరీర నొప్పులు, వెన్నునొప్పి తదితర రుగ్మతలు తగ్గుతాయి.

## నారింజ మంచిదని తెగ తింటున్నారా.? వీరికి చాలా డేంజర్



చలికాలంలో ఎక్కువగా కనిపించే పండల్లో నారింజ ముందు వరుసలో ఉంటుంది. నారింజలో ఉండే ఎన్నో ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా ఇందులోని విటమిన్ సీ శరీరానికి ఎంతగానో మేలు చేస్తుంది.అందుకే చలికాలంలో కచ్చితంగా నారింజను తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే ఇదంతా బాగానే ఉన్నా, కొందరు మాత్రం నారింజకు వీలైనంత దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు నారింజ పండును ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదని చెబుతున్నారు. ఇంతకీ నారింజ పండును ఏ వ్యక్తులు తినకుండా ఉండాలో ఇప్పుడు తెలుసుకుందాం.. నిత్యం జలుబు, దగ్గుతో బాధపడే వారు నారింజకు దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. నారింజలో చలువ చేసే గుణాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి జలుబు, దగ్గు ఉన్న వారికి వీటికి దూరంగా ఉండాలి. ఒకవేళ తీసుకుంటే జలుబు, దగ్గు మరింత ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. యాసిడిటీతో బాధపడే వారు ఆరెంజ్‌ను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు. దీనికి కారణం నారింజలో ఆమ్లం కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి యాసిడిటీతో బాధపడే వారు ఆరెంజ్ తీసుకోగానే కడుపులో యాసిడ్ స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతాయి. ఇది కడుపునొప్పికి కారణమవుతుంది.లి పంటి సమస్యలతో బాధపడే వారు కూడా ఆరెంజ్‌ను తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా దంతాలు బలహీనంగా ఉన్న వ్యక్తులు ఆరెంజ్‌కు దూరంగా ఉండాలి. పంటిపై ఉండే ఎనామిల్‌తో ఉన్న కాల్షియంతో కలిసి బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తుంది. దీంతో పంటి ఆరోగ్యం దెబ్బతింటుంది. కిడ్నీలో రాళ్ల సమస్యలు ఉన్న వారు కూడా ఆరెంజ్‌కు దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ఆరెంజ్ వల్ల కిడ్నీలో రాళ్లు ఉన్న వారికి నొప్పి ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. ఇక కొందరిలో ఆరెంజ్ వల్ల గుండెమంట సమస్య కూడా రావొచ్చు.

## అవని

### మీలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..
## ప్రోటీన్ లోపం ఉన్నట్లే!




శరీరానికి అన్ని రకాల పోషకాలు ఖచ్చితంగా కావాలి. లేకుంటే అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుంది. అన్నీ అందితేనే శరీరం హెల్దీగా ఉంటుంది. విటమిన్లు, మినరల్స్, ఖనిజాలు ఇలా ఏవి తక్కువైనా దాని ప్రభావం శరీరంపై పడుతుంది.ఫలితంగా వివిధ రోగాలతో ఇబ్బంది పడాల్సి ఉంటుంది. అలాగని మరీ ఎక్కువైనా ప్రమాదమే. కాబట్టి అన్నీ సమపాలల్లో ఉండాలి. ఈ క్రమంలోనే చాలా మంది ప్రోటీన్ లోపంతో బాధ పడుతూ ఉంటారు. కొన్ని అనారోగ్యకరమైన ఆహారాలు తినడం వల్ల ప్రోటీన్ లోపం అనేది ఏర్పడుతుంది. దీనికి కారణంగా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి అంటే ఇమ్యూనిటీ లెవల్స్ తగ్గిపోతాయి. దీంతో తరచుగా ఇన్ ఫెక్షన్లు, పలు రోగాల బారిన పడాల్సి వస్తుంది. మరి కొందరిలో అయితే జుట్టు రాలడంతో పాటు చర్మ సమస్యలు కూడా వస్తాయి. ఒక్కోసారి శరీరంలో ప్రోటీన్ లోపం తక్కువైనా ఎలాంటి లక్షణాలు కనిపించవు. మరి అవేంటి? ప్రోటీన్ తక్కువైతే ఎలాంటి రిఫ్లెక్షన్స్ వస్తాయి ఇప్పుడు తెలుసుకుందాం.

**కండరాల బలహీనత:**

ప్రస్తుతం చాలా మంది ఎదుర్కొనే సమస్యల్లో ఇది కూడా ఒకటి. కండరాలు బలహీన పడి.. ఏ పనీ చేయలేకపోతున్నారు. ప్రోటీన్ లోపం కారణంగా కండరాల్లో బలం తక్కువగా ఉంటుంది. దీని వల్ల శరీర ఆకృతి కూడా కోల్పోయే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. మీకు కండరాల సమస్యలు, నొప్పులు ఉన్నట్లయితే ఒక్కసారి ప్రోటీన్ టెస్ట్ చేయించుకోవడం ఉత్తమం.

**జుట్టు విపరీతంగా రాలిపోవడం:**

శరీరంలో ప్రోటీన్ తక్కువ అయినప్పుడు జుట్టు విపరీతంగా రాలిపోతుంది. కొంత మందిలో తెల్ల జుట్టు కూడా వస్తుంది. జుట్టు జీవం కోల్పోయి.. నిర్జీవంగా మారి పోతుంది. కాబట్టి ఇలాంటి సమస్యలు ఉన్నవారు తప్పకుండా ప్రోటీన్స్ కలిగిన ఆహారం తీసుకోవాలి.

**రోగ నిరోధక శక్తి తగ్గి పోతుంది:**

శరీరంలో ప్రోటీన్ శాతం తక్కువగా ఉన్నట్లయితే ఇమ్యూనిటీ పవర్ అనేది తగ్గిపోతుంది. దీంతో వ్యాధులతో పోరాడే బలం తగ్గి పోతుంది. ఒక్కసారిగా అనారోగ్య సమస్యలు ఎటాక్ చేస్తాయి.

## మార్కెట్

### భారీ లాభాల్లోకి సూచీలు..! సెన్సెక్స్ 1,240 పాయింట్లు జంప్..!



దేశీయ బెంచ్ మార్క్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో పాటు బ్యాంకింగ్ రంగంలో కొనుగోళ్ల మద్దతు మార్కెట్లు లాభాల్లో పయనించాయి. ఇవాళ ఉదయం సెన్సెక్స్ 70,968.10 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది.

**భారీ లాభాల్లోకి సూచీలు..! సెన్సెక్స్ 1,240 పాయింట్లు జంప్..!**

దేశీయ బెంచ్ మార్క్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో పాటు బ్యాంకింగ్ రంగంలో కొనుగోళ్ల మద్దతు మార్కెట్లు లాభాల్లో పయనించాయి. ఇవాళ ఉదయం సెన్సెక్స్ 70,968.10 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. పొద్దంతా లాభాల్లో కొనసాగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 72,010.22 పాయింట్ల గరిష్ఠానికి చేరుకుంది. చివరకు 1,240.90 పాయింట్లు లాభంతో 71,941.57 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 385 పాయింట్లు పెరిగి 21,737.60 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,963 షేర్లు పురోగమించగా.. 1,393 షేర్లు పతనమయ్యాయి. మరో 95 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో ఓఎన్‌జీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా, అదానీ పోర్ట్స్ అత్యధికంగా లాభపడ్డాయి. సిప్లా, ఐటీసీ, ఎల్‌టీఐఎండ్‌ట్రీ, బజాజ్ ఆటో, ఇన్ఫోసిస్ నష్టపోయాయి. రంగాల్లో చమురు, గ్యాస్ ఇండెక్స్ 5శాతం, పవర్ ఇండెక్స్ 3 శాతం, క్యాపిటల్ గూడ్స్ ఇండెక్స్ 2శాతం చొప్పున పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.7 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఒక శాతం పెరిగాయి.

## బడ్జెట్‌లో ప్రభుత్వం పీఎం కిసాన్ వాయిదాలు పెంచనుందా?

పీఎం కిసాన్ యోజన కింద కోట్లాది మంది రైతులకు బడ్జెట్ శుభవార్త చెప్పనున్నట్లు సమాచారం. ఎన్నికలకు ముందు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ యోజన లబ్ధిదారులైన రైతులకు పెద్ద బహుమతిని ఇవ్వవచ్చు.2024 ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన మొత్తాన్ని పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించవచ్చు.

**పీఎం కిసాన్ వాయిదాలు**

ప్రస్తుతం ఈ పథకం కింద రైతులకు రూ.6000 సహాయం అందజేయగా, దానిని రూ.8000 లేదా రూ.9000కు పెంచవచ్చని తెలుస్తోంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన అనేది కేంద్ర ప్రభుత్వ ప్రధాన పథకాలలో ఒకటి. ఇందులో రైతులకు ప్రతి 4 నెలలకు 3 వాయిదాల చొప్పున 2000 రూపాయలు ఇస్తున్నారు. 11500 రూపాయల నుంచి 3000 రూపాయలకు పెంచవచ్చు

### డ్రాగన్‌'కు షాక్..
## మూసేయాలని ఎవర్ గ్రాండేకు హాంకాంగ్ కోర్టు ఆదేశం




చైనా రియల్ ఎస్టేట్ సంస్థ 'ఎవర్ గ్రాండే కు హాంకాంగ్ కోర్టు గట్టి షాక్ ఇచ్చింది. పునర్వ్యవస్థీకరణ ప్రణాళికల ప్రకారం రుణ దాతలకు వాయిదాల చెల్లింపులో విఫలమైనందున సంస్థను లిక్విడేట్ చేయాలని సోమవారం ఆదేశించింది. డ్రాగన్'కు షాక్.. మూసేయాలని ఎవర్ గ్రాండేకు హాంకాంగ్ కోర్టు ఆదేశం చైనా రియల్ ఎస్టేట్ సంస్థ 'ఎవర్ గ్రాండే 'కు హాంకాంగ్ కోర్టు గట్టి షాక్ ఇచ్చింది. పునర్వ్యవస్థీకరణ ప్రణాళికల ప్రకారం రుణ దాతలకు వాయిదాల చెల్లింపులో విఫలమైనందున సంస్థను లిక్విడేట్ చేయాలని సోమవారం ఆదేశించింది. రుణ దాతల పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక అమలు చేయలేకపోవడంతోపాటు దివాళా దిశగా అడుగులేస్తున్న ఎవర్ గ్రాండే సంస్థను మూసేయడం మంచిదని పేర్కొంటూ కోర్టు న్యాయమూర్తి లిండా చాన్ ఆదేశాలు జారీ చేశారు. ఎవర్ గ్రాండే లిక్విడేషన్‌కు జారీ చేసిన ఆదేశాలతో చైనా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. చైనా స్టాక్ మార్కెట్లో వివిధ సంస్థల స్టాక్స్ పై అమ్మకాల ఒత్తిళ్లు పెరుగుతాయని భావిస్తున్నారు. ఎవర్ గ్రాండే లిక్విడేషన్ ప్రక్రియ చేపడితే చైనాలో రియాల్టీ రంగం బిజినెస్ మీద విశ్వాసం సన్నగిల్లే అవకాశం ఉందని చెబుతున్నారు. 300 బిలియన్ డాలర్ల అప్పులపై కొత్త రుణాల పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎవర్ గ్రాండే తెలిపారు. అయితే, క్రెడిటర్ల తరపున విచారణకు హాజరైన న్యాయవాది పెర్గస్ సౌరిన్ స్పందిస్తూ ఎవర్ గ్రాండే వాదన ఆశ్చర్యకరంగా లేదన్నారు. ఎవర్ గ్రాండే మూసివేతకు దారి తీసిన పరిస్థితులపై ఆ సంస్థ యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. హాంకాంగ్ కోర్టు తీర్పు నేపథ్యంలో ఎవర్ గ్రాండే స్టాక్స్ 20 శాతానికి పైగా నష్టపోయాయి. ఫలితంగా కొంత సేపు హాంకాంగ్ స్టాక్ ఎక్స్ఛేంజీలో కొంత సేపు ట్రేడింగ్ నిలిపేశారు.చైనాలోని రియాల్టీ రంగంలో రుణాలు అదుపు తప్పాయి. వాటి నియంత్రణతోపాటు రియాల్టీ రంగాన్ని క్రమబద్ధీకరించేందుకు చైనా రెగ్యులేటరీ సంస్థలు కఠినమైన నిబంధనలు తెచ్చాయి. ఫలితంగా ఎవర్ గ్రాండే సహా పలు రియాల్టీ సంస్థలు ఆర్థికపరమైన చిక్కుల్లో పడ్డాయి. 2021లో వాయిదాలు చెల్లించడంలో ఎవర్ గ్రాండే విఫలమై దివాళా ప్రకటించింది.

### ఈ బడ్జెట్‌లో ట్యాక్స్ చెల్లింపుదారులకు
## ఉపశమనం లభించనుందా? పన్ను స్లాబ్



మధ్యంతర బడ్జెట్ రాబోతోంది. కొత్త పన్ను విధానాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు గత బడ్జెట్‌లో ప్రభుత్వం పలు మార్పులు చేసింది. అయినప్పటికీ, దేశంలోని 60 శాతం పన్ను చెల్లింపుదారులు ఇప్పటికీ పాత పన్ను విధానాన్ని ఇష్టపడుతున్నారు.ప్రభుత్వం కొత్త పన్ను విధానాన్ని మరింత ప్రాచుర్యం పొందాలంటే, ఈ వ్యవస్థలో అనేక మెరుగుదలలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు భావిస్తున్నారు. కొత్త పన్ను విధానాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రభుత్వం వ్యక్తిగత పన్ను రేట్లలో మార్పులు చేయాల్సి ఉంటుంది.అత్యధిక ఆదాయపు పన్ను రేటు ఉన్న ఆదాయపు పన్ను శ్లాబ్‌ను ప్రభుత్వం ప్రస్తుత రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచవచ్చని పన్ను నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం, అత్యధిక పన్ను శ్లాబుపై ప్రభుత్వం గరిష్టంగా 30 శాతం పన్నును విధిస్తుంది. ప్రత్యామ్నాయంగా, థ్రెషోల్డ్ రేటును 25 శాతానికి తగ్గించవచ్చు. ఈ మార్పులు పన్ను చెల్లింపుదారులు పన్నులపై మరింత ఆదా చేసేందుకు వీలు కల్పిస్తాయి. ఇది పాత విధానాన్ని వదిలిపెట్టి కొత్త పన్ను విధానాన్ని అనుసరించేలా పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహిస్తుంది.

ప్రతి సంవత్సరం రూ. 1 లక్ష ఆదా చేయండి:
పరిమితిని సంవత్సరానికి రూ.25 లక్షలకు పెంచినట్లయితే, సంవత్సరానికి రూ. 30 లక్షల కంటే ఎక్కువ ఆదాయం పొందే పన్ను చెల్లింపుదారుడు ప్రతి సంవత్సరం రూ.1.04 లక్షలు ఆదా చేయవచ్చు. 25 లక్షల ఆదాయం ఉన్నవారు రూ.98,800 ఆదా చేసుకోవచ్చని విశ్లేషణలు చెబుతున్నాయి.

మీకు ఉపశమనం ఎలా లభిస్తుంది?
బడ్జెట్‌లో పన్ను రేటు పరిమితిని రూ.20 లక్షలకు పెంచితే, ఏడాదికి రూ.25 లక్షల కంటే ఎక్కువ ఆదాయం పొందుతున్న పన్ను చెల్లింపుదారులు రూ.52,000 ఆదా చేసుకోవచ్చు. అదేవిధంగా, సంవత్సరానికి రూ. 20 లక్షలు సంపాదించే పన్ను చెల్లింపుదారుడు ప్రతి సంవత్సరం అదనంగా రూ.46,800 ఆదా చేస్తాడు. అయితే, ఇది ప్రతి సంవత్సరం రూ. 10 లక్షలు లేదా అంతకంటే తక్కువ ఆదాయాన్ని పొందుతున్న వారిపై ప్రభావం చూపదు.

## వచ్చే ఏడాదిలో భారత్‌లో టెస్లా కార్ల తయారీ షురూ..
-ఆ మోడల్ పేరు ఇదేనా..?!




గ్లోబల్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ 'టెస్లా'.. వచ్చే ఏడాది మధ్యలో ఇండియాలో 25 వేల డాలర్ల ధరకే చౌక ఎలక్ట్రిక్ కారు 'రెడ్ వుడ్' తయారు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్ తరం కస్టమర్లకు అందుబాటు ధరలో ఎలక్ట్రిక్ కార్లు, సెల్ఫ్ డ్రైవింగ్ రోబోటాక్సీలు తయారు చేయాలని టెస్లా సీఈఓ ఎలన్ మస్క్ భావిస్తున్నారు. వీటిల్లో 25 వేల డాలర్ల విలువైన ఎంట్రీ లెవల్ కారు కూడా ఉంటుంది. చైనాకు చెందిన బీవైడీ తయారు చేసే అధిక ధరలతో కూడిన ఈవీ కార్ల కంటే పెట్రోల్ వేరియంట్ కార్లతో పోటీ పడేలా ఎలక్ట్రిక్ కార్లను తయారు చేయాలని టెస్లా యాజమాన్యం భావిస్తున్నది. ఇదిలా ఉంటే 2023లో ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థగా టెస్లాను చైనా 'బీవైడీ' దాటేసింది.2020లోనే 25వేల డాలర్ల ధరకు కారు తయారు చేస్తానని ఎలన్ మస్క్ హామీ ఇచ్చారు. తర్వాత తన హామీని పక్కన బెట్టారు. తర్వాత అమెరికాలో 'మోడల్3' సెడాన్ కారు ధర 38,990 పలుకుతున్నది. ద్రవ్యోల్బణం ప్రభావంతో గతేడాది అమెరికా సహా పలు దేశాల కేంద్రీయ బ్యాంకులు వడ్డీరేట్లు భారీగా పెంచేయడంతో కస్టమర్ల గిరాకీపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు 'రెడ్ వుడ్' మోడల్ తయారీకి టెస్లా బిడ్లను ఆహ్వానించింది. తొలి దశలో వారానికి 10 వేల కార్లు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే, ఈ అంశంపై స్పందించడానికి టెస్లా యాజమాన్యం నిరాకరించింది.

## టాటా టియాగో.. టైగోర్ సీఎన్జీ ఏఎంటీ బుకింగ్స్ షురూ..!

టాటా మోటార్స్ తన టాటా టియాగో సీఎన్జీ ఏఎంటీ, టైగోర్ సీఎన్జీ వేరియంట్ కార్ల బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. ఆసక్తిగల కార్ల ప్రేమికులు ఈ కార్లు కావాలంటే రూ.21 వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చు. సీఎన్జీ వేరియంట్‌లో ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ (ఏఎంటీ) వర్షన్ ఆవిష్కరిస్తున్న తొలి కంపెనీగా టాటా మోటార్స్ నిలుస్తుంది.టాటా టియాగో సీఎన్జీ ఏఎంటీ మూడు వేరియంట్లు ఎక్స్ టీఏ, ఎక్స్ జడ్ం, ఎక్స్ జడ్ ఏ ఎన్‌ఆర్జీ, టైగోర్ సీఎన్జీ రెండు వేరియంట్లు ఎక్స్ జడ్ఏ, ఎక్స్ జడ్ ఏం సీఎన్జీ వేరియంట్లలో లభిస్తున్నది. టాటా మోటార్స్ సీఎన్జీ కార్లలో లగేజీ ఫ్రీ స్పేస్‌గా ఉండేందుకు బూట్ దిగువన ట్విన్ సిలిండర్లు ఉంటాయి. సింగిల్ అడ్వాన్స్ డ్ ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ కలిగి ఉండటంతో ఈ కార్లను నేరుగా సీఎన్జీ మోడ్‌లో డ్రైవ్ చేసుకుంటూ వెళ్లొచ్చు.టాటా టియాగో, టాటా టైగోర్ కార్లు 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ కలిగి ఉంటాయి. ఈ ఇంజిన్ గరిష్టంగా 86 పీఎస్ విద్యుత్, 113 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. పెట్రోల్, సీఎన్జీ వర్షన్ కార్లు 5-స్పీడ్ ఎంటీ, 5-స్పీడ్ ఏఎంటీ ఆప్షన్లు కలిగి ఉంటాయి. కొత్తగా టొర్నాడో బ్లూ కలర్ లో టియాగో, గ్రాస్ లాండ్ బీజ్ రంగులో టియాగో ఎన్‌ఆర్జీ, టైగోర్ మీటోర్ బ్రాంజ్ కలర్ ఆప్షన్ ల్లో లభిస్తుంది. టియాగో, టైగోర్, ఆల్ట్రోజ్, పంచ్ మోడల్ కార్లను సీఎన్జీ ఆప్షన్లలో టాటా మోటార్స్ ఆఫర్ చేస్తున్నాయి.


# చందన

# గుండెపోటును పదేళ్ల ముందే గుర్తించవచ్చు



ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని పదేళ్ల ముందే గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆక్స్ ఫర్డ్ యూనివర్శిటీ చేపట్టిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా గుండెపోటుతో కన్నుమూస్తున్నవారి సంఖ్య రానురాను పెరుగుతోంది. భారతీయులలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంది. కరోనా అనంతరం 20-30 ఏళ్ల మధ్య వయసున్న యువకులు కూడా గుండెపోటుకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆక్స్ ఫర్డ్ యూనివర్శిటీ చేపట్టిన పరిశోధన గుండెపోటుకు చెక్ పెట్టే దిశగా ఉండటం సంతోషకరమైన పరిణామం. తమ పరిశోధనలో భాగంగా శాస్త్రవేత్తలు యూకేలోని ఎనిమిది ఆసుపత్రులలో 40వేల మందికి చెందిన సిటి స్కాన్ నివేదికలను విశ్లేషించారు. వీరిపై మూడేళ్లపాటు పరిశోధనలు జరిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో గుండెకు రక్తాన్ని తీసుకువెళ్లే ధమనుల పనితీరును, వాటి లోపలి భాగంలో పేరుకుపోయే కొవ్వును గమనించే విధంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్ కి శిక్షణ ఇచ్చారు. తద్వారా ధమనుల్లో పూడికను ఖచ్చితంగా తెలుసుకుని, గుండెపోటును నివారించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## వారెవ్వా.. బామ్మా! ఒకేరోజు మూడు ప్రపంచ రికార్డులు



రికార్డులకు, అవార్డులకు వయస్సుతో పనేముందని నిరూపించిందో బామ్మ. 99 ఏళ్ల వయసులో ఈజీగా ఈత కొట్టడం మాత్రమే కాదు. ఒకే రోజు ఏకంగా మూడు ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది. డచ్-కెనడియన్ బెట్టీ బ్రస్సెల్ ఈ నెల 20న అద్భుతమైన ఈ ఫీట్ సాధించింది. 400-మీటర్ల ఫ్రీస్టైల్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ 50-మీటర్ల బ్యాక్ అనే మూడు విభాగాల్లో తన సత్తా చాటింది. తనకు ఏజ్ అస్సలు మేటర్ కాదంటోంది. స్విమ్మింగ్ కెనడా లెక్కల ప్రకారం 12 నిమిషాల 50 సెకన్లతో ఉన్న 400-మీటర్ల ఫ్రీస్టైల్ రికార్డును దాదాపు నాలుగు నిమిషాల్లో బ్రేక్ చేసింది. అలాగే 50-మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌ను ఐదంటే ఐదు సెకన్లలో ఛేదించి వాహ్వా అనిపించుకుంది. "నేను రేసులో ఉంటే ఇక దేన్నీ పట్టించుకోను. ఐ ఫీల్ లైక్ ఎ ఉమెన్!" అని చెప్పిందామె. బ్రస్సెల్ 60 సంవత్సరాల వయస్సు నుండి మాత్రమే స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటూ ఉండటం విశేషం. కానీ ఇటీవలి అనేక ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టిన ఘనతను దక్కించుకుంది. "అమ్మా నీకు ముసలి తనం వచ్చేసిందని నా 70 ఏళ్ల చిన్న కొడుకుఅంటూ ఉంటాడు. కానీ నాకు అలా అనిపించదు. నిజంగా అలసి పోయినప్పుడు మాత్రం కొంచెం అనిపిస్తుంది. అంతే" అంటారామె. అలాగే రికార్డుల గురించి కూడా ఆలోచించను. చేయాల్సిన పనిని ధైర్యంగా చేసేస్తాను. గెలిస్తే సంతోషిస్తాను అంటుంది బోసి నవ్వులతో. బ్రస్సెల్స్ కనీసం వారానికి రెండుసార్లు స్విమ్మింగ్ చేస్తుంది.

## కొత్త తల్లుల కోసం ఈ పోషక ఆహారాలు చాలా అవసరం



స్త్రీ జీవితంలో మాతృత్వం చాలా ముఖ్యమైన దశ. ఆమె తొమ్మిది నెలలు జీవితాన్ని గడిపి ఈ భూమిపైకి వస్తుంది. ఈ సమయంలో అంటే డెలివరీ తర్వాత ఆమెలో అనేక శారీరక మరియు మానసిక మార్పులు జరగడం ప్రారంభిస్తాయి. ప్రసవం తర్వాత దాదాపు 6 నుండి 8 వారాల వరకు ఆమెను బాగా చూసుకోవాలి. ఎందుకంటే ఆమె ప్రసవ సమయంలో కోల్పోయిన శక్తిని తిరిగి పొందాలి. దీనికి ఏకైక మార్గం మంచి పోషకాహారం పొందడం. అది ఎలా పొందాలని చింతిస్తున్నారా? అప్పుడు ఈ కథనాన్ని చదవండి. 500 సంవత్సరాల తర్వాత కేదార రాజయోగం: ఈ 3 రాశుల జీవితం బిందాస్ కొత్త తల్లుల కోసం కొన్ని పోషకాహార చిట్కాలు క్రింద ఉన్నాయి: 1. కుటుంబ సభ్యుల నుండి సహాయం పొందండి: మొదటి రెండు వారాలలో, మీరు ఇంట్లో తయారుచేసిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం చాలా అవసరం. కాబట్టి డెలివరీ తర్వాత మీ కోసం ఆహారాన్ని సిద్ధం చేయడానికి మీ కుటుంబం లేదా మీ స్నేహితుల సహాయం తీసుకోండి. లేచి పరుగెత్తడం, భోజనాలు సిద్ధం చేసే పనికి వెళ్లడం మంచిది. 2. అల్పాహారాన్ని దాటవేయవద్దు: మీ శక్తి స్థాయిని మరియు తల్లి పాల ఉత్పత్తిని నిర్వహించడానికి మీరు ఉదయం మంచి అల్పాహారం తీసుకోవాలి. మీ అల్పాహారం తృణధాన్యాలు, పండ్లు లేదా కూరగాయలతో పాటు ప్రోటీన్‌ను కలిగి ఉండాలి. 3. ప్రోటీన్: ప్రోటీన్ చాలా అవసరం కాబట్టి మేము ఈ విషయాన్ని పునరావృతం చేస్తున్నాము. మీరు తినే ప్రతి ఆహారంలో ప్రోటీన్ ఉంటుంది. ఇది పాలిచ్చే తల్లులకు అవసరమైన పోషకాహారం. ఇది ప్రతి ఒక్కరి జీవితాన్ని కొద్దిగా సులభం చేస్తుంది. మాంసం, చేపలు మరియు పౌల్ట్రీ వంటి జంతు ఆధారిత ప్రోటీన్లను తక్కువ మొత్తంలో తినండి. తృణధాన్యాలు మరియు విత్తనాలు వంటి మొక్కల ఆధారిత ప్రోటీన్లను ఎక్కువగా తీసుకోవచ్చు. మీ ముఖం మెరవటానికి ఈ విధంగా ఫేస్ మసాజ్ కేవలం 5 నిముషాలు చేస్తే చాలు..! 4. ఆరోగ్యకరమైన స్నాక్స్ తరచుగా తినండి: కొన్ని పోషకాలను తక్కువ మొత్తంలో తరచుగా తినండి. పండ్లు మరియు కూరగాయలు, ఉడికించిన గుడ్లు మొదలైనవాటిని ఎప్పటికప్పుడు తినండి. ఇది మీ శక్తిని బలహీనపరుస్తుంది. తల్లిపాలు ఇస్తున్న మీకు ఇది చాలా ముఖ్యం. 5. హైడ్రేటెడ్ గా ఉండండి: ఇది చాలా ముఖ్యమైనది. పాలిచ్చే తల్లులు రోజుకు 10 నుండి 15 గ్లాసుల నీరు త్రాగి దాహం తీర్చుకుంటారు మరియు తగినంత తల్లి పాలు ఉత్పత్తి చేస్తారు. ఆరోగ్యకరమైన జీర్ణక్రియను నిర్వహించడం కూడా చాలా ముఖ్యం. ఎల్లప్పుడూ కొంచెం నీరు చేతిలో ఉంచుకోండి. ఇది మీకు మరియు మీ బిడ్డకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. 6. కొల్లాజెన్ రిచ్ ఫుడ్స్ తినండి: కొల్లాజెన్ మీ కణజాలాలను పునర్నిర్మించడానికి ఒక సూపర్ ఫుడ్. ఉడికించిన మాంసం మరియు ఎముకలను తీసుకోవడం ద్వారా దీనిని పొందవచ్చు. మీరు స్టోర్‌లో హైడ్రోలైజ్డ్ కొల్లాజెన్ పౌడర్‌లను కూడా పొందవచ్చు. కుజుడు-శుక్రుడు కలయికతో ఏర్పడిన ధనశక్తి యోగం: ఈ 3 రాశుల వారు ఫిబ్రవరిలో ధన లాభం పొందుతారు. 7. తగిన సప్లిమెంట్లను తీసుకోండి: తల్లిపాలు ఇస్తున్నప్పుడు మీ అధిక-నాణ్యత విటమిన్లు తీసుకోవడం కొనసాగించండి. సాధ్యమైనప్పుడల్లా, వైద్యుడు సిఫార్సు చేసిన అధిక-నాణ్యత, ఆహార ఆధారిత సప్లిమెంట్లను ఎంచుకోండి.

## జుట్టు రాలడం తగ్గించడానికి కరివేపాకు నూనె ఎలా తయారుచేయాలి? ఎలా వాడాలి



జుట్టు రాలడం అనేది చాలా మందికి సాధారణ ఆందోళన. మరియు దానిని సహజంగా పరిష్కరించడం అనేది జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఒక సంపూర్ణమైన విధానం. కరివేపాకు, సమృద్ధిగా ఉండే పోషకాలు మరియు యాంటీఆక్సిడెంట్లకు ప్రసిద్ధి చెందింది, ఇంట్లో తయారుచేసిన కరివేపాకు నూనెలో విలువైన పదార్థంగా ఉంటుంది. మీ గర్ల్ ఫ్రెండ్ లేదా పార్ట్నర్ ను క్యూట్ గా ఇలా కూడా పిలవొచ్చు..! ఈ పేర్లతో మీరూ ట్రై చేయండి కరివేపాకు హెయిర్ ఆయిల్ జుట్టు నష్టంతో పోరాడటానికి మరియు బలమైన, ఆరోగ్యకరమైన జుట్టును ప్రోత్సహించడంలో మీకు సహాయపడుతుంది. వాటిని ఎలా తయారు చేయాలనే దానిపై దశల వారీ గైడ్ కోసం ఈ కథనాన్ని చూడండి. అవసరమైనవి 1 కప్పు తాజా కరివేపాకు ఫిబ్రవరి నెలలో పండుగలు, వ్రతాలు, ఏకాదశి మరియు వాలెంటైన్స్ డే పూర్తి వివరాలు..! 1 కప్పు కొబ్బరి నూనె (లేదా ఆలివ్ ఆయిల్ లేదా బాదం నూనె వంటి ఏదైనా ఇతర క్యారియర్ ఆయిల్) సూచనలు ఏదైనా మురికి లేదా మలినాలను తొలగించడానికి కరివేపాకులను బాగా కడగాలి. కడిగిన ఆకులను గాలికి ఆరనివ్వండి, తేమ లేదని నిర్ధారించుకోండి. మీ జుట్టు రకానికి సరైన క్యారియర్ ఆయిల్‌ను ఎంచుకోండి. కొబ్బరి నూనె దాని పోషక లక్షణాల కారణంగా ఒక ప్రసిద్ధ ఎంపిక. కానీ ఆలివ్ నూనె లేదా బాదం నూనె కూడా ఉపయోగకరంగా ఉంటుంది. కేవలం 2 వెల్లుల్లి రెబ్బలు పురుషులలో ఈ 3 లైంగిక సమస్యలను నయం చేస్తాయి. కరివేపాకు నూనెను వేడి చేయండి ఒక సాస్పాన్లో, ఎంచుకున్న క్యారియర్ నూనెను తక్కువ నుండి మీడియం వేడి మీద వేడి చేయండి. నూనెలోని పోషక పదార్థాలను సంరక్షించడానికి వేడి సున్నితంగా ఉండేలా చూసుకోండి. కరివేపాకు జోడించండి నూనె వేడి అయ్యాక, ఎండు కరివేపాకును బాణలిలో వేయాలి. అప్పుడప్పుడు గందరగోళాన్ని, సుమారు 10-15 నిమిషాలు తక్కువ వేడి మీద నూనెలో చొప్పించండి. వేడిని ఆపివేసి, నూనెను గది ఉష్ణోగ్రతకు చల్లబరచడానికి అనుమతించండి. కరివేపాకులను కలిపిన నూనె నుండి వేరు చేయడానికి మరియు మృదువైన ఆకృతిని నిర్ధారించడానికి నూనెను వడకట్టండి. వేరే బాటిల్ కు మార్చండి వేప నూనెను శుభ్రమైన, గాలి చొరబడని బాటిల్లో నిల్వ చేయండి. ఇది నూనె యొక్క శక్తిని కాపాడటానికి సహాయపడుతుంది. ఎలా వాడాలి కరివేపాకు నూనెను మీ స్కాల్ప్ మరియు హెయిర్‌కి అప్లై చేసి వృత్తాకార కదలికలలో సున్నితంగా మసాజ్ చేయండి. గరిష్ట ప్రయోజనాల కోసం చిట్కాలకు మూలాలు మీ జుట్టు మరియు తలపై నూనెను కనీసం 30 నిమిషాల నుండి గంట వరకు లేదా రాత్రిపూట ఉంచండి. షాంపూతో శుభ్రం చేయి నూనెను తొలగించడానికి మీ జుట్టును తేలికపాటి షాంపూతో కడగాలి. అన్ని నూనెలు ప్రభావవంతంగా కొట్టుకుపోయాయని నిర్ధారించుకోవడానికి మీరు రెండుసార్లు షాంపూ చేయవలసి ఉంటుంది. రెగ్యులర్ ఉపయోగం సరైన ఫలితాల కోసం, ఈ కరివేపాకు జుట్టు నూనెను వారానికి ఒకటి లేదా రెండుసార్లు ఉపయోగించండి. జుట్టు రాలడం మరియు మెరుగైన జుట్టు ఆరోగ్యం యొక్క సంభావ్య ప్రయోజనాలను అనుభవించడానికి స్థిరత్వం కీలకం.

## బడ్జెట్ ముందు మార్కెట్ల ర్యాలీ.. 1100 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..



గతవారం తీవ్ర ఒడిదొడుకులను అధిగమించిన దేశీయ స్టాక్ మార్కెట్లు నేడు ఊహించని రీతిలో ర్యాలీని కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 1100 పాయింట్లకు పైగా లాభంతో లాంఛనంగా ముందుకు కొనసాగుతోంది. మధ్యాహ్నం 1.43 గంటల సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 1123 పాయింట్ల లాభంతో ఇంట్రాడేలో దూసుకుపోతోంది. ఇదే క్రమంలో మరో కీలక సూచీ నిఫ్టీ 343 పాయింట్ల పెరుగుదలను నమోదు చేసింది. ఇదే క్రమంలో నిఫ్టీ బ్యాంక్ సూచీ 556 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 572 పాయింట్ల మేర పెరుగుదలను నమోదు చేశాయి. ఈ మెగా ర్యాలీకి అసలు కారణాలను తెలుసుకోవాలని చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లు కుతూహలంగా ఉన్నారు. వాస్తవానికి మరో రెండు రోజుల్లో జనవరి మాసం ముగియటంతో పాటు ఫిబ్రవరి 1న కొత్త మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి కేంద్రంలోని బీజేపీ సర్కార్ సిద్ధంగా ఉంది. బడ్జెట్ ముందు మార్కెట్లు బుల్ జోరును ప్రదర్శిస్తున్నప్పటికీ.. ఈ వారం మార్కెట్లు బడ్జెట్ ప్రకటనతో పాటుగా యూఎస్ సెంట్రల్ బ్యాంక్ మానిటరీ పాలసీ సమావేశం ఉన్నందున ఓలటాలిటీ కొనసాగుతుందని చాలా మంది మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. వీటికి తోడు ఆసియా మార్కెట్లతో పాటు, అమెరికా మార్కెట్లంతటా సానుకూల సంకేతాలు కొనసాగటం ఊరటను కలిగిస్తోంది. యూఎస్ క్యూ4 ఆర్థిక గణాంకాలు ఊహకు మించిన పనితీరును కనబరచటం కలిసొచ్చే అంశంగా ఉంది. ఇక మార్కెట్ల ర్యాలీకి దోహదపడుతున్న మరో అంశం క్యూ3 కార్పొరేట్ ఫలితాలు. బ్యాంకింగ్ నుంచి ఐటీ, తయారీ, ఎఫ్ఎమ్సీజీ రంగాల్లోని పలు ప్రముఖ కంపెనీలు ఇప్పటికే తమ ఫలితాలను ప్రకటించాయి. మరిన్ని కంపెనీలు ప్రకటిస్తున్న గణాంకాలు ఆర్థిక అస్థిరతల్లోనూ సానుకూలంగా ఉండటం పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని నిపుణులు చెబుతున్నారు. వేగంగా వృద్ధి చెందుతున్న భారత మార్కెట్లు విదేశీ పెట్టుబడిదారులకు స్వర్గధామంగా మారటం కూడా ర్యాలీలో భాగమైందని తెలుస్తోంది.

# కడుపులోని ఈ భాగంలో నొప్పి ఉందా? మీ కిడ్నీడ్యామేజ్ అవుతుంది జాగ్రత్త..



కడుపు నొప్పి మరియు ఉబ్బరం అనేది ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ప్రజలు ఎదుర్కొంటున్న సాధారణ మరియు రోజువారీ ఆరోగ్య సమస్య. అనారోగ్యకరమైన ఆహారాన్ని ఎక్కువగా తిన్నా లేదా కడుపులో ఎక్కువ ఆహారం తీసుకున్నా ఈ రెండూ సంభవించవచ్చు. అయితే, ఎటువంటి కారణం లేకుండా పొత్తికడుపు ప్రాంతంలో నొప్పి లేదా అసౌకర్యాన్ని అనుభవిస్తే, దానిని తేలికగా తీసుకోకూడదు. ఎందుకంటే ఇది శరీరంలో తీవ్రమైన సమస్యకు సంకేతం కూడా కావచ్చు. పాదాలలో అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు..!ఈ లక్షణాలు ఏమాత్రం విస్మరించినా హార్ట్ అటాక్..స్ట్రోక్ ..జాగ్రత్త %ూణఎజు=ుxూజువీజుచీ% ఉదర ప్రాంతంలో కుడి ఉదరం, ఎడమ పొత్తికడుపు, ఎగువ ఉదరం మరియు మధ్య పొత్తికడుపు ఉంటాయి. ఈ ప్రాంతాలలో ప్రతిదానిలో అనుభవించే నొప్పి ఆ ప్రాంతంలోని సమస్య యొక్క లక్షణాలు కావచ్చు. కాబట్టి కడుపునొప్పి వస్తే తేలిగ్గా తీసుకోకుండా వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్లి పరీక్షలు చేయించుకోండి. ఇప్పుడు కడుపునొప్పిలో ఏ భాగానికి అర్థం అవుతుందో చూద్దాం. ఉదరం యొక్క కుడి వైపున నొప్పి ఒక వ్యక్తి నిరంతరం ఉదరం యొక్క కుడి వైపున నొప్పిని అనుభవిస్తూ ఉంటే, అది అపెండిసైటిస్ యొక్క సంకేతం. అపెండిక్స్ అనేది పెద్ద ప్రేగులకు జోడించిన చిన్న పర్సు. ఈ సంచి మంటగా మారితే, అది మంటగా మారి తీవ్రమైన నొప్పిని కలిగిస్తుంది. చికిత్స చేయకుండా వదిలేస్తే, ఈ అపెండిసైటిస్ ప్రాణాంతకం కావచ్చు. నొప్పి సాధారణంగా నాభి నుండి మొదలవుతుంది మరియు కొన్ని గంటల్లో ఉదరం యొక్క కుడి వైపుకు వ్యాపిస్తుంది. అపెండిసైటిస్ యొక్క లక్షణాలు వికారం, వాంతులు, ఆకలి లేకపోవడం, జ్వరం, ఉదరం యొక్క కుడి వైపున నొప్పితో పాటు. అపెండిసైటిస్ యొక్క సంక్లిష్టతలను తరచుగా శస్త్రచికిత్సతో నయం చేయవచ్చు. ఉదరం మధ్యలో నొప్పి మీరు పొత్తికడుపు మధ్యలో నొప్పిని ఎదుర్కొంటుంటే, అది యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వల్ల కావచ్చు. మూత్రాశయం లేదా మూత్రపిండాలను ప్రభావితం చేసే సాధారణ అంటువ్యాధులు. ఈ అంటువ్యాధులు చికిత్స చేయకుండా వదిలేస్తే, అవి తీవ్రమైనవి మరియు పురోగతి చెందుతాయి, దీని వలన మూత్రపిండాలకు పెద్ద నష్టం వాటిల్లుతుంది. మీకు %ఖు×% ఇన్ఫెక్షన్ ఉన్నట్లయితే, ఉదరం మధ్యలో నొప్పితో పాటు మూత్రవిసర్జన సమయంలో నొప్పి లేదా చికాకు, తరచుగా మూత్రవిసర్జన వంటి లక్షణాలను మీరు అనుభవించవచ్చు. అంటువ్యాధులు సాధారణంగా యాంటీబయాటిక్స్‌తో చికిత్స పొందుతాయి. ఎగువ కుడి వెన్నునొప్పి మీరు తరచుగా మీ కుడి వెనుక భాగంలో నొప్పిని కలిగి ఉన్నారా? అలా అయితే, అది తీవ్రమైన కిడ్నీ ఇన్ఫెక్షన్‌కి సంకేతం కావచ్చు. కిడ్నీ ఇన్ఫెక్షన్ ఉన్నట్లయితే, అది ఎగువ కుడి వెనుక భాగంలో నొప్పిని కలిగిస్తుంది మరియు జ్వరం, చలి, శరీర అలసట మరియు గందరగోళ మూడ్ వంటి లక్షణాలను కలిగిస్తుంది. ఈ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ఉదరం మధ్యలో నొప్పి మీరు మీ పొత్తికడుపు మధ్యలో తీవ్రమైన నొప్పిని అనుభవిస్తే, మీరు ప్రకోప ప్రేగు సిండ్రోమ్ కలిగి ఉండవచ్చు. అనేది పెద్దప్రేగును ప్రభావితం చేసే దీర్ఘకాలిక రుగ్మత. ఈ సమస్య ఉన్నట్లయితే, అది కడుపు నొప్పి, ఉబ్బరం మరియు ప్రేగు అలవాట్లలో మార్పులకు దారితీయవచ్చు. ఒక వ్యక్తికి %×దీూ% ఎందుకు వస్తుంది అనే ఖచ్చితమైన కారణం తెలియదు. కానీ జన్యుశాస్త్రం, అసాధారణ కండరాల సంకోచాలు మరియు పేగులో మంటలు అన్నీ కారణమని చెప్పవచ్చు. ఈ సమస్యకు వెంటనే వైద్య సహాయం తీసుకోండి. ఎగువ పొత్తికడుపు నొప్పి మీరు మీ కడుపు ఎగువ భాగంలో నొప్పిని అనుభవిస్తే, మీకు పిత్తాశయ రాళ్లు ఉండవచ్చు. పిత్తాశయం కొవ్వులను జీర్ణం చేయడానికి అవసరమైన పిత్త నీటిని నిల్వ చేస్తుంది. అయితే శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నప్పుడు పిత్తాశయ రాళ్లు ఏర్పడతాయి. మీకు పిత్తాశయ రాళ్లు ఉంటే, మీరు ఎగువ పొత్తికడుపు నొప్పి, వికారం, వాంతులు మరియు అపానవాయువు వంటి లక్షణాలను అనుభవించవచ్చు. ఈ సమస్యకు చికిత్స చేయడానికి మరియు పిత్తాశయ రాళ్లను కరిగించడానికి సాధారణంగా మందులు ఉపయోగిస్తారు. తీవ్రమైన సందర్భాల్లో, వైద్యులు శస్త్రచికిత్స ద్వారా పిత్తాశయ రాళ్లను తొలగించవచ్చు.



## మరింత చురకుగా సమంత

అగ్ర నటీమణుల్లో ఒకరైన సమంత ఎయిర్ పోర్టు నుండి వస్తున్నప్పుడో, వెళుతున్నప్పుడో ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ఉంటాయి. సమంత మయోసిటిస్ అనే వ్యాధితో బాధపడుతూ అందుకోసమని ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్న సంగతి కూడా తెలిసిందే. ఆమె చివరి సినిమా 'ఖుషి' విడుదలైంది, ఆ తరువాత ఆమె సినిమాలు ఏమీ కొత్తవి ఒప్పుకోలేదు, కానీ నిర్మాతగా కొన్ని సినిమాలు చేస్తాను అని చెప్పారు. ఈమె చెయ్యాల్సిన సినిమా ఒకటి ఇప్పుడు శృతి హాసన్ చేస్తున్నారు. అంటే సమంత ఇప్పట్లో సినిమాలు చేసే పరిస్థితి కనిపించడం లేదు అని తెలుస్తోంది. అయితే ఇంతకీ సమంత మళ్ళీ వెండితెర మీద కనిపించేదా, అనే సందేహం కూడా ఆమె అభిమానుల్లో చోటుచేసుకుంటోంది. ఎందుకంటే ఆమె చివరి సినిమా 'ఖుషి' గత సంవత్సరం సెప్టెంబర్ 1న విడుదలైంది. ఆ సినిమా విడుదలవ్వకముందే సమంత అమెరికా వెళ్లి అక్కడ విశ్రాంతి తీసుకుంది. మళ్ళీ ఇండియా వచ్చింది, ఇక్కడ సినిమాలు చెయ్యడం లేదు కానీ, చాల చురుకుగా సామాజిక మాధ్యమాల్లోనూ, అలాగే కొన్ని షోస్ లో కనపడుతూ అభిమానులను అలరిస్తున్నారు.



## నటి కీర్తి సురేశ్‌కు భారీ ఫ్యాన్స్ ఫాలోయింగ్

మహానటి సినిమాతో దేశవ్యాప్తంగా బాగా క్రేజ్ తెచ్చుకున్న కీర్తి సురేష్ కెరీర్ ఒక్క అడుగు ముందుకేస్తే రెండడుగులు వెనుకకు అన్నట్లుగా ఉంది. 2023లో తెలుగులో దసరా, భోళా శంకర్ రెండు సినిమాలు, తమిళంలో మామన్నన్ అనే మూడు సినిమాలు చేయగా ఈ యేడు తెలుగులో ఇప్పటికీ ఒక్క సినిమా కూడా సంతకం చేయకపోవడం గమనార్హం. గర్ల్ నెక్స్ట్ డోర్ వంటి క్యారెక్టర్లతో మొదలు పెట్టి నిత్యం వైవిధ్యభరిత పాత్రలను చేసుకుంటూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బాలీవుడ్ మీద దృష్టి పెట్టింది. ఇప్పటివరకు సౌత్ ఇండియా అన్ని ఇండస్ట్రీలలోను మంచి పాపులారిటీని సంపాదించుకున్న ఈ నటికి ఫ్యాన్ బేస్ భారీగానే ఉండగా సోషల్ మీడియాలోను చాలా యాక్టివ్‌గా ఉంటుంది. అయితే ఈ ఫ్యాన్స్ విషయంలోనే తాజాగా ఓ వార్త నెట్టింట బాగా వైరల్ అవుతున్నది. విషయానికి వస్తే.. కృష్ణ అనే ఓ వీరాభిమాని కీర్తికి డైహార్డ్ ఫ్యాన్. ఈ క్రమంలో కీర్తికి సోషల్‌మీడియా ప్లాట్ ఫాం ఎక్స్‌లో ఇప్పటివరకు 233 లేఖలు రాయడమే కాకుండా వాటికి రిప్లై ఇవ్వాలని చాలాసార్లు కోరాడు. చివరకు 234వ లెటర్‌కు స్పందించిన కీర్తి ఇంత ఆలస్యంగా సమాధానం ఇచ్చినందుకు క్షమాపణలు కోరింది. మీలాంటి అభిమాని నాకు లభించడం నా అదృష్టం అని, ఆ నెంబర్ నాకు ఫాంటసీ నెంబర్ అని చెప్పి తన అభిమానిని ఖుషీ చేసింది. సడన్‌గా కీర్తి ఓ ఫ్యాన్ కామెంట్స్‌ను చదివి సమాధానం ఇవ్వడంతో ఆమె ఫ్యాన్స్ చాలా హ్యాపీగా ఫీలవుతూ ఆమె ట్వీట్‌ను రీ ట్వీట్ చేస్తున్నారు.

## మంగళవారం సినిమాకు అవార్డుల పంట

ఆర్‌ఎక్స్ 100', 'మహాసముద్రం' చిత్రాల తర్వాత అజయ్ భూపతి దర్శకత్వం వహించిన సినిమా 'మంగళవారం'. ఈ సినిమా ఒక సస్పెన్స్ థ్రిల్లర్ తో కూడి వున్న నేపథ్యంలో వచ్చింది. థియేటర్స్ లో విడుదలై అక్కడ మంచి విజయం సాధించిన ఈ చిత్రం ఇటీవల పాపులర్ ఓటిటి డిస్నీ హాట్ స్టార్ లో కూడా విడుదలై ప్రపంచవ్యాప్త ప్రేక్షకులని కూడా అలరిస్తోంది. మా 'మంగళవారం', టెక్నీషియన్స్ సినిమా అని గర్వంగా చెబుతున్నాను!' అని దర్శకుడు అజయ్ భూపతి సక్సెస్ మీట్ లో చెప్పింది నిజం చేస్తూ ప్రతిష్టాత్మకంగా జరిగే జైపూర్ ఫిలిం ఫెస్టివల్ లో ఈ సినిమా నాలుగు అవార్డులని గెలుచుకుంది. అందులో ఈ సినిమాలో ఒక బోల్డ్ పాత్రలో నటించిన పాయల్ రాజపుత్ కి ఉత్తమ నటి అవార్డు దక్కింది. అలాగే ఈ సినిమా సాంకేతికపరంగా కూడా ఎంతో బాగుంది అని ఏకగ్రీవంగా అందరూ ఆమోదించారు. అందులో కూడా మూడు అవార్డులు ఈ సినిమా గెలుచుకుంది. చిత్ర నిర్మాతలు ముద్ర మీడియా వర్క్స్ స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ ఈ విషయాన్ని సంతోషంగా చెబుతూ అవార్డులు గెలిచిన వారి పేర్లు వెల్లడించారు...




## ఆగస్ట్‌లో విడుదలకు సిద్ధంగా పుష్ప-2


టాలీవుడ్‌లో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ సినిమాల్లో ఒకటి 'పుష్ప.. ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో




తెరకెక్కి బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన పుష్ప.. ది రైజ్‌కు సీక్వెల్‌గా వస్తున్న ఈ మూవీలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్పరాజ్‌గా మరోసారి ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించేశారు మేకర్స్. ఈ సందర్భంగా పుష్ప రాజ్ తన రూల్‌ను ప్రారంభించడానికి ఇంకా 200 రోజులు మిగిలి ఉందంటూ మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇక ఈ పోస్టర్‌లో ఒక కొండపై పులి కనిపిస్తున్నట్లు ఉంది. కాగా ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్‌గా మారింది. ÷ఎప్ప.. ది రూల్ కోసం రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ నుంచి ఫస్ట్ పార్టును మించిపోయే మరో చార్ట్ బస్టర్ ఆల్బమ్ రాబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఫస్ట్ పార్టులో శ్రీవల్లిగా నటించిన కన్నడ సోయగం రష్మిక మందన్నా సీక్వెల్‌లో మరోసారి ఫీ మేల్ లీడ్ రోల్‌లో కనిపించనుంది.

## ఊరి పేరు భైరవకోన విడుదల తేదీల్లో మార్పు

సంక్రాంతి పండగ నాడు నాలుగు సినిమాలు విడుదలయ్యాయి. అయితే అప్పుడు ఐదో సినిమా రవితేజ నటించిన 'ఈగల్' కూడా విడుదలవ్వాల్సి వుంది కానీ, నిర్మాతల మండలి, తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆ సినిమా నిర్మాతల మధ్య సయోధ్య కుదిర్చి 'ఈగల్ సినిమాని వాయిదా వేసుకోమని చెప్పారు. అప్పు డు పోటీ లేకుండా చేస్తామని కూడా ఆ సినిమా నిర్మాతకి హామీ ఇచ్చారు. తరువాత 'ఈగల్' ఫిబ్రవరి 9న విడుదల చెయ్యాలని నిర్ణయించుకొని ఆ తేదీని ప్రకటించారు. ఈ సినిమా ప్రచారాలు కూడా మొదలెట్టేసారు, ఫిబ్రవరి 9 తప్పితే మాకు ఇంకా వేరే తేదీ లేదు విడుదల చెయ్యడానికి అని కూడా ఒక ప్రచార ఈవెంట్ లో చెప్పేసాడు సందీప్ కిషన్. ఇది తెలిసి పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ కొన్ని రోజుల క్రితం, నిర్మాతల మండ"లికి, తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కి ఒక లేక రాశారు. అందులో 'ఊరు పేరు భైరవకోన' సినిమా విడుదల వాయిదా వేసుకోమని ఆ సినిమా నిర్మాతకి చెపుతారని తెలిసింది. అతను కూడా ఇంకో కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నారని కూడా తెలిసింది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com